శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పేపర్ లీక్ నియంత్రణ చట్టసవరణ విద్యార్థులను శాంతింపజేసేందుకే...
ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మండిపాటు 07

ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమన్న హామీని నిలబెట్టుకోవాలి
పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్

సంపుటి 09, సంచిక: 241 | శుక్రవారం | 31-07-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## మెరుగైన విద్యా బోధనకు
# ఏం కావాలో చెప్పండి



**మండలంలోని పాఠశాలల్లో ఏం వసతులు, ఎంతమంది ఉపాధ్యాయులు కావాలి**

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు అవసరమైన అంశాలతో ప్రణాళిక ఇవ్వండి
- అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తాం
- విద్యపై ఎంతైనా ఖర్చుపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- ఫిన్లాండ్, జర్మనీల్లో పర్యటించిన ఉపాధ్యాయులతో సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళికను రూపొందించాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు.మండలంలోని పాఠశాలల్లో ఏం వసతులు, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు?, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు అవసరమైన అంశాలతో 'డిసెంబరు నెలాఖరు' వరకు ప్రణాళికను తమకు అందజేస్తే, అందుకు అనుగుణంగా తాము కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విదేశీ పర్యటనలో తెలుసుకున్న అంశాలను ఇక్కడి విద్యార్థులకు బోధించి, వారిని ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సిఎం సూచించారు.'టీచర్ ఇంటర్‌నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌ంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో గురువారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు రూపొందించే ప్రణాళిక కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. రానున్న ఐదేళ్లు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని,దీనిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిగా చూడాలన్నారు. ప్రభుత్వం ఇంత మొత్తం ఖర్చు చేస్తున్నప్పటికీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరువాయి 8లో

### విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?

కొందరు తాను విద్యా శాఖ మంత్రిగా రాజీనామా చేయాలని చెబుతున్నారని, ఎందుకు రాజీనామా చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా?, టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా?, లేదా ఐటిఐలను ఎటిసిలుగా మార్చినందుకా?, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? అని సిఎం నిలదీశారు. ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో సమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదన్నారు. సమాజ మార్పు కోసమే తాను విద్యా శాఖ బాధ్యతలను తీసుకున్నానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు.


ఎల్లంపల్లి...


జూరాల...

# రాష్ట్రం అలర్ట్

- భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్
- హైదరాబాద్‌కు ఆరెంజ్ హెచ్చరిక
- గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంపై వాయుగుండం, ఉపరితల ఆవర్తనం తీవ్ర ప్రభావం చూపుతుండటంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతుండగా, రానున్న వారం రోజుల పాటు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రెడ్ అలర్ట్ జారీ చేశామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు కూడా ప్రకటించారు. గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మెదక్, తరువాయి 8లో


కాళేశ్వరం...

## ప్రాజెక్టులకు జలకళ

- ఉరకలేస్తున్న గోదావరి
- భద్రాచలం వద్ద 28 అడుగులకు చేరిక
- జూరాలకు భారీగా వస్తోన్న నీరు : పది గేట్లు ఎత్తివేత

ఎగువ ప్రాంతాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతోంది. ఈ సీజన్‌లో మొదటిసారి రిజర్వాయర్లలో నీటి నిల్వలు 33 శాతానికి చేరాయి. గోదావరిలో ప్రవాహం ఉధృతంగా ఉంది. కృష్ణాలో ప్రవాహాలు బాగా ఉండి శ్రీశైలం దిశగా వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి 1,69,273 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయంలోకి పెద్ద నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.14 టిఎంసిల నీటి నిల్వ, 146.90 మీటర్ల నీటి మట్టం ఉండగా, ఇన్‌ఫ్లో 2,75,413 క్యూసెక్కులు ఉంది. గురువారం రాత్రి ఎల్లంపల్లి డ్యామ్ గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద భారీగా వచ్చి తరువాయి 8లో



## నీట్, ఎన్‌టిఎను రద్దు చేయాలి

- లీకేజీలో అరెస్టయిన వారి పేర్లు బైటపెట్టాలి
- విద్యార్థులపై దాష్టీకానికి హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాల్సిందే
- రాజ్యసభలో పేపర్ లీకేజ్ సవరణ బిల్లుపై చర్చలో సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్

**న్యూఢిల్లీ :** వైద్య విద్య జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నీట్‌ను, అలాగే దానిని నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగం ప్రక్షాళనకు పైపై మెరుగులు సరిపోవని, సమగ్ర సంస్కరణలు అవసరమని సూచించారు. నీట్ లీకేజీకి బాధ్యత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, అలాగే ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు.గత నీట్ పరీక్ష కుంభకోణంలో అరెస్టయిన వారి పేర్లను బైటపట్టాలని కోరారు పరీక్షల్లో తప్పుడు పద్ధతుల తరువాయి 12లో

## 'చందా చోర్, గద్దీ ఛోడ్'

- హోంమంత్రి అమిత్ షా సభకు రావాలి
- విరాళాల పెట్టెతో పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపిల నిరసన
- భారత హాకీ జట్టు జెర్సీ కాషాయ రంగుకు మార్చడంపై మండిపాటు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రతిపక్ష ఎంపిలు పలు అంశాలపై రోజుకో రీతిన నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తాజాగా గురువారం రామాలయ విరాళాల చోరీపై, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అకృత్యాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ భవన్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రియాంకా గాంధీ వాద్రాతో సహా పలు ప్రతిపక్ష పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. 'చందా చోర్, (విరాళాల చోరీ) గద్దీ ఛోడ్ (కుర్చీ దిగాలి), హోంమంత్రి సభకు రావాలి', విద్యార్థులపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి ఎవరు అనుమతించారు' వంటి నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. రామ మందిరంలో విరాళాల దొంగతనానికి ప్రతీకగా, ఎంపిలు తమతో పాటు ఒక విరాళాల పెట్టెను ఉంచుకుని, దానిలో డబ్బులు వేస్తూ కనిపించారు. ప్రియాంక గాంధీతో పాటు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన సాగరిక ఘోష్, జెఎంఎంకు చెందిన మహువా మాజీ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'హోం మంత్రి అమిత్ షా ఇంకెంతకాలం దాక్కుని భారత ప్రజలకు సమాధానం చెప్పకుండా ఉంటారు? ఆయన పార్లమెంటు నుండి ఎందుకు అదృశ్యమయ్యారు?. విద్యార్థులపై పెల్లెట్ గన్లను ఉపయోగించమని ఎవరు ఆదేశించారు, అలాగే బుధవారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మాట్లాడకుండా అడ్డుకున్నందుకు ఎవరు ఆదేశించారు అనే విషయాలపై స్పష్టమైన సమాధానం కోరుతూ మేము ప్రతిపక్ష ఎంపిలం మకర ద్వారం బయట నిరసన తెలుపుతున్నాము' అని వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న ఎంపిలు 'ఆదేశం ఎవరు ఇచ్చారు' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇది, ఇటీవల నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా తరువాయి 12లో



కాషాయ జెర్సీ!

**ఎల్‌నినో సవాళ్లపై సమగ్ర కార్యాచరణకు**

# రూ.803 కోట్లు

- 75 శాతం సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల సాగు విత్తనాలు అందించాలి

**'ఎల్‌నినో'పై చర్యలకు నిపుణుల కమిటీ సిఫార్సులు**

- సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి
- ఉపాధి హామీ ద్వారా చెక్‌డ్యాంలు, చెరువుల పూడికతీత, వర్షపునీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచన
- నివేదికను సిఎం రేవంత్‌రెడ్డికి అందజేసిన కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



> "రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు."

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు దాదాపు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని సూచించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. ఈ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి,వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, తరువాయి 12లో



07

నీట్ లీకేజీ ఉద్యమం విజయం సాధించినందుకు సిజెపి అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, ఎఐఎస్‌ఎఫ్ దినేష్ సి.రంగరాజ్‌లను అభినందిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి, డి.రాజా, జాతీయ కార్యదర్శి, అమర్‌జీత్ కౌర్




## 10న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతుల నిరసన

డా॥జ్ఞాన్ పాఠక్

**న్యూఢిల్లీ :** జీవనోపాధి,రాజ్యాంగ హక్కుల సాధనకోసం దేశవ్యాప్తంగా కార్మికులు–రైతులు ఆగస్టు 10వ తేదీన నిరసన ప్రదర్శనలు చేయాలని జాతీయ సదస్సు పిలుపు ఇచ్చింది. ఆరోజున రైలు–రోడ్డు దిగ్బంధనలు, కార్యాలయాలలో నిరసన ప్రదర్శనలు, మానవహారాలు, పలు రూపాల్లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరింది. పది జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తరువాయి 8లో

- రైలు, రోడ్డు దిగ్బంధనాలు, మానవహారాలు, పలురూపాల్లో ప్రదర్శనలు
- జీవనోపాధి, రాజ్యాంగ హక్కుల సాధన ప్రధాన లక్ష్యం
- మోదీ ప్రభుత్వంపై సమన్వయ పోరాటాలు తీవ్రతరం చేయాలి
- రుణ వసూళ్ళ దోపిడీ అరికట్టకపోతే శాసనోల్లంఘన, భారత్ బంద్
- ఢిల్లీలో జరిగిన సంయుక్త జాతీయ సదస్సు పిలుపు

**ఉద్యోగుల బకాయిలు మరో**

## రూ. 2000 కోట్లు విడుదల

100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగులకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు గురువారం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేశారు. దీంతో ఉద్యోగ జెఎసి నాయకులకు ఇచ్చిన మాట మేరకు 100 రోజుల్లో ఇప్పటి వరకు మొత్తం రూ.6 వేల కోట్ల బకాయిలను మూడు విడతల్లో విడుదల చేసింది. గత మే 29న తొలి విడతగా రూ.2 వేల కోట్లు, తరువాయి 12లో

# ఉపశమన వర్షాలు

రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ప్రారంభమై నెల రోజులు దాటినా పెద్దగా వానలు పడలేదు. దీంతో అనేకచోట్ల ఖరీఫ్‌లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. అంతకుమించి తాగునీటి సంక్షోభం తరుముకొస్తుందా అనే సందేహాలు ముసిరాయి. ఈ వారం మొదట్లో రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాల్లో నీటి మట్టాలు కేవలం 30 శాతంగానే నమోదయ్యాయి. సాధారణంగా ఈ సమయానికి ప్రాజెక్టులన్నీ జలకళతో తొణికిసలాడేవి. రైతులు పంట పనుల్లో నిమగ్నమయ్యే వారు. కానీ, రాష్ట్రంలో తద్భిన్నమైన పరిస్థితి కనపడింది.

ఎగువన కృష్ణా నది నుంచి, అలాగే గోదావరి నది నుంచి నీళ్ళు రాక రిజర్వాయర్‌లు వెలవెలబోయాయి.అయితే, కర్నాటకలో నెల మధ్యలో వర్షాలు కురియడంతో కృష్ణా నదిలో జలాలు వచ్చినా, ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులను నింపుకోవడంలోనే నిమగ్నమయ్యాయి. వర్షాలు పెరగడంతో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండ నిండి, వారం రోజులుగా నీళ్ల వదులుతుండడంతో జూరాలకు చేరుకున్నాయి. ఇది కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో, ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఉపశమనాన్ని కలిగించింది. ఉత్తర తెలంగాణలో పరిస్థితి వర్షాలు పడక, నిన్న మొన్నటి వరకు పరిస్థితి క్లిష్టంగా ఉండేది. గోదావరి నది పరిధిలో వర్షాలు రాక శ్రీరామ్‌సాగర్, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు వెలవెలబోయాయి. అదే సమయంలో ప్రాణహిత నది జలకళ నింపుకొని ప్రవహిస్తుండడం, మేడిగడ్డ వద్ద పరవళ్లు తొక్కడంతో బిఆర్‌ఎస్ పక్షం రోజులుగా జలరాజకీయాలు రాజేసింది. కన్నెపల్లి పంపు హౌజు నుంచి నీరు ఎత్తిపోయాలంటూ కొత్త రాగం తీసుకొని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టజూసింది. నిజానికి కన్నేపల్లి పంపుహౌజ్ వద్ద నీళ్ళెత్తిపోసినా, ఎగువన అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు మూసివేస్తేనే, ఎల్లంపల్లికి ప్రాణహిత నది నీటిని వెనక్కి ఎత్తిపోయవచ్చు. ఆ బ్యారేజీలు కూడా మేడిగడ్డలాగానే బలహీనంగా ఉన్నాయని, గేట్లు తెరిచే ఉంచాలని ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ ఆనకట్టల భద్రత ఏజెన్సీ(ఎన్‌డిఎస్‌ఎ) హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో తీవ్ర వాయుగుండం ఫలితంగా ఉత్తర తెలంగాణలో వర్షాలు మూడు రోజులుగా జోరందుకున్నాయి. రెండు రోజుల క్రితం తీరం దాటిన తీవ్ర వాయుగుండం పశ్చిమదిశలో పయనిస్తూ, రాష్ట్రంలో ఉత్తర దిశగా వెళ్తుండటంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురిసి, వాగులు, వంకలు పొంగిపొరలుతున్నాయి. ఫలితంగా వట్టిపోయిన కడెం ప్రాజెక్టు నుంచి, శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి గోదావరి పరుగులు తీసింది. దీంతో కన్నేపల్లి పంపుహౌజు నుంచి ప్రాణహిత నీటిని ఎల్లంపల్లికి లిఫ్ట్ చేయాలన్న బిఆర్‌ఎస్ సృష్టించిన రాజకీయ వేడి చప్పున చల్లారింది. ప్రాణహిత జలాలు అవసరం లేకుండానే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకున్న సహజ గోదావరి నదీ ప్రవాహ జలాలనే నంది మేడారం పంపు హౌజు వద్ద నాలుగు పంపు హౌజులను ఆన్ చేసి, దిగువ మిడ్ మానేరుకు తరలించడం ప్రారంభించారు. ఉత్తర తెలంగాణకు కొంత ఊరటను కలిగించింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జలరాజకీయ చక్రవ్యూహం నుంచి బైటపడినట్లయింది.

అయినప్పటికీ, రాష్ట్రానికి నీటి కొరత తీరినట్లేనని భావించకూడదు. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగే సూచనలు ఉన్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో కాలంలో దీర్ఘకాలం వర్షాలు పడకుండా ఉండడంతో పాటు, మధ్య మధ్యలో ఆకస్మికంగా రెండు మూడు రోజులు వర్షాలు పడతుంటాయని చెబుతున్నారు. ఈ వర్షాలతో వర్షపాతం లోటు తగ్గినట్లు అంకెల్లో కనపడినా వాస్తవంలో ప్రతిబింబించదు. ప్రస్తుతం తెలంగాణలో పడుతున్న వర్షాలతో లోటు వర్షపాతం తగ్గింది. రెండు వారాల క్రితం సగటున 33 శాతం లోటు వర్షాలు ఉండగా, ఇప్పటి వానలతో అది 22 శాతానికి చేరుకుంది. ఇంకా 13 జిల్లాల్లో అంత కంటే ఎక్కువగా నమోదైంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పెద్దగా పడలేదు. కాబట్టి ఈ వర్షాలకే ప్రభుత్వం, రైతులు సంతోషిస్తే, మబ్బులను చూసి నీటిని పారబోసుకున్నట్లే అవుతుంది. ప్రభుత్వం చెబుతున్నట్లుగా రైతులు వరి వంటి వర్షాధార పంటలను తగ్గించి, మెట్ట పంటలకు సిద్ధం కావాలి. ఈ వర్షాలను చూసుకొని వరిపంటకోసం ముందుకుపోతే మొదటికే ప్రమాదం. వచ్చిన నీటిని జాగ్రత్తగా జలాశయాలలో భద్రపరుస్తూ, ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా వినియోగించుకోవాలి. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రం ప్రభుత్వం వేసిన కమిటీ తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. అలాగే కంటింజెన్సీ ప్లాన్‌లు రూపొందించటమే కాకుండా, క్షేత్ర స్థాయిలో అమలు అంతకంటే ముఖ్యం.



## బిజెపి నుంచి బెదిరింపులు వచ్చాయి

నాకు చాలా బెదిరింపులు వచ్చాయి. బిజెపిలో చేరితే మీకూ, మీ కుటుంబానికీ అంతా మంచే జరుగుతుందని చెప్పారు. మోదీ, అమిత్ షాల మనవడి వయసులో ఉన్నవాడిని నేను. అలాంటి నన్ను బెదిరించే పరిస్థితి వస్తే, ఇంత పెద్ద ప్రధాని, హోం మంత్రి పదవులు ఉండి ఏమి లాభం? సంస్కృతిని దెబ్బతీయడం అని రాందేవ్ బాబా అంటున్నారు. ప్రజాస్వామ్యం, విద్య, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, మన భవిష్యత్తు కోసం పోరాడటం సంస్కృతిని దెబ్బతీయడమైతే, మేము అదే చేస్తున్నాం. సుప్రీంకోర్టు తప్పుబట్టిన పతంజలి ఉత్పత్తుల సమస్యను రాందేవ్ ముందుగా పరిష్కరించుకోవాలి.

– మీడియాతో అభిజీత్ దిప్కే,
సిజెపి వ్యవస్థాపకుడు




# భ్రమలు గొలుపుతున్న కోచింగ్ సెంటర్లు

విద్య అనేది ఒక వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే మూలాధారం. కానీ ఇటీవలి కాలంలో విద్యారంగం క్రమంగా వ్యాపారరంగంగా మారిపోతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్, మెడిసిన్, ఐఐటి, నీట్, జెఇఇ, సివిల్స్, బ్యాంకింగ్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందించే కోచింగ్ సెంటర్లు తమ ప్రచారంతో విద్యను వ్యాపార వస్తువుగా మార్చుతున్నాయి. ప్రతి సంవత్సరం ఎంట్రన్స్ పరీక్షల ఫలితాలు వెలువడగానే దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లలో రంగురంగుల ప్రకటనలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్రకటనలు విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా, అనవసరమైన మానసిక ఒత్తిడి, ఆర్థిక భారం, అసమానతలను కూడా పెంచుతున్నాయి. అందువల్ల కోచింగ్ సెంటర్ల ప్రకటనలను పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ సమంజసమైనదే.

ప్రస్తుతం ఒక విద్యార్థి విజయం సాధిస్తే, ఆ విద్యార్థి ఫోటోను పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనగా ప్రచురించడం, టివిల్లో పదేపదే ప్రసారం చేయడం సాధారణమైపోయింది. ‘ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ మా సంస్థదే’, ‘టాప్10లో మా విద్యార్థులే’, ‘వంద శాతం విజయమే మా లక్ష్యం’ వంటి ఆకర్షణీయమైన నినాదాలతో తల్లిదండ్రులను ప్రభావితం చేస్తున్నారు. అయితే ఈ ప్రకటనల్లో చూపిస్తున్న ప్రతి విజయం నిజంగా ఆ సంస్థ శిక్షణ ఫలితమేనా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఉండదు. కొందరు విద్యార్థులు కేవలం టెస్ట్ సిరీస్ మాత్రమే రాసినా, వారిని కూడా తమ విద్యార్థులుగా ప్రచారం చేయడం జరుగుతోంది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య. ఈ ప్రకటనల వల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్న వారు మధ్యతరగతి, పేద కుటుంబాలే. తమ పిల్లలు కూడా టాపర్లు కావాలనే ఆశతో తల్లిదండ్రులు లక్షల రూపాయలు అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో చేర్పిస్తున్నారు. ఒక విద్యార్థి విజయం వెనుక అతని కృషి, కుటుంబ సహకారం, పాఠశాల విద్య, వ్యక్తిగత ప్రతిభ వంటి అనేక అంశాలు ఉంటాయి. కానీ కోచింగ్ సెంటర్లు మొత్తం విజయాన్ని తమకే ఆపాదించుకుంటాయి. దీంతో తల్లిదండ్రులు తప్పనిసరిగా ఖరీదైన కోచింగ్ అవసరమనే భ్రమలో పడుతున్నారు. కోచింగ్ సెంటర్ల మధ్య పోటీ నాణ్యమైన బోధనలో ఉండాలి కానీ ప్రకటనల ఆర్భాటంలో కాదు. లక్షల రూపాయలు ప్రకటనల కోసం ఖర్చు చేయడం కన్నా, ఆ నిధులను మెరుగైన అధ్యాపకులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ బోధన, విద్యార్థుల సంక్షేమం కోసం వినియోగిస్తే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుం ది.

దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు కూడా ఈ ప్రకటనల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నప్పటికీ, సామాజిక బాధ్యతను మరవకూడదు. ప్రభుత్వం, విద్యాశాఖ, వినియోగదారుల పరిరక్షణ సంస్థలు, ప్రకటనల నియంత్రణ సంస్థలు కలిసి కఠిన నిబంధనలు రూపొందించాలి. తప్పుడు విజయాల ప్రచారం, ర్యాంకుల దుర్వినియోగం, విద్యార్థుల ఫోటోలను అనుమతి లేకుండా ఉపయోగించడం వంటి చర్యలపై భారీ జరిమానాలు విధించాలి. అవసరమైతే దినపత్రికలు, టెలివిజన్, రేడియో, డిజిటల్ మాధ్యమాల్లో కోచింగ్ సెంటర్ల ఎంట్రన్స్ పరీక్షల ప్రకటనలను పూర్తిగా నిషేధించాలి. విద్యార్థుల విజయాల గురించి సమాచారం ఇవ్వాలంటే ప్రభుత్వ అధికారిక పోర్టల్ లేదా విద్యా సంస్థల వెబ్‌సైట్లలో మాత్రమే పరిమితం చేయాలి. విద్యార్థుల కలలను మార్కెటింగ్ సాధనంగా మార్చడం సమాజానికి మంచిది కాదు. విద్యారంగంలో నైతిక విలువలు, పారదర్శకత, సమాన అవకాశాలను కాపాడేందుకు కోచింగ్ సెంటర్లు ఇస్తున్న దినపత్రిక లు, టెలివిజన్ ప్రకటనలను రద్దు చేయడం లేదా కఠినంగా నియంత్రించడం అత్యవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల నమ్మకం, సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే నిజమైన విద్యా సంస్కరణకు నాంది అవుతుంది.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752

## కేంద్ర ప్రభుత్వంలో

# ప్రచారం అధికం – ఫలితాలు పరిమితం



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రజాస్వామ్యంలో సహజం. అయితే రాజకీయ ప్రచారం, ఎన్నికల నినాదాలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే సందేశాలు వాస్తవాల స్థానాన్ని భర్తీ చేయలేవు. ఏ ప్రభుత్వాన్నైనా లేదా ఏ ప్రతిపక్షాన్నైనా అంచనా వేయాలంటే భావోద్వేగాల కంటే ఆధారాలు, గణాంకాలు, విధానాల ఫలితాలు, ప్రజల జీవన ప్రమాణాలపై వాటి ప్రభావమే ప్రమాణం కావాలి. ఇటీవల విస్తృతంగా ప్రచారంలో ఉన్న ‘ప్రపంచమంతా భారత్ లేదా బిజెపి ఓడిపోవాలని కోరుకుంటోంది’ అనే వాదన కూడా ఇదే ప్రమాణంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మొదట విదేశాలు లేదా అంతర్జాతీయ శక్తులు భారత ఎన్నికల్లో ఏకపక్షంగా ఒకే పార్టీ గెలవాలని లేదా ఓడిపోవాలని కోరుకుంటున్నాయనే వాదనకు ఇప్పటివరకు బలమైన, స్వతంత్ర ఆధారాలు అందుబాటులో లేవు. అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, కెనడా వంటి దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వంతో కలసి పనిచేస్తాయి. ప్రభుత్వం మారినా ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయి. అమెరికాతో రక్షణ, సెమీకండక్టర్లు, సాంకేతికత, వాణిజ్యం వంటి రంగాల్లో సహకారం పెరిగింది. అదే సమయంలో మానవ హక్కులు, మీడియా స్వేచ్ఛ, మైనారిటీల భద్రత వంటి అంశాలపై విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. విమర్శలను ఎన్నికల్లో ఒక పార్టీని ఓడించాలనే కుట్రగా పరిగణించడం వాస్తవాలను వక్రీకరించడం అవుతుంది.

భారత్ రక్షణరంగం స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తున్న మాట కొంతమేరకు నిజమే. రక్షణ ఉత్పత్తుల విలువ గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. కానీ అదే సమయంలో భారత్ ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుల్లో ఒకటిగా కొనసాగుతోంది. అందువల్ల విదేశీ ఆయుధ పరిశ్రమ మొత్తం భారత్ బలపడకూడదని చూస్తోందనే వాదనకు సరిపడే ఆధారాలు లేవు. వాస్తవానికి అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వంటి దేశాలు భారత రక్షణ మార్కెట్లో భాగస్వాములుగానే ఉన్నాయి. ఆ దేశాల నుండి యుద్ధ విమానాలు, ఆయుధాల దిగుమతులు అధికంగా ఉన్నాయి. ఆయుధాల ఉత్పత్తిలో సాంకేతిక సహకారం రష్యా, ఇజ్రాయెల్ నుండి లభిస్తుంది.

రామ మందిర నిర్మాణం బిజెపికి ఒక ముఖ్య రాజకీయ, సాంస్కృతిక విజయంగా భావించబడుతుంది. అయితే ఇటీవల రామ మందిరంలో దేవుని బంగారం, వెండి, పెద్ద ఎత్తున భక్తుల ముడుపులు దోపిడీ జరగటం అయోధ్య రామమందిరం ప్రతిష్టను దిగజార్చింది. ఇప్పుడు భక్తుల రద్దీ తగ్గింది. భక్తుల కానుకలు, పరిసర ప్రాంతాల్లో వ్యాపారాల ఆదాయం కూడా తగ్గింది. రామమందిర నిర్మాణం అన్ని భారతీయ వర్గాల ఏకాభిప్రాయ విజయంగా చెప్పలేం. కేవలం సుప్రీంకోర్టు తీర్పు మూలంగా జరిగింది. అలాగే ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్‌లో ఉగ్రవాద ఘటనలు తగ్గినట్లు అధికారిక గణాంకాలు సూచించినప్పటికీ, రాజకీయ ప్రక్రియ, ప్రజాస్వామ్య ప్రతినిధిత్వం, నిర్బంధాలు, పౌర స్వేచ్ఛలపై అనేక ప్రశ్నలు దేశీయ, అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తబడ్డాయి. కాబట్టి ఒకే విధానాన్ని పూర్తిగా విజయంగా లేదా పూర్తిగా వైఫల్యంగా చిత్రీకరించడం సరైన విశ్లేషణ కాదు. సిఎఎ అమలైంది కానీ జాతీయ పౌరుల నమోదు (ఎన్‌ఆర్‌సి) దేశవ్యాప్తంగా ఇప్పటికీ అమల్లోకి రాలేదు. అందువల్ల ‘సిఎఎ/ఎన్‌ఆర్‌సి పూర్తిగా అమలయ్యాయి’ అనే వాద న కూడా వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. నూతన విద్యా విధానం కూడా సంస్కరణల దిశగా ఒక ప్రయత్నమే అయినప్పటికీ, రాష్ట్రాల అమలు సామర్థ్యం, నిధుల కొరత, డిజిటల్ అసమానత, ఉపాధ్యాయ శిక్షణ వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. ఇంకా చాలా రాష్ట్రాల లో అమ లు కావడం లేదు.

దేశభక్తి ఏ పార్టీకి గుత్తాధిపత్యం కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత అవసరమో, లోపాలు ఉంటే ప్రశ్నించడం కూడా అంతే అవసరం. విమర్శించే వారిని దేశద్రోహులుగా, మద్దతు ఇచ్చేవారిని మాత్రమే దేశభక్తులుగా విభజించడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఓటరు బాధ్యత ప్రచార సందేశాలను పునరావృతం చేయడం కాదు; ఆధారాలను పరిశీలించడం, వాగ్దానాలను ఫలితాలతో పోల్చడం, పాలనను ప్రశ్నించడం.

భారత్ జిడిపి రీత్యా ప్రపంచంలో నాలుగు నుంచి ఆరవ స్థానానికి పడిపోయింది. అయినా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఈ మధ్య కాలం లో ఎదగడం ఒక ముఖ్యమైన మైలురాయి. అయితే తలసరి ఆదా యం, నిరుద్యోగం, యువత ఉపా ధి, మహిళల శ్రామిక భాగస్వామ్యం, ఆదాయ అసమానత వంటి సూచికల్లో ఇంకా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే వెనుకబడి ఉన్నాం అనే విషయాన్ని మర్చిపోకూడదు. జిడిపి పరిమాణం పెరగడం ఒక్కటే ప్రజల జీవన ప్రమాణాలు సమానంగా మెరుగుపడ్డాయని ఆర్థిక శాస్త్రం నిరూపించదు.




కరోనా సమయంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాల్లో ఒకదాన్ని నిర్వహించింది. ఇది పరిపాలనాపరంగా ఒక విశేష విజయం. అదే సమయంలో రెండో కరోనా అలలో ఆక్సిజన్ కొరత, ఆసుపత్రులపై ఒత్తిడి, మరణాల లెక్కలపై వచ్చిన వివాదాలు కూడా చరిత్రలో నమోదయ్యాయి. కాబట్టి విజయాలను మాత్రమే కాదు, వైఫల్యాలను కూడా గుర్తుంచుకోవాల్సిందే.

మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలు, రైల్వే విద్యుదీకరణ, విమానాశ్రయాల విస్తరణ, డిజిటల్ చెల్లింపుల పెరుగుదల వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తుంది. అదే సమయంలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, పట్టణ–గ్రామీణ అసమానతల వంటి రంగాల్లో ఇంకా పెద్ద పెట్టుబడులు అవసరమని స్వతంత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి.

జిఎస్‌టి దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థను తీసుకువచ్చింది. కానీ ప్రారంభ సంవత్సరాల్లో చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న సమస్యలు, తరచూ మారిన పన్ను రేట్లు, పరిహార నిధులపై రాష్ట్రాల అభ్యంతరాలు కూడా వాస్తవాలే. అదే విధంగా డీమానిటైజేషన్ నల్లధనాన్ని అరికడుతుందని ప్రకటించినప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం చలామణిలో ఉన్న దాదాపు మొత్తం కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చింది. అంటే ప్రభుత్వ ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. డీమానిటైజేషన్ అనియతరంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని అనేక మంది ఆర్థిక నిపుణులు విశ్లేషించారు.

‘మంత్రిత్వ స్థాయిలో అవినీతి శూన్యం’ అనే వాదనను కూడా జాగ్రత్తగా చూడాలి. పెద్ద అవినీతి కేసుల్లో కేంద్ర మంత్రులపై తీర్పు లు లేకపోవడం ఒక విషయం అయితే, ఎన్నికల బాండ్ల వ్యవస్థపై సుప్రీం కోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, పారదర్శకతపై వచ్చిన విమర్శలు, దర్యాప్తు సంస్థల వినియోగంపై ప్రతిపక్షాల ఆరోపణలు మరోవైపు ఉన్నాయి. ఒకప్పుడు దేశంలో అవినీతిపరులు అని బిజెపి ముద్ర వేసిన వారిలో చాలామంది ప్రముఖులు తదనంతర కాలంలో బిజెపిలో చేరి కొందరు రాజకీయ పదవులు పొందినందువల్ల అవినీతి పూర్తిగా అంతరించిపోయిందని చెప్పడం కంటే, పారదర్శకతను కోల్పోయిన ఇడి,ఐటి, సిబిఐ లాంటి దర్యాప్తు సంస్థల నివేదికలు కూడా విశ్వసనీయతను కోల్పోయాయి.

బిజెపి ప్రభుత్వంలో ‘బాంబు పేలుళ్ల లేవు’, ‘పాకిస్థాన్‌ను ఒక్క బులెట్ కూడా వేయకుండా దెబ్బతీశారు’, ‘చైనాను నియంత్రించారు’ వంటి రాజకీయ నినాదాలు కూడా అతిశయోక్తితో కూడుకున్నవే. ఉగ్రవాద ఘటనలు తగ్గిన ప్రాంతాలున్నప్పటికీ, సరిహద్దు ఉద్రిక్తతలు, గాల్వాన్ వంటి సంఘటనలు, పుల్వామ ఉగ్రవాద సంఘటనలు, భారత– చైనా సరిహద్దుల వివాదాలు ఇంకా పూర్తిగా పరిష్కారమవలేదు. విదేశాంగ విధానాన్ని విజయాల జాబితాగా లేదా వైఫల్యాల జాబితాగా కాకుండా అదొక నిరంతర ప్రక్రియగా చూడాలి.

భారత్‌లో ఐఐటిలు, ఎయిమ్స్‌లు, తాగునీటి పథకాలు, ఆయుష్మాన్ భారత్, మొబైల్ తయారీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో నిజమైన పురోగతి కనిపిస్తోంది. అయితే ఈ విజయాలు కేవలం ఒకే పార్టీకి చెందినవి అని చెప్పడం కూడా సరైంది కాదు. అనేక రంగాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రభుత్వరంగ సంస్థల స్థాపన, మిశ్రమ ఆర్థిక విధానాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగం కలిసి చేసిన మిశ్రమ కృషి ఫలితమే.

చివరగా, ‘దేశాన్ని ప్రేమించడం అంటే కేవలం ఒకే ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం’ అనే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దేశభక్తి ఏ పార్టీకి గుత్తాధిపత్యం కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత అవసరమో, లోపాలు ఉంటే ప్రశ్నించడం కూడా అంతే అవసరం. విమర్శించే వారిని దేశద్రోహులుగా, మద్దతు ఇచ్చేవారిని మాత్రమే దేశభక్తులుగా విభజించడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఓటరు బాధ్యత ప్రచార సందేశాలను పునరావృతం చేయడం కాదు; ఆధారాలను పరిశీలించడం, వాగ్దానాలను ఫలితాలతో పోల్చడం, పాలనను ప్రశ్నించడం. ప్రజాస్వామ్యంలో బలమైన దేశాన్ని నిర్మించేది ఏకపక్ష నినాదాలు కాదు; వాస్తవాల ఆధారంగా తీసుకునే చైతన్యపూర్వక నిర్ణయాలే.

# మట్టిగోడల నుండి..‘మహానగరం’దాకా!

గొప్పింట్లో పుట్టిన వారందరూ గొప్పవారు కారు. పేదింట్లో పుట్టిన వారందరూ పేదలుగ ఉండరు. అవరోధాలను సవాలుగా తీసుకొని అవకాశాలను అనుకూలంగా మార్చుకొని ముందుకెళ్లినవారే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు. అందుకు డాక్టర్ తిప్పర్తి యాదయ్య జీవిత ప్రస్థానం ఒక చక్కటి ఉదాహరణ. మారుమూల పల్లెలో పుట్టి మహానగరంలో ఉద్యోగంలో మణిమాణిక్యంలా వెలిగి జులై 31న పదవీ విరమణ చేస్తున్న ఆయన ఎందరికో ఆదర్శప్రాయుడు.

నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల పల్లెలో తోలు శుభ్రంచేసే తిప్పర్తి అంతయ్య మనుమడిగా, కమ్యూనిస్టు కొండయ్య కొడుకుగా, మట్టిగోడల పాఠశాలలో చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో అక్షరాభ్యాసం చేసి ఓనమాలు దిద్దుతూ ముచ్చటగా మూడో తరగతి వరకు చదివి, ఆపై ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారిగడ్డకు నాలుగో తరగతి చదువుకు లేత వయసులో తండ్రి కష్టమని వారించినా తాత ప్రోత్సాహంతో నడకతో నడుం బిగించి ప్రయాణమయ్యాడు. బంగారిగడ్డలో ఎనిమిదో తరగతి లేకపోవడంతో వెనక్కి రమ్మన్న తండ్రికి, తాను భారం కారాదని భావించి హాస్టల్ చదువుకు నల్లగొండకు ప్రయాణమైతే హాస్టల్ సీటు దొరకక దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు, తాత సూచనతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో ఉంటూ కట్టెల పొయ్యిపై వంట చేసుకుంటూ, కంపతుమ్మ కట్టెలు కొట్టుకొచ్చుకొని వంట చేసుకుంటూ, డబ్బులు లేక రాత్రిళ్లు రైస్‌మిల్లులో బస్తా బియ్యం నింపితే రూపాయి చొప్పున సంపాదించుకుంటూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషన్ దాటాడు.

డాక్టర్ కావాలనే కోరికతో ఇంటర్ బైపిసి చదివితే సీటు రాక నల్లగొండ నాగార్జున కళాశాలలో బీఎస్సీలో చేరి విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థి సంఘంలో, అటుపిమ్మట ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘంలో రాష్ట్రస్థాయి వరకు పనిచేసి సామ్యవాద భావాలు పుణికిపుచ్చుకున్నాడు. డిగ్రీ మధ్యలోనే వదిలేసి పూర్తిస్థాయి విద్యార్థి ఫెడరేషన్, యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నప్పుడు విద్యార్థి సంఘ నాయకురాలిగా ఉన్న వట్టేపు సౌజన్యతో పరిచయమై భావాలు కలిసిన బంధం ఏర్పడి, ఒకరినొకరు పెద్దలను ఒప్పించి 1984లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కమ్యూనిస్టు పార్టీ నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ ధర్మభిక్షం గారి ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం చేసుకున్నాడు. వారికి ప్రియ శిష్యుడుగా కొనసాగినాడు. వీరికి ముగ్గురు సంతానం.

1991 డిసెంబర్‌లో హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తన భార్యకు కూడా అప్పుడే ఉద్యోగం వస్తే ఒకే ఇంటిలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగం వల్ల మరో నిరుద్యోగికి నష్టమని భావించి ఇద్దరి అంగీకారంతో అర్ధాంగి ఉద్యోగాన్ని తిరస్కరించిన ఆదర్శ దంపతులు. 1994లో ఎంఆర్‌పిఎస్ ఏర్పడినప్పుడు నల్లగొండ జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తూనే, ఉద్యోగం నిబద్ధతతో చేయడం పైరవీకారులకు పనిలేక కక్షగట్టి తాండూరుకు బదిలీ చేయించారు.

తాండూరులో పనిచేస్తూ షాబాద్ బండల క్వారీల్లో పనిచేసే పిల్లలకు తాను స్వయంగా ట్యూషన్లు ఏర్పాటు చేసి చదివించగా పదో తరగతి ఫలితాల ను చూసి ఆశ్చర్యపోయిన ఆనాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అజయ్ జైన్ అభినందించి ప్రశంసాపత్రం ఇచ్చారు. ‘ఈ సందర్భంగా పరిశీలనకు వచ్చిన ధర్మభిక్షం గారికి అభినంద న సభ జరిపారు. మీరెంత తిన్నా మా పిల్లలకు మాత్రం కడుపునిండా భోజనం పెట్టండి’ అని హాస్టల్ వార్డెన్లను ప్రాధేయపడితే వార్డెన్లే సంభ్రమాశ్చర్యానికి లోనైన సందర్భాలెన్నో ఉన్నాయి.



తిప్పర్తి యాదయ్య
నేడు పదవీ విరమణ సందర్భంగా

ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు దూరవిద్య ద్వారా తన ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎంఏ సోషియాలజీ పూర్తిచేసి అనంతరం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల మురికివాడల నివాసితులలో ఆరోగ్య అవగాహన పద్ధతులు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

2002లో హైదరాబాద్‌కు బదిలీ కాగానే అప్పుడప్పుడే మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్నది. ఉద్యోగంతో పాటుగా ఉద్యమ బాధ్యతలు తోడైనవి. తెలంగాణ ఉద్యోగుల సంఘాలతో కలిసి పనిచేస్తూనే, మున్సిపల్ శాఖలో తెలంగాణ మున్సిపల్ కార్మిక ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి పదవీ విరమణ నాటికి అధ్యక్షుడిగా సేవలందించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. సకల జనుల సమ్మె పిలుపు మేర కు తన ఉద్యోగం ఊడిపోతుందని తోటివారు వారించినా ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఇంటి ముందు మున్సిపల్ వాహనాల ద్వారా చెత్త పోసి నిరసన తెలిపారు. ప్రధాన కార్యాలయంలో నిరంతరం ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రపంచ శాంతి సంఘం అనుబంధమైన అఖిల భారత శాంతి–సంఘీభావ సంఘానికి జాతీయ ఉపాధ్యక్షుడిగా అనేక దేశాలలో జరిగిన శాంతి సమావేశాల్లో భారత ప్రతినిధి గా పాల్గొన్నారు. 2005లో, 2010లో సమర్థవంతమైన అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం చేత అవార్డులు అందుకున్నారు. ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత అవార్డు, భారతీయ దళిత సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీచే 2016లో సేవారత్న అవార్డు, 2017 లో అఖిల భారత శాంతి సంఘీభావ అవార్డు, మరెన్నో ప్రశంసలు అందుకున్నారు. అనేక సామాజిక సంస్థల్లో, దళిత చైతన్య ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు.నక్సల్బరి గర్జనకు ఏడాది ముందు జల్లుల జడివానలు కురిసే గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసంలో జన్మించి, తొలి పండుగ రక్షాబంధన్‌తో స్నేహ సంబంధాలను పుణికిపుచ్చుకొని హైదరాబాద్‌లో అందరివాడుగా ఆత్మీయంగా పిలిపించుకునే డాక్టర్ తిప్పర్తి యాదయ్య అందరికీ మంచి మిత్రుడు, అంతకుమించి ఎందరికో ఆత్మీయుడు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో జులై 31న సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ (జిహెచ్‌ఎంసిలో జాయింట్ కమిషనర్) హోదాలో పదవీ విరమణ చేయుచున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య అభ్యుదయ, వామపక్ష, దళిత ఉద్యమాలకు మంచి మార్గదర్శకుడు.

**మహేశ్ తిప్పర్తి,** మాజీ ప్రధాన కార్యదర్శి,
ఎఐఎస్‌ఎఫ్, నల్లగొండ జిల్లా

భారీ వర్షాలు

# అప్రమత్తంగా ఉండండి

జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులను ఆదేశించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ఆయన గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిజిపి సి.వి. ఆనంద్, అదనపు డిజి మహేష్ భగవత్, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లతో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో వెంటనే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రమాదకర పిక్నిక్ స్పాట్‌లకు పర్యాటకులు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల కలెక్టర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఇప్పటికే అందుబాటులో ఉంచామని, జిల్లాలకు ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

ఎల్‌నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ నెలలోనూ వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపిన దృష్ట్యా, రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సంజయ్ జాజు సూచించారు.

**249 ప్రమాదకర జలాశయాల గుర్తింపు : డిజిపి సి.వి. ఆనంద్**

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను డిజిపి సి.వి. ఆనంద్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 249 ప్రమాదకర జలాశయాలు ఉన్న పిక్నిక్ స్పాట్‌లతో పాటు మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. వర్షాల సమయంలో ప్రజలు ఈ ప్రాంతాలకు వెళ్లకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, ఏ క్షణంలోనైనా సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 12 కంపెనీల ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. వెల్లడించారు.

# అంగన్‌వాడీల్లో 100% మౌలిక వసతులు

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి పాల్గొన్నారు. గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు అధికారులను మంత్రి అభినందించారు. మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడిలకు కనీస వసతులు కూడా అందలేదని, రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు ఉండాలన్నారు. చిన్నారుల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, ఫలితాల ఆధారంగా కార్యక్రమాలను మెరుగుపరచాలని, పాలుబ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అన్ని జిల్లాల్లో ఆలస్యం లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీపై 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్‌లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, డిప్లొమా సర్టిఫికెట్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్రాలకు ఆహ్లాదకరమైన రంగులు వేయాలని, రద్దీ ప్రాంతాల్లో ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని, వీటిని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలని, జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్‌వాడిలను క్రమం తప్పకుండా సందర్శించి నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# నిమిషం కూడా నిర్లక్ష్యం వద్దు

వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగం నిమిషం కూడా నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షభయం ఉన్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని, హైడ్రా, జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30 శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజుల భారీ వర్షాలతో దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్, నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిందన్నారు. భారీ వర్షాలు కురిసే జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

# ఆర్ అండ్ బి యంత్రాంగం అప్రమత్తం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లు, వంతెనల పరిస్థితిపై ఆర్ అండ్ బి శాఖ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్‌అండ్‌బి డివిజన్ల వారీగా రహదారులు, వంతెనలు, లో లెవల్ కాజ్‌వేలు, కల్వర్టుల పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కల్వర్టులు, లోలెవల్ కాజ్‌వేలు, కోతకు గురైన రహదారుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ట్రాఫిక్‌ను మళ్లించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారులు, వంతెనల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆర్ అండ్‌బి శాఖ అధికారులు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్టును సిద్ధం చేసి సమర్పించాలని, క్షేత్రస్థాయి ఇంజనీర్లతో తాను ప్రతి రోజూ మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మంత్రి తెలిపారు.

# అంబేద్కర్ వర్సిటీలో నాలుగు ఆన్‌లైన్ కోర్సులకు యుజిసి అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోనే మొట్ట మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయమైన డాక్టర్ .బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను నాలుగు ఆన్‌లైన్ కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) అనుమతించింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి మొత్తం 8 కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో నాలుగు కోర్సులు ఎం.ఏ. (తెలుగు), ఎం.కామ్; బి.కామ్ (ఇంగ్లీష్ మీడియం), బి.కామ్ (తెలుగు మీడియం)లకు యుజిసి ఆమోదం తెలిపిందని యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పాచక్రపాణి గురువార ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన నాలుగు కోర్సులకు సంబంధించి యుజిసి కొన్ని సూచనలు, సలహాలు చేసిందని, వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఆన్‌లైన్ కోర్సులకు యుజిసి ఆమోదం తెలపడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి విశ్వవిద్యాలయ సిబ్బందిని అభినందించారు. కెనడాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన విశ్వవిద్యాలయ అధికారులతో గురువారం మాట్లాడారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దేశంలోనే మొదటి డిస్టెన్స్ యూనివర్సిటీగా రూపాంతరం చెందుతోందని, రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ అన్ని కోర్సులను ఆన్‌లైన్ కోర్సులుగా మారుస్తూ పూర్తి స్థాయి డిజిటల్ యూనివర్సిటీగా మారుస్తామని ఘంటా చక్రపాణి వెల్లడించారు. కాగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నాణ్యమైన ఉన్నత విద్యను మరింత విస్తరించేందుకు యుజిసి తీసుకున్న నిర్ణయాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, ఇతర విభాగాల డిరెక్టర్లు, డీన్స్ స్వాగతించారు. యుజిసి కొత్తగా ఆమోదించిన కోర్సుల వివరాలు, కనీస అర్హత, అడ్మిషన్ విధానం, ఫీజుల వివరాలు, కోర్సు వ్యవధి వివరాలతో విశ్వవిద్యాలయం త్వరలో అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని వారు తెలిపారు. సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braou.ac.in లేదా www.braouonline.in ను సందర్శించాలని, లేదా హెల్ప్ డెస్క్ 040 23680 333 / 555 /, టోల్‌ఫ్రీ: 18005990101లో సంప్రదించాలని సూచించారు.

వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు

# ఫైర్ శాఖ పూర్తి సన్నద్ధం

జిల్లాల అధికారులతో డిజి విక్రమ్ సింగ్ మాన్ వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాకాల పరిస్థితులు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ అప్రమత్తమైంది. శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా అగ్నిమాపక అధికారులు, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారులు, స్టేషన్ ఫైర్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాకాల సన్నద్ధతను సమీక్షించారు. భారీ వర్షాల హెచ్చరికలు జారీ అయిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించిన డిజి, ప్రతి జిల్లాలో రెస్క్యూ సిబ్బంది, పడవలు, డీవాటరింగ్ పంపులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర అత్యవసర పరికరాల లభ్యత, వాటి కార్యాచరణ సన్నద్ధతపై అధికారులతో సమీక్షించారు. విపత్తుల నిర్వహణలో ముందస్తు సన్నద్ధత, సకాలంలో స్పందన అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, అన్ని అగ్నిమాపక కేంద్రాలు, రెస్క్యూ బృందాలు ఎప్పటికప్పుడు హై అలర్ట్‌తో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో అధికారులు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిజి విక్రమ్ సింగ్ మాన్ సూచించారు.

# దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

ఆగస్టు 3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా : అనిల్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళిత సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, దీనిని నిరసిస్తూ అగస్టు 3వ తేదీన దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల కార్యాలయం ముట్టడించనున్నట్లు రాష్ట్ర ప్రధనకార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తెలిపారు. ఈ ధర్నాల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గురువారం డి హెచ్ పి ఎస్ హైదరాబాద్ జిల్లా సమితి సమావేశం కె బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దళితుల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. దళితుల విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను పూర్తిగా అదే లక్ష్యాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లాలో వేలాది దళిత కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలోనో, తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి దళిత కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఎస్‌సిసబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి దళిత సంక్షేమానికే ఖర్చు చేయాలి.ప్రతి దళిత కుటుంబానికి ఉచితంగా శాశ్వత గృహాన్ని నిర్మించి ఇవ్వాలన్నారు. దళితులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని, దళిత బస్తీలలో మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి సౌకర్యాలు మెరుగుపర్చడం, దళిత యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించి, ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా దళిత ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపెల్లి శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, మురళి, జి యాకయ్య, జీ రవి, హనుమంత్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు విద్యాసాగర్, తిరుపతికి జాతీయ వాగ్దేవి పురస్కారాలు

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రదానం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పనిచేస్తున్న ముగ్గురు తెలుగు జర్నలిస్టులకు జాతీయ వాగ్దేవి పురస్కారాలు దక్కాయి. వీరిలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, పెద్దపల్లి జిల్లాకు చెందిన విద్యాసాగర్ వేములకు జాతీయ వాగ్దేవి పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ ఆధ్వర్యంలో 'తెలుగు వెలుగు సంబరాలు' పేరిట జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) జయంతి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ వాగ్దేవి పురస్కారాలను అందజేశారు. ప్రింట్ జర్నలిజంలో ప్రతిభ కనబరుస్తున్నందుకు ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి విద్యాసాగర్ వేములకు,వీ6 వెలుగు ఢిల్లీ ప్రతినిధి వంగ తిరుపతికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ జాతీయ వాగ్దేవి పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. సాక్షి ఢిల్లీ ప్రతినిధి రాజశేఖరరెడ్డికి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం, అలాగే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, కాశీ విశ్వనాథరాజుకు వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఎంపీలు కె.లక్ష్మణ్, బీద మస్తాన్ రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

తెలంగాణా ప్రభుత్వము
ఫారం-6
(ప్రాథమిక ప్రకటన)
(చట్టం -30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. బి /340//2024 | తేది: 10-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2034/2026 | తేది: 13-07-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/32/2026 | తేది: 18-07-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ.5-20 1/4 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద డిస్ట్రిబ్యూటరి కెనాల్-1L (LM-3), ప్యాకేజి నెం.1, ఇరవెండి గ్రామము వద్ద ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పునరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

భూసేకరణ వలన భూనిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలోని విస్తీర్ణం **ఎ.5-20 1/4 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధంగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

గ్రామం:: ఇరవెండి మండలం:: బూర్గంపాడు జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

| క్ర. సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించుటకు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: అనుభవదారుని పేరు | చెట్లు & కట్టడములు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 79/1/2 | 79 | పట్టా | మెట్ట | 0.31 1/4 | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | లేవు |
| 2 | 87/1/2 | 87 | పట్టా | మెట్ట | 0.12 1/4 | గుడిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జనకిరామిరెడ్డి | గుడిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జనకి రెడ్డి | లేవు |
| 3 | 96/1/1/2 | 96/3/E E/1 | పట్టా | మెట్ట | 0.01 1/2 | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | వెంగల కౌసల్య భ: శ్రీనివాసరెడ్డి | లేవు |
| 4 | 96/1/1/2 | 96 | పట్టా | మెట్ట | 0.01 1/4 | ప్రభుత్వ భూమి | రోడ్డు | లేవు |
| 5 | 96/1/1/2 | 96/3/E E/1 | పట్టా | మెట్ట | 0.34 1/4 | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | లేవు |
| 6 | 96/1/1/2 | 96/9/A | పట్టా | మెట్ట | 0.13 1/2 | వాంకుడోత్ వెంకన్న తం: పెద్ద భద్రు | వాంకుడోత్ వెంకన్న తం: భద్రు | లేవు |
| 7 | 96/1/1/2 | 96/10/E/1 | పట్టా | మెట్ట | 0.27 1/2 | బొర్రా నాగయ్య తం: గుట్టయ్య | మూతి లక్ష్మి భ: పెంటయ్య | బోర్ వెల్ -1 |
| 8 | 96/1/1/2 | 93/A | పట్టా | మెట్ట | 0.13 1/2 | గుడిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జానకి రామిరెడ్డి | గుడిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జానకి రెడ్డి | లేవు |
| 9 | 96/1/1/3 | 96/7/A | పట్టా | మెట్ట | 0.03 3/4 | గనిబోయిన జోగయ్య తం: పుల్లయ్య | గనిబోయిన రవి తం: జోగయ్య | లేవు |
| 10 | 96/1/1/3 | 96/9/A | పట్టా | మెట్ట | 0.08 3/4 | భుక్య బాలాజీ తం: రాములు | భుక్య బాలాజీ తం: బాలు | లేవు |
| 11 | 96/1/1/3 | 96/7/A/1 | పట్టా | మెట్ట | 0.20 | గుంపనపల్లి రాజశేకర్ తం: రమేష్ | గుంపనపల్లి రాజశేకర్ తం: రమేష్ | లేవు |
| 12 | 96/1/1/3 | 96/8/A A/2 | పట్టా | మెట్ట | 0.10 | సోడే వీరయ్య తం: భద్రయ్య | సోడే వీరయ్య తం: భద్రయ్య | లేవు |
| 13 | 96/1/1/3 | 96/8/A A3 | పట్టా | మెట్ట | 0.10 | సోడే బక్కయ్య తం: భద్రయ్య | సోడే భద్రయ్య | లేవు |
| 14 | 96/1/1/3 | 96/9/E/1/1 | పట్టా | మెట్ట | 0.06 1/4 | కాకా కన్నయ్య తం: లచయ్య | కాకా అశోక్ తం: కన్నయ్య | లేవు |
| 15 | 96/1/1/3 | 96/3/E/2 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0.00 1/2 | వంకుడోత్ సక్కుబాయి తం: వెంకన్న | వంకుడోత్ వెంకన్న తం: భద్రు | బోర్ వెల్ -1 |
| 16 | 96/1/1/3 | 96/5/1 | పట్టా | మెట్ట | 0.25 | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | లేవు |
| 17 | 117/3/2 | 96 | పట్టా | మెట్ట | 0.00 1/4 | ప్రభుత్వ భూమి | రోడ్డు | లేవు |
| 18 | 117/3/2 | 96/3/UU | పట్టా | మెట్ట | 0.00 3/4 | కొమందరి రంగాచారి తం: రామానుజా చారి | వెంగలి కౌసల్య భ: శ్రీనివాసరెడ్డి | లేవు |
| | మొత్తం విస్తీర్ణం : 5-20 1/4 | | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం.30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్& ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏదైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి.యూనిట్-I, పాల్వంచ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం /భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

| | | |
|---|---|---|
| సం/- యం.వి.రవింద్రనాథ్ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | సం/- డి.వేణుగోపాల్ అదనపు కలెక్టర్ (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | సం/- అంకిత్ ఐ.ఏ.ఎస్., కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |

DIPR RO NO. 559/LA/PP/Advt/Pub/2026-27

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్

షార్ట్ టెండర్ నోటీసు నెం. 19/EE.Div.NO.28/GHMC/2026-27 తేది: 29.07.2026

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| షార్ట్ టెండర్ నోటీసు నెం. 19/ EE.Div.NO. 28/ GHMC/ 2026-27, తేది: 29.07.2026 | నిర్వహణ పనులు (01) నెం.లు | రూ. 23.40 లక్షలు | ప్రారంభ తేదీ: 29.07.2026 సా.5.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 01.08.2026 సా.5.10గం.ల వరకు | శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505 |

పనుల వివరాల కాపీ జతపరడమైనది.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్.28, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 6999-PP/CL/ADVT/2026-27, Date: 30-07-2026

తెలంగాణ ప్రభుత్వం
వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్, హైదరాబాద్.

నెం. వ్య.మా.క./గుడి/ /2026-27 టెండరు నోటీసు తేది: 30/07/2026

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ పరిదిలో గల హోల్‌సేల్ మార్కెట్ యార్డ్ మరియు పూల మార్కెట్ & రిటైల్ కూరగాయల మార్కెట్ యందు టాయిలెట్ బ్లాక్స్ BOT పధతిలో నిర్వహణకు సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది.

| క్ర. సం. | పని పేరు | ధరావత్తు రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది & సమయం | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది & సమయం | టెండరు తెరువబడు తేది & సమయం |
|---|---|---|---|---|---|
| 1 | హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నందు బయోగ్యాస్ ప్లాంట్ ముందు టాయిలెట్ బ్లాక్ BOT పధతిలో | 25,000/- | 06-08-2026 నుండి 07-08-2026 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 3.00 గంటల వరకు | 08-08-2026 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 08-08-2026 రోజున మధ్యాహ్నం 12.30 గంటలకు |
| 2 | హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నందు ఆకుకూరల నందు టాయిలెట్ బ్లాక్ BOT పధతిలో | 25,000/- | | | |
| 3 | పూల మార్కెట్ యార్డ్ నందు టాయిలెట్ బ్లాక్ BOT పధతిలో | 25,000/- | | | |
| 4 | రిటైల్ కూరగాయల మార్కెట్ యార్డ్ నందు టాయిలెట్ బ్లాక్ BOT పధతిలో | 25,000/- | | | |

టెండర్ షెడ్యూలు కొరకు రూ.3,000/- డి.డి. రూపేన సెక్రటరీ, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ వారి పేరు మీద తీసి మార్కెట్ కమిటీ కార్యాలయము నందు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు షెడ్యూల్ ధర, ధరావత్తు డి.డి.లను మరియు ఈ క్రింద తెలిపిన అర్హత ధ్రువీకరణలు సమర్పించిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.

**అర్హతలు:-**

1) టాయిలెట్ బ్లాక్ వారి సొంత దబ్బుతో నిర్మించి BOT పద్దతిలో నిర్వహించుటకు జివిస్టి రిజిస్ట్రేషన్, ఫర్మ్ రిజిస్ట్రేషన్ మరియు లేబర్ లైసెన్స్ గల కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్ నందు పాల్గొనుటకు అర్హులు.
2) పైన తెలిపినపనిలలో ఏదైనా ప్రభుత్వ సంస్థలో కనీసం (3) సంవత్సరముల అనుభవ ధ్రువీకరణ పత్రములు కలిగి ఉన్న వారికి మాత్రమే అర్హులుగా పరిగణించి టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.
అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు అన్ని ఎలాంటి కారణము చూపకుండా టెండరు ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వాయుదావేయుటకు లేదా మార్పు చేయుటకు లేదా టెండరు ప్రక్రియను.
ఏ దశలోనైన రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు.

సం/- చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.
సం/- కార్యదర్శి (FAC), వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.
DIPR R.O. No. : 7025-PP/CL/ADVT/2026-27, Date: 30-07-2026

# ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**అన్నపురెడ్డిపల్లిలో రూ 2.77కోట్లు, చంద్రుగొండ మండలంలో రూ 1.15కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గృహ ప్రవేశాల్లో మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి/చంద్రుగొండ:** ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో గురువారం పర్యటించిన మంత్రి రూ 2.77కోట్లకు పైగా విలువైన సీసీ రోడ్లు, కల్వర్టులు, గ్రామ పంచాయితీ భవనాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. భీమునిగూడెంలో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులైన అగ్గి రాజమ్మ, మాయారా వసంత, వాడే సుజాత, తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, మొల్లచపుకు కవిత, వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మ నూతన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమని, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ వర్షాకాల పరిస్థితుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్‌డీఓ మధు, హౌసింగ్ పీడీ , జిల్లా పంచాయితీ అధికారి అనూష, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు వనమా గాంధీ, వేముల రమణ, భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుబ్బాకుల రాము, నేరెళ్ల లాలయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల నరేష్, తదితరులు పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. చంద్రుగొండ మండల పరిధిలోని తొలుత మంగయ్య బంజర్, పోకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సుమారు రూ 1.15కోట్ల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. తొలుత మంగయ్య బంజర్‌లో సర్పంచ్ మాలోత్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలు, రైతులు, నిరుద్యోగులకు న్యాయం చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గుడిసెలేని రాష్ట్ర నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల పంపిణీ, 72వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరో 16వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ మార్గంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, అధికారులు, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజ్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు రమణ, టౌన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, ఫజల్ బక్షు, రాజుని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కోచింగ్‌ను బిసి యువత సద్వినియోగం చేసుకోవాలి

**యుపిఎస్‌సి ఉచిత కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం ప్రతిభావంతులైన బిసి యువతకు కల్పిస్తున్న యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాక ర టిఎస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని క లెక్టర్ చాంబర్‌లో టిజి బిసి స్టడీ సర్కిల్ ఖమ్మం ఆ ధ్వర్యంలో నిర్వహించనున్న యుపిఎస్సీ సివిల్ స ర్వీసెస్ దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కర పత్రాలను కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి పరిపాలనలో ప్రతిభా వంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తుందన్నారు. గ్రామీణ, ఆ ర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 2026 ఆ గస్టు 24 నుంచి 2027 మే నెల వరకు పూర్తి ఉ చిత కోర్సును అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు కోచింగ్ సామగ్రి, గ్రంథాల య సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ ప రీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నారు.

## వర్షాలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే డా.తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం:** కురుస్తున్న వర్షాలు, రానున్న గోదావరి వరదల పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని శాసన సభ్యులు డా.తెల్లం వెంకటరావు అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి పనులు ప్రజా సమస్యలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా భారీ వర్షాలు పడుతున్నాయని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతీశాఖా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ గ్రామపంచాయితీ ఇఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం అందరికీ చేరువ చేయడమే లక్ష్యం : దేవి మానస




**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని ప్రతి అర్హుడికి రాజ్యాంగ బద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందె హక్కు ఉందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి దేవి మానస జిల్లా కారాగారాన్ని సందర్శించారు. జైలు పరిసరాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందెందుకు అర్హులైన పేద అండర్ ట్రయల్ ఖైదీలు తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించాలని ఆమె సూచించారు. ప్రతి అర్హుడికి రాజ్యాంగ బద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందె హక్కు ఉందన్నారు. ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కారాగార సూపరింటెండెంట్ శ్రీధర్, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థలాలు కోల్పోతున్న పట్టాదారులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం సర్వే నెం. 218లో ఇండ్ల స్థలాల పట్టాలు పొందిన వారికి న్యాయం చేయాలని బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బాధితులతో కలిసి పగడాల నాగరాజు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఖమ్మం పట్టణంలో మూడువేల మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కేసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రఘునాథపాలెం సర్వే నెం. 2018లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారన్నారు. అమరావతి నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పేరుతో ఇండ్ల స్థలాలను తీసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 300 మంది పట్టాదారులు ఇండ్ల నిర్మాణంపై ఆందోళనకు గురవుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలు, మాజీ డిప్యూటీ మేయర్ మురళీ, పొదిల నాగరాజు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పోస్టుల అక్రమాలపై విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని సత్తుపల్లి మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్‌ను సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రతినిధి బృందం బాధిత అభ్యర్థులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈ నియామకాల్లో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నియామక ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, బత్తుల మురళీ, వీరన్న, బిచ్చాల తిరుమలరావు, పాల్గొన్నారు.

## నాల్సా పథకాల ప్రయోజనాలు అందించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** అర్హులైన లబ్దిదారులకు నాల్సా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ (డిఎల్ఎస్ఏ) కార్యదర్శి పి. దేవి మానస మధర్ థెరిస్సా నిరాశ్రయుల ఆశ్రయ గృహాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయితులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు.

## సిపిఐ గద్దె కూల్చడం పిరికిపందల చర్య



**ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం**

**సిపిఐ నగర కార్యదర్శి జానిమియా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ పార్టీ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య అని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాటు చేసిన పార్టీ గద్దెను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐటియుసి ఆటో స్టాండ్ ఉపాధ్యక్షులు షేక్ అక్రమ్, ఖానాపురం హవేలీ సహాయ కార్యదర్శి ఆముదాల వెంకన్న తదితరులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర కార్యదర్శి జానిమియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా దెబ్బతీసేవిధంగా సిపిఐ పార్టీ గద్దెను అర్ధరాత్రి వేళ అక్రమంగా కూల్చివేయడం అత్యంత ఖండనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కూల్చివేసిన చోటే సిపిఐ పార్టీ గద్దెను తిరిగి ఏర్పాటు చేయాలని జానిమియా చేశారు.

## నాసిరకం పనులను ఉపేక్షించేది లేదు

- రూ 28.78 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/పాల్వంచ:** కొత్తగూడెం, సుజాతనగర్‌లతో పాటు పాల్వంచ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పాల్వంచలోని రెండవ డివిజన్‌లో ఎంజిఎఫ్ నిధులతో చేపట్టిన రూ. 11. 96 లక్షల సిసి రోడ్, ఐదవ డివిజన్‌లో రూ. 10.96/లతో సిసి రోడ్, రూ. 6.21 లక్షలతో డ్రైన్‌ల నిర్మాణానికి మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక కార్పొరేటర్‌లు వేగినాటీ భవిత, నూకల సరితలతో కలిసి గురువారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ పాల్వంచ ప్రాంత ప్రజలు నాపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని అన్నారు. ఇందుకు కావలసిన నిధులను సమకూర్చుకొనేందుకు ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిధులను మంజూరు చేయిస్తున్నానని చెప్పారు. ఇప్పటికే దేశంలో ప్రతిష్టాత్మకమైన ఎర్త్ యూనివర్శిటీ నెలకొల్పామని, అలాగే కేంద్రీయ విశ్వ విద్యాలయం, యంగ్ ఇండియా స్కూల్, పోలీస్ సూపరింటెండెంట్ ( ఎస్‌పి) కార్యాలయం , ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో 50 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ క్రీడా మైదానాన్ని నిర్మించబోతున్న తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌తో బ్బందులు ఎదుర్కొంటున్న పట్టణ ప్రజలకు విముక్తి కలిగించేందుకు బైపాస్ రహదారులను నిర్మాణం మంజూరు చేయించానని అన్నారు. ప్రజల సొమ్ముతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాసిరకం పనులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరిగేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు సైతం దృష్టి సారించాలని కోరారు. పట్టణ వాసులకు కావాల్సి అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన ప్రజల రుణం తీర్చుకొంటానని హామీ ఇచ్చారు. గతంలో ఎంఎల్ఏగా ఉన్న సమయంలో హమాలీ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటీ సజీవంగా దర్శనమిస్తున్నాయని కాలనీ వాసులు గుర్తు చేశారు. అప్పుడు మీరే, ఇప్పుడు మీరే మాకాలనీని పట్టించు కొని పనులను చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ కే. సుజాత, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కనగాల అనంతరాములు నాయకులు గౌతమి క్రిష్ణ, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్‌బాబు, నరహరి నాగేశ్వరరావు, కమటం సురేష్, రామారావు, ఆలపాటి ప్రసాద్, లీలావతి, ఆదిలక్ష్మి, వేములపల్లి రాజశేఖర్, భూక్యా విజయ్, లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు, గోపాల్, అంబడిపుడి నరేందర్, షేక్ కరీం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

- ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి
- వైఎస్ఆర్ కాలనీలో పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల వయస్సు గల ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టిసారించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి నాణ్యమైన బోధన అందించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం విద్యాభ్యాసానికి ఎంతో అవసరం అన్నారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని, రాగిజావను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వర్షాకాలం నేపథ్యంలో ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం తెలిపారు. నగరంలో పలు చోట్ల చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు పూడుకుపోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. నిల్వ నీరు ఉన్న ప్రాంతాలలో దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా మందులు పిచికారి క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ అహంకార గద్దె కూలడం ఖాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ జెండా గద్దెల జోలికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, ఆ అహంకార గద్దె కూలడం ఖాయమని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతో బిఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేసిన ప్రాంతాన్ని గురువారం బిఆర్ఎస్ నేతలు పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి తుమ్మల అనుయయులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజల మనోభావాలు దెబ్బ తీసే చర్యలకు ఊసిగొల్పుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ జెండా గద్దెలను కూల్చివేయాలంటూ చేసిన వ్యాఖ్యలను మంత్రి తుమ్మల అనుసరిస్తూ బిఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేశారన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఖమ్మంలో కూల్చివేతలే మంత్రి తుమ్మల ఎజెండాగా పెట్టుకున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై కాకుండా ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దేవభక్తిని కిషోర్‌బాబు, గొల్లపూడి రాంప్రసాద్, సురేష్‌నాయక్, వీరేందర్ గౌడ్, షకీనా, మాటేటి కిరణ్, భూక్యా అశోక్, మధు, సతీష్, రమేష్, కొమరయ్య, మల్లేష్, వెంకన్న, గాంధీ, నరేష్, ఉపేందర్, వెంకట్, రాజ్యలక్ష్మి, ప్రవీణ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి నిస్సాన్ టెక్ టోన్ వాహనం విడుదల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజం నిస్సాన్ కంపెనీ నూతనంగా రూపొందించిన టెక్ టోన్ కారును ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆథరైజ్డ్ డీలరైన వివిసి ఆటో మొబైల్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో నిస్సాన్ టెక్ టోన్ కారును ఖమ్మం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి. రాంబాబు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంవివో రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పక సీటు బెల్ట్ ధరించాలని, ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడపవద్దన్నారు. వాహనానికి ఇచ్చిన గరిష్ట వేగం దాటకుండా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్‌ను తెలుసుకుని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు సిపిఐ కుటుంబాలను పరామర్శించిన కర్నాటి భానుప్రసాద్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సిపిఐ పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తల సేవలు మరవలేనివని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో ఆయన పర్యటించి, ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శించడంతో పాటు ప్రమాదానికి గురైన స్థానిక నాయకుడిని పరామర్శించారు. ఇటీవల మరణించిన సిపిఐ గ్రామ శాఖ కార్యవర్గ సభ్యులు మరికంటి రాములు దిశదిన కార్యక్రమంలో భానుప్రసాద్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల కన్నుమూసిన సిపిఐ సీనియర్ సభ్యులు బాలిన రాజాలు, చిలివేరు ఉపలయ్యల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు పార్టీ పట్ల చూపిన అభిమానాన్ని, చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. పార్టీకి నిబద్ధులై పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏ సాయం కావాలన్నా వెంట ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తూ యాక్సిడెంట్‌కు గురై కాలు ఫ్రాక్చర్ అయిన సిపిఐ గ్రామ శాఖ సీనియర్ నాయకుడు ముత్యాల వెంకటేశ్వర్లును ఆయన నివాసంలో పరామర్శించారు. వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఏ అవసరం ఉన్నా ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శిలు భద్రజీ వేంకటేశ్వరరావు, బాలెబోయిన వేంకన్న, సభ్యులు కుంచం బిక్షం, పొలంపల్లి నారయణ, అనంత శ్రీనివాస్, సిపిఐ స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ యూనిట్ల ఏర్పాటు వేగవంతం

### లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఆత్మకూర్ గ్రామంలో అమలవుతున్న మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం ఆత్మకూర్ గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ పథకం అమలును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్లపల్లి గణపతి నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్‌ను పరిశీలించి, దాని పనితీరు, నిర్వహణ విధానం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలుగుతున్న ప్రయోజనాలపై వారితో మాట్లాడారు.అనంతరం గ్రామంలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పురోగతిపై తెలంగాణ రెడ్‌కో, విద్యుత్ శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మొదటి విడతలో అర్హులైన 764 మంది లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 251 ఇళ్లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్లకు అవసరమైన సామగ్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చి, ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన ఆత్మకూర్ గ్రామంలో మిగిలిన లబ్ధిదారుల ఇళ్లలో కూడా సోలార్ యూనిట్ల ఏర్పాటు ఆలస్యం కాకుండా అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సమీకరించి పనులను



పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, టీజీ రెడ్‌కో ఫీల్డ్ అధికారులు దీపక్, నవీన్ కుమార్ యాదవ్, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు భరత్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం

### మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్న అధికారులు


**ప్రజాపక్షం/ములుగు:** అల్పపీడనం ప్రభావంతో గోదావరి, ఇంద్రావతి నదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద గోదావరి నీటి ప్రవాహం వేగంగా పెరుగుతోంది. గురువారం ఉదయం 9గంటలకు 3.63 లక్షల క్యూసెక్కులుగా ఉన్న నీటి ప్రవాహం సాయంత్రం 5గంటలకు 7.60 లక్షల క్యూసెక్కులకు చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉండడంతో గురువారం సాయంత్రం సుమారు 7గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు వెల్లడించారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లవద్దని, నదిలోకి దిగడం, పశువులను దాటించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పరివాహక ప్రాంత ప్రజలకు అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత మండల అధికారులను ఆదేశించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/జనగామ:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారుఏ. జిల్లాలో వర్షాలు కుస్తున్న నేపథ్యంలో గురువరాం అధికారులతో కలిసి సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 24 గంటలు పనిచేసేవిధంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ నిరంతరాయంగా పనిచేసేలా చూడాలన్నారు. కూలిపోయే భవనాలపై అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి పారుదల శాఖ అధికారుతలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని, పోలీస్ శాఖలో కలిసి సంయుక్తంఆ క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వయించాలని, జీరోక్యాజువాలిటీస్ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ బెన్హాలోమ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మేడిగడ్డకు భారీ వరద



**ప్రజాపక్షం/మహదేవపూర్:** గత మూడురోజులుగా తెలంఆణమహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రవాహం పెరిగి మేడిగడ్డకు వరద ప్రవాహం పెరిగింది.దీంతో మేడిగడ్డ వద్ద 154700 కూసెక్కుల ఇన్‌ఫ్లో నమేదైంది.కాగా అధికారులు అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు.ఈ సందర్భంగా నదీ పరీవాహకప్రాంత ప్రజలు గోదావరి వద్దకు వెళ్లొద్దని సూచించారు.రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందునప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను నిర్మూలించాలి

### ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ల (ప్రమాదకర ప్రాంతాలు) గుర్తింపు, శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రధానంగా తెలంగాణలోని వరంగల్ జిల్లా గుండా వెళ్లే జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వివరాలు, వాటి నిర్మూలనకు చేపట్టిన పనుల పురోగతిపై ఎంపీ కేంద్రాన్ని వివరణ కోరారు.ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 2023–2025 కాలానికి సంబంధించిన ఈడీఏఆర్ ప్రమాదాల డేటాను ఆధారంగా తీసుకుని, ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసిన కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ ద్వారా 6,358 బ్లాక్ కారిడార్లను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రాల వారీగా ఈ వివరాలను అనుబంధంగా సభకు సమర్పించినట్లు పేర్కొన్నారు. అలాగే వరంగల్ గుండా వెళ్లే జాతీయ రహదారులపై గుర్తించిన ప్రమాదకర కారిడార్ల జాబితాను కూడా అందించినట్లు వెల్లడించారు. అయితే ప్రమాదకర ప్రాంతాల నిర్మూలనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించే విధానం లేదని, జాతీయ రహదారుల అభివృద్ధి, నిర్వహణ పనుల్లో భాగంగానే ఈ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేవలం బ్లాక్‌స్పాట్ల గుర్తింపు మాత్రమే కాకుండా వాటి నిర్మూలనకు నిర్దిష్ట కాలపరిమితిలో చర్యలు పూర్తి కావాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న భద్రతా పనులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రజల ప్రాణరక్షణకు రహదారి భద్రత అత్యంత కీలకమని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో బ్లాక్‌స్పాట్ల నిర్మూలన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని, అవసరమైతే అదనపు ప్రాజెక్టులకు కూడా ఆమోదం ఇవ్వాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## రానున్న రెండు రోజులు భారీ వర్ష సూచన

### లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక చేశారు.జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవసరం లేకుండా బయటకు రావొద్దని, బయటకు వస్తే జాగ్రత్తలు తప్పనిసరి. వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు వెళ్లొద్దు లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి. కలెక్టరేట్ లో 9030632608 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సంప్రదించాలి. జిల్లా యంత్రాంగం అప్రమత్తం గ్రామం నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు అందుబాటులో ఉండాలి. రహదారులపై నీరు ప్రవహిస్తుంటే ప్రజలు రవాణా చేయకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలి. ప్రజల భద్రతే ముఖ్యం అని ప్రజలు సహకరించాలని, పశువుల సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాపక్షం/పర్వతగిరి :** రైతులకు అన్ని విధాలుగా అండుకుంటూ అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించి రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. కాలువకు నీరు వస్తే రైతులకు వ్యవసాయానికి దోహదపడుతుందన్నారు. పర్వతగిరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ రైతుల బాధలు అర్థం చేసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. స్థానికంగా కొంత మంది ప్రతిపక్ష నాయకులు రైతులకు తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సహాయం చేయలేని దద్దమ్మలు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సరైన రీతిలో బుద్ధి చెప్తామన్నారు. రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్ని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు నాయకులతో, అధికారులతో కలిసి సందర్శించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సావిత్రి, సర్పంచ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, గ్రామ శాఖ అధ్యక్షులు రాంచందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, సీనియర్ నాయకులు సంపత్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు హక్కులు కల్పించాలని తహసీల్దార్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజల భూముల రక్షణ, పేదల హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది. హనుమకొండ మండలంలోని 31వ డివిజన్ పరిధిలోని సర్వే నం. 964లో ఉన్న ప్రభుత్వ భూమిలో గత సుమారు 100 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు గృహ హక్కులు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఆ కుటుంబాలు నివసిస్తున్న భూమిని కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల పేద ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆ కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వారికి గృహ నిర్మాణ పట్టాలు మంజూరు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థిర నివాస హక్కులు కల్పించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఆ భూమిపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు జరగకుండా రెవెన్యూ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సారంగపాణి యాదవ్, రవి, యాకయ్య,మల్లయ్య, కంచెర్ల కుమారస్వామి, నోముల కిషోర్, ఎన్నం వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏసిపి తనిఖీ



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగంపేట మహిళా పోలీస్ స్టేషన్– 2ను వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైమ్స్ ఏసీపీ సదయ్య తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, బాధిత మహిళలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ కేసులు, ప్రస్తుత దర్యాప్తులో వున్న కేసులు, నిందితుల అరెస్ట్, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళల ఫిర్యాదులను అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా స్వీకరించి, వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా బాధిత మహిళలకు భరోసా కల్పిస్తూ వారికి అవసరమైన సహాయం అందించాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళతో మర్యాదపూర్వకంగా, సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ సువర్ణతో పాటు, ఎస్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇ–కెవైసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి: వ్యవసాయ శాఖ

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలంలో రైతుల ఈ కేవైసీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది ఇప్పటి వరకు 85శాతం మంది రైతులు ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకోగా ఇంకా 15 శాతం మంది రైతులు మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు పెండింగ్ జాబితాలో ఉన్న రైతులందరూ ఆలస్యం చేయకుండా వెంటనే ఈ కేవైసీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు ఈ ప్రక్రియ పూర్తి చేయని రైతులు యూరియా బుకింగ్ తో పాటు ప్రభుత్వం ప్రయోజనాలను పొందలేరని అధికారులు హెచ్చరించారు అందువల్ల ఇంకానమోదు చేసుకోని వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం లేదా సంబంధిత సేవా కేంద్రాన్ని సంప్రదించి వెంటనే ఈ కేవైసీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## పారదర్శకంగా భూ రీ సర్వే నిర్వహణ




### సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలి
### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అర్హులైన రైతులకు న్యాయం జరిగే విధంగా పారదర్శకంగా భూముల రీ సర్వే నిర్వహించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం లోని గోరుకొత్తపల్లి, మొగుల్లపల్లి మండలాల్లో భూ సర్వే గ్రామసభలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూ సర్వేకు ముందు గ్రామ ప్రజలకు నోటీసులు అందజేసి పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని, ప్రతి రైతు, ప్రతి కుటుంబం ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సర్వే ద్వారా భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారించబడటంతో పాటు, ఒకరి పేరుపై ఉన్న భూమిని అసలు యాజమాని పేరుకు మార్చే అవకాశం కలుగుతుందని తెలిపారు. అలాగే అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందజేయడం ద్వారా రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి అన్నారు.ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజ్ కిష్టయ్య, గోరుకొత్తపల్లి తహసీల్దార్, ఎంపీడీవో, ఏడీ సర్వే అధికారులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/గూడూరు:** నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) చెక్కులను మానుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బొడ్డుపెల్లి రాజేశ్వరి గుగులోత్ లలిత జరుపుల రంగమ్మతో పాటు పలువురు అర్హులైన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా మండల నాయకలు చిట్టె వెంకన్న బీరం శ్రీపాల్‌రెడ్డి కొమ్మాలునాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి రసూల్ వీరస్వామి తదితరులు పాల్గోన్నారు

## విద్యార్థులకు నాణ్యమైన, భోజనం అందించాలి

### మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి
### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎస్సి, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 2026–27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి రోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకొని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ సురేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## చెట్లు నాటడం భవిష్యత్తు తరానికి ఎంతో ఉపయోగం

### సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో గాంధీపార్క్ ముందు గురువారం వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ గుగులోతు జ్యోతి రమేష్, సిపిఐ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి చెట్లునాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరానికి చెట్లు నాటడం ఎంతో ఉపయోగమని, మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటడం ద్వారా భావితరాలకు వాతావరణ కాలుష్యం నుండి కాపాడడమే కాకుండా, సకాలంలో వర్షాలు పడి భూగర్భజలాలు కూడా పెంపొందించడానికి కృషి చేసిన వాళ్లమవుతామని అన్నారు. స్వచ్ఛమైన గాలితోపాటు రాబోయే తరాలకు ఆక్సిజన్ కూడా అందించినవాళ్ళమములతామని అందుకోసం ప్రతిఒక్కరూ చెట్టు నాటే కార్యక్రమాన్ని జీవనవిధానంలో భాగంగా చేసుకోవాలని వారు సూచించారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు శ్రీహరి రమ్య చంద్రిక, క్రాంతి 25 వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్, మరియు పెరుగు కుమార్, అజ్మీర వేణు, మాలోతు రవీందర్, నీలం వెంకటేశ్వర్లు, పడిదల కవిత, బిక్కు సాయి, యూసుఫ్, నాగేంద్రబాబు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆకర్షణలకులోనై మోసపోవద్దు




**ప్రజాపక్షం/మహబూబాబాద్:**యుక్తవయస్సులో విద్యార్థులు ఆకర్షణలకు లోనై మోసపోవద్దని,భావోద్వేగాలను నియంత్రించుకొని, విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి జీవిత లక్ష్యాలను సాదించాలని ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, నేటి సమాజంలో పిల్లలు, మహిళలు తెలియకుండానే మానవ అక్రమ రవాణా బారిన పడుతున్నారని తెలిపారు. అపరిచితుల మాటలను నమ్మకూడదని, ఉద్యోగం, డబ్బు, బహుమతులు లేదా ఇతర ఆకర్షణీయమైన వాగ్దానాలకు మోసపోవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు తమ దృష్టిని చదువుపైనే కేంద్రీకరించి, తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం షీ టీం ఎస్.ఐ సునంద మాట్లాడుతూ, యుక్తవయస్సులో కలిగే ఆకర్షణలు, సామాజిక మాధ్యమాల ప్రభావం మరియు తప్పుడు పరిచయాల కారణంగా కొంతమంది పిల్లలు ఇంటి నుండి వెళ్లిపోవడం జరిగి, అనంతరం మానవ అక్రమ రవాణాకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఏహె ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
31-07-2026
www.prajapaksham.in
LOCAL NEWS స్థానికం LOCAL NEWS

# సూపర్ ఎల్ నినోపై అప్రమత్తత

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన * సూపర్ ఎల్ నినోపై వివిధ శాఖల అధికారులతో ఐడిఓసి లో మంత్రుల సమీక్ష




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు. జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ ఎల్ నేను ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గత రెండు నెలలు సరిగా వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

**ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలి**

గత ఏడాదితో పోలిస్తే భూ గర్భ జలాలు రెండు మీటర్ల కుపైగా లోతులోకి వెళ్ళాయని వెల్లడించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూ గర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇం కుడు గుం తలు నిర్మించుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పా మ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత, ఇతర ఇబ్బందులపై వచ్చే అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

**రైతులకు అవగాహన కార్యక్రమాలు..**

ఎల్ నినో, పంటల మార్పిడిపై జిల్లాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంచార్జి మంత్రి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయం కీలకమని తెలిపారు. జిల్లాకు ఆయిల్ పామ్ 1500 ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 400 ఎకరాలు పూర్తి చేయించామని, మిగతా పురోగతిలో ఉందని వెల్లడించారు. తెలంగాణ జలసిరి కింద జిల్లాలో నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్‌డిఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, సిపిఒ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వానొస్తే నరకమే.. బురద రోడ్డుపై నడవాలంటేనే జనం జంకు!

**ప్రజాపక్షం/ముత్తారం :** వానొస్తే చాలు ఆ గ్రామంలోని ప్రధాన రహదారి నరకాన్ని తలపిస్తోంది.వర్షం కురిసిందంటే రోడ్డంతా బురదమయంగా మారి గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది.గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తిగా బురద గుంటగా మారడంతో నడవడానికే జనం జంకుతున్నారు. నెల రోజులుగా తాము ఇంతటి నరకయాతన అనుభవిస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.అధికారుల నిర్లక్ష్య వైఖరిపై పారుపల్లి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు తక్షణమే స్పందించి,వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా నిర్మాణానికి నోచుకోని సిసి రోడ్డు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సాధారణంగా నిర్మాణానికి కొన్ని రోజుల ముందు సిసి రోడ్లకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేస్తూ ఉంటారు. శంకుస్థాపన చేసిన మరుసటి రోజు కొద్దిపాటి కాలవ్యవధిలో పనులు ప్రా రంభిస్తూ ఉంటారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఏడాది క్రితం సిఆర్ఆర్ ని ధులు అంచన విలువ ఐదు లక్షలతో సిసి రోడ్డు పనులకు సుల్తానాబాద్ మండలం రాముని పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో శంకుస్థాపన చేశారు. స్వయంగా ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన ఏడాది కాలం గడిచిన పనులు ప్రారంభించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మట్టి రోడ్డుపై పిచ్చి మొక్కలు వేపుగా పెరగడమే కాకుండా వర్షపు నీరు నిలవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇకనైనా సిసిరోడ్డును నిర్మించి కాలనీవాసుల ఇబ్బందులను తొలగించాలని వార్డు సభ్యుడు సతీష్ అధికారులను ప్రజాప్రతినిధులను కోరారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం /గంగాధర :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాబోయే 3 రోజుల పాటు మండలంలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, చెరువులు, వాగులు, కాలువల సమీపంలో నివసించేవారు చాలా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండలంలోని అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని ఎక్కడైనా చెట్లు విరిగి పడడం, విద్యుత్ స్తంభాలు దెబ్బ తినడం వంటి సంఘటనలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సిపి

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ పట్టణ శివారులోని లోతట్టు ప్రాంతాలను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం పరిశీలించారు. నగరంలోని తీగలగుట్టపలలి రైల్వే బ్రిడ్జి, బొమ్మకల్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పనులపై సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట డైవర్షన్‌లు ఏర్పాటు చేయాలని పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు కూడా వర్షాకాలం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నెమ్మదిగా జాగ్రత్తగా నడపాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు. సీపీ వెంట కరీంనగర్ రూరల్ సిఐ కె.నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

## రిటైర్డ్ ఎంపిడిఒ తౌటు రాంరెడ్డి మృతి బాధాకరం: చాడ



**ప్రజాపక్షం / రామడుగు :** చిగురుమామిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసి రిటైర్డ్ అయిన తౌటు రాంరెడ్డి మృతి చెందడం అత్యంత బాధాకరమని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కొక్కెరకుంటలోని రాంరెడ్డి కుటుంబాన్ని చాడ వెంకట్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులైనవారికి అందించడంలో పారదర్శకతతో పనిచేశారని ఎంపిపిగా నేను మూడు పర్యాయాలు పనిచేసిన కాలంలో రాంరెడ్డి ఎంపిడిఒగా విధులు నిర్వహించారని ప్రజా ప్రతినిధులతో అధికారులతో సమీక్షా సమావేశాల్లో సమన్వయంతో ఉండేవారిని, ఆయన జ్ఞాపకాలను వెంకట్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి ధైర్యం చెప్పారు. పరామర్శించినవారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయినిఅశోక్,జిల్లాకౌన్సిల్‌సభ్యులుబూడిద సదాశివ ఉన్నారు.

## 'ఆల్ఫోర్స్' స్కూల్లో ఎన్‌సిసి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్



**ప్రజాపక్షం /కొత్తపల్లి :** రిపబ్లిక్ డే పరేడ్ లో ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొనడం చాలా అదృష్టంగా భావించాలని పాఠశాల నిర్వాహకులు ఎన్సీసీ అధికారులు అన్నారు. కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొనేందుకు ఎన్సీసీ క్యాడెట్లకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎన్సీసీ అధికారులు మాట్లాడుతూ ఎన్సీసీలో చేరిన ప్రతి విద్యార్థి కేవలం సర్టిఫికేట్ కోసమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, సేవస్ఫూర్తి అనే అమూల్యమైన జీవిత విలువలు కూడా నేర్చుకోవడంతోపాటు అమలు పరుస్తారని అన్నారు. విద్యార్థులందరూ ఎన్సీసీ అధికారులు తెలిపిన విధి విధానాలను చక్కగా పాటించి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణమూర్తి, సంగారెడ్డి హవీల్దార్ దేవేంద్ర సింగ్, అదిలాబాద్ సుబేదార్ జంగ్ బాజ్ ఖాన్ సునీల్ కుమార్, సుబేదార్ నిజామాబాద్ , పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ఒబి నిర్మాణంలో జాప్యంపై అసంతృప్తి

హుటాహుటిన ఆర్ఒబి వద్దకు వెళ్లిన మేయర్, కమిషనర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని తీగల గుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనుల్లో జాప్యంతో పాటు రవాణా రాకపోకలు, స్థానిక ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలుగుతుండటంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ఒబినిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వారిని ప్రశ్నించారు. ఆర్ఒబి నిర్మాణ పనుల్లో జాప్యాన్ని తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ మాట్లాడుతూ తీగలగుట్టపల్లి ఆర్ఒబినిర్మాణానికి సంబంధించి భూసేకరణలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ గురువారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో న్యూఢిల్లీ నుండి ఫోన్లో మాట్లాడారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ వద్ద బిటిరోడ్డు, కల్వర్టు నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల ని కోరారు. కేంద్ర మంత్రి ఆదేశాలతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషన ర్ ప్రఫుల్ దేశాయ్ హుటాహుటిన తీగలగుట్టపల్లి ఆర్ఒబి వ ద్దకు వెళ్లారు. ఆర్ఒబి సమీపంలోని కల్వర్టును పరిశీలించారు. ఆర్ఒబి వద్ద రాకపోకలకు జరుగుతున్న ఇబ్బందులను గమనించారు. బిటిరోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభు త్వం ని ధులి వ్వనందున, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నే ఆ యా పనులను చేపట్టాలని నిర్ణయించారు. వెంటనే ఆయా పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## అన్ని శాఖల అధికారులు అప్రమత్తం

పెద్దపల్లి జిల్లా అధికారులతో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబువీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గత 48 గంటలుగా జిల్లాలో కు రుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకా శం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయ తో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం ఎమ్మెల్యే మ క్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భా రీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడిఒసి) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నా రు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు. చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

## 50వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి



మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలంలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ 50వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి చేసి మరో మైలురాలుని అధిగమించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు.సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆయిల్ ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణపై నిర్వహించి సమీక్ష సమావేశం నిర్వహించారు. తక్కువ కాలంలోనే ఫ్యాక్టరీ ఈ ఘనత సాధించడం సంతోషకరమన్నారు. రోజుకు 600 టన్నులు,నెలకు 18వేల టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఈ ఫ్యాక్టరీ పని చేస్తోందని తెలిపారు. అధిక ఆయిల్ రికవరి ఉండటం వల్ల రైతులకు మరింత లాభం చేకూరుతుందన్నారు. భవిష్యత అవసరాలను దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రికెసిఆర్ ఆశీస్సులతో రిఫైనరీ ఏర్పాటు చేశామని ఆయిల్ పామ్ గెలల నుంచి నేరు శుద్ధి చేసిన వంటనూనె తయారయ్యేలా అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ ధర రూ. 24వేల వరకు చేరడంతో రైతుల్లో ఈ పంటపై ఆసక్తి పెరిగిందన్నారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వ్యవసాయ శాఖ ఆయిల్ ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని హరీష్‌రావు సూచించారు.

## హుస్నాబాద్‌లో నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్టు ప్రారంభం



**ప్రజాపక్షం/హుస్నబాద్:** హుస్నాబాద్ పట్టణంలో నూతనం గా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఔట్ పోస్టును గురువారం సిద్దిపేట కమీషనర్ ఆఫ్‌పోలీసు రష్మిపెరుమాల్ ప్రారంభించారు. అనంతరతం ఆవరణలో మొక్కను నాటారు . ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో పెరుగుతున్న ట్రా ఫిక్ ఇబ్బందులను నివారించడానికి ప్రజల సౌకార్యర్థం నూత న ట్రాఫిక్ ఆవుట్ పోస్టును ఏర్పాటు చేసినట్లు సిపి రష్మిపెరుమాల్ తెలిపారు. ట్రాఫిక్‌కు అనుగునంగా సిబ్బంది నియామ కం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రా ఫిక్ నిబంధనలు పాటించాలని వాటితో పాటు హెల్మెట్ కూడ ధరించాలని సూచించారు. ఆదనపు డిసిపి అడ్మిన్ కుశాల్కర్, హుస్నాబాద్ ఏ సి పి సదానందం, సి ఐ శ్రీధర్ గౌడు, చేర్యాల సి రమేశ్, ట్రాఫిక్ ఎ స్.ఐ వేంకటేశ్వార్లు, డివిజన్ ఎస్ఐలు లక్ష్మారెడ్డి, అభిలాశ్, మహేశ్, ప్రశా ంత్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎసిపి కార్యాలయలో సిపి తనిఖీ**

వార్శిక తనిఖీల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ లోఎ సి పి కార్యాలయంను సిద్దిపేట సిపి రష్మిపెరుమాల్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆముకు పోలీస్ సిబ్బంది గౌరవవందనం సమర్పించారు. పర్యావరణం కాంక్షిస్తు కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించాలి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, ఫోక్స్‌కేసులను మరియు డ్రగ్స్ లాంటి కేసులను నిర్ణిత కాలంలో పరిస్కారించాలని అన్నారు. రిక్డాలను ఎప్పటికప్పుడు అఫ్‌డేట్ చేయాలని కొరారు. ఆలాగే స్టేషన్‌కు వచ్చె ప్రతి ఒక్కరిపై మర్యాదతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కారించేలా చొరవచూపాలని స్పష్టం చేశారు. డివిజన్‌లో అన్ని గ్రామాల్లో సిసికెమోరాలనుఅమర్చెలా ఆవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోపోలీస్‌అధికారులు పాల్గొన్నారు.

## వేగంగా వరద సహాయక చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక ప్రాంతంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ప్రభావిత ప్రాంతాలను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. 21వ డివిజన్ వీర్లపల్లి, ఒసిపి3 ఏరియా, 25వ డివిజన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని తగిన సూచనలు చేసి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు రూపొందించాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎప్పటికపుడు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక సేవల్లో ఏలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో అధికారులు పనిచేయాలన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలోని గృహాల్లోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సిఎల్ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఒసిపి3 ప్రాంతంలో యంత్రాలతో నీటిని వేగంగా తొలగించాలన్నారు. నిల్వ నీటి వల్ల ఏలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఈ పర్యటనలో నగరపాలక, ఆర్ఎఫ్‌సిఎల్ అధికారులు, కార్పొరేటర్ సిరిశెట్టి సతీష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అప్పాసి శ్రీనివాస్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, మిర్జా సలీంబేగ్‌లు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో సకల సౌకర్యాలు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** దోస్త్ ఆన్లైన్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సకల సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం గజ్వేల్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, విద్యార్థుల కోసం ఎద్యుకేషన్ హబ్ తదితరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూల నుండి సిద్దిపేట, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందారని చదువు కోడానికి కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నా, నిరుపేద విద్యార్థులు ప్రవేట్ రూమ్ తీసుకుని చదువే స్థోమత లేని వారికి హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం ఎద్యుకేషన్ హబ్ సమీపంలోని భవనాలు హాస్టల్ కొరకు సిద్ధం చెయ్యాలని, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ లో కొన్ని గదులను కేటాయించి అందులో విద్యార్థుల కోసం బెడ్స్, వాష్ రూమ్, కిచెన్ షెడ్ నిర్మించాలని ఇడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కేటాయిస్తుండగా, మైనర్ రిపేర్లు ఉంటే పూర్తి చెయ్యాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అంతరం ఆమె సఖి కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిడబ్ల్యుఒ శారద పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల :** భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.గురువారం తహసీల్దార్లు,ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు.తహసీల్దార్లు, ఎంపిడిఒలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి భోజనం, తాగునీరు, అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డ్రింకింగ్ వాటర్ బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా వర్షాల కారణంగా ప్రమాదాలు,నీటి ముంపు,ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.ఈ సమావేశం లో జిల్లా ఎస్పి అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు రాజ గౌడ్,లత,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసనలు అణచివేతపై

# అమిత్ షా ప్రకటన చేయాలి

- పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపిల నినాదాలు
- రాజ్యసభ నుంచి విపక్ష సభ్యులు వాకౌట్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభలను గురువారం కూడా ప్రతిపతిపక్ష సభ్యులు స్తంభింపజేశారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఈనెల 20న సిజెపి నేతృత్వంలో విద్యార్థులు, యువత 'పార్లమెంట్ మార్చ్' నిర్వహించగా, వారిపై పోలీసుల అకృత్యాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. అయితే రాజ్యసభలో విపక్ష సభ్యులు చేసిన డిమాండ్‌ను చైర్మన్ తిరస్కరించడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు గురువారం రాజ్యసభ నుండి వాకౌట్ చేశాయి. ఉదయం సభ ప్రారంభమై వెంటనే సభలో చర్చనీయాంశాల జాబితాలోని పత్రాలను ప్రవేశపెట్టిన తురవాత ఈనెల 20న జరిగిన పోలీసుల చర్యపై వివరణ ఇవ్వడానికి షా సభకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ నిబంధనల క్రమాన్ని ప్రస్తావిస్తూ, రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలి పార్లమెంటుకు జవాబుదారీగా, బాధ్యురాలిగా ఉంటుందని అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, కాల్పులు జరిగినప్పుడు, హోం మంత్రి సభకు వచ్చి దీనిపై ప్రకటన ఇవ్వాలన్న నిజమైన డిమాండ్ ఉంది అని ఆయన అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ నిబంధనల క్రమాన్ని తిరస్కరించి, జాబితాలోని జీరో అవర్ ప్రస్తావనలను కొనసాగించారు. సభ్యులను మాట్లాడమని సభాధ్యక్షుడు పిలిచినప్పటికీ, ప్రతిపక్ష ఎంపిలు 'హోం మంత్రి సభకు రావాలి', 'హోం మంత్రిని తొలగించండి' వంటి నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఇతరులకు అంతరాయం కలిగించడం ప్రతిపక్ష సభ్యులకు సరికాదని సభాధ్యక్షుడు అన్నారు. ప్రధానమంత్రి, మంత్రులు పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటారని తివారీ మళ్లీ చెప్పే వరకు దాదాపు అరగంట పాటు నినాదాలు కొనసాగాయి. హోం మంత్రిని సభకు రమ్మంటున్నాము, మా ఇళ్లకు కాదు అని ఆయన అన్నారు. లాఠీలు ఎక్కుపెడుతున్నప్పుడు, తూటాలు పేలుతున్నప్పుడు హోం మంత్రి స్పందించాలన్నారు. తమ డిమాండ్ నెరవేరకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. వాకౌట్ అనంతరం, సభా నాయకుడు, కేంద్ర మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్షాల ప్రవర్తన ప్రతికూలంగా ఉందన్నారు. సభకు అంతరాయం కలిగిగిస్తున్నారని, ప్రతిపక్షానికి స్పష్టమైన లక్ష్యం లేదని, వారు లక్ష్యాలను మారుస్తూనే ఉంటారన్నారు. కాగా, ప్రతిపక్షాలు వాకౌట్ చేసిన అనంతరం, సభ జాబితాలో ఉన్న కార్యకలాపాలను కొనసాగించింది. మరోవైపు లోక్‌సభలో కూడా ఇవే పరిస్థితులు కనిపించాయి. సభ పలుమార్లు వాయిదా పడింది. ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో సభను మధ్యాహ్నం 3.30 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ సమావేశమైన వెంటనే ప్రతిపక్షాలు నినాదాలు చేయడం ప్రారంభించాయి. సభ అధ్యక్షురాలు సంధ్యా రే, ప్రతిపక్ష ఎంపిలను తమ తమ స్థానాల్లో కూర్చోమని కోరారు. అయితే, నినాదాలు కొనసాగుతుండటంతో ఆమె సభను వాయిదా వేశారు. బుధవారం కూడా ప్రశ్నోత్తరాల సమయం జరగలేదు. అయితే, పేపర్ లీక్‌ల నిరోధక చట్టానికి సవరణలు చేసి, కఠినమైన శిక్షలు విధించే బిల్లు మూజివాణి ద్వారా ఆమోదం పొందింది.

పేపర్ లీక్ నియంత్రణ చట్టసవరణ

# విద్యార్థులను శాంతింపజేసేందుకే...

- సమస్య పరిష్కారానికి కాదు...
- రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మండిపాటు
- పేపర్ లీక్‌లను నివారించేలా పరీక్షలను ఎలా నిర్వహిస్తుందో ప్రభుత్వం వివరించలేదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ సర్కార్‌పై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న యువతను శాంతింపజేయడానికే పేపర్ లీక్ నిరోధక చట్టానికి సవరణను ప్రభుత్వం తీసుకువస్తోందని ఆరోపించారు. సమస్యను పరిష్కరించడానికి కాదని విమర్శించారు. గురువారం 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026'పై ఖర్గే మాట్లాడుతూ పేపర్ లీక్‌లను నివారించేలా పరీక్షలను ఎలా నిర్వహిస్తుందో ప్రభుత్వం వివరించలేదని ఖర్గే అన్నారు. పేపర్ లీక్‌ల కేసులలో అధిక జరిమానాలు, కఠినమైన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల వంటి నిబంధనలు ఎలాంటి మార్పు తీసుకురావని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పరీక్షలను ఎలా నిర్వహిస్తుందనే దానిపైనే తేడా ఉంటుందన్నారు. సంస్థలు, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకువచ్చి, జవాబుదారీతనాన్ని నిర్ధారించే వరకు పేపర్ లీక్‌లు కొనసాగుతాయని, ఈ సభల్లో మళ్లీ ఇదే విషయంపై చర్చిస్తామని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్‌లు అమాయక విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బాధిస్తాయన్నారు. రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్ర సందర్భంగా పేపర్ లీక్‌ల విషయాన్ని లేవనెత్తారని, అలాగే 2024లో ఈ బిల్లును తొలిసారి ఆమోదించినప్పుడు ప్రతిపక్షాలు కూడా కఠినమైన చట్టాన్ని డిమాండ్ చేశాయని ఆయన గుర్తుచేశారు. అయితే, ప్రభుత్వం రాజకీయ కారణాలతో హడావిడిగా ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. రెండేళ్లలోపే ఈ బిల్లుకు సవరణలు చేయాల్సి ఉండేదని, కాని ఇది ఇంకా అసంపూర్ణంగానే ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన యువతను అభినందిస్తూ, వారి ఐక్యగళం, పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనల కారణంగానే ప్రభుత్వం చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కుర్చీని కాపాడుకోవడానికి ప్రధాన్‌ను తొలగించాల్సి వచ్చిందని ఆయన ఆరోపించారు. చర్చలకు సిద్ధంగా లేని ప్రభుత్వ వైఖరిని ఖర్గే విమర్శిస్తూ, చర్చలు కోరుతున్న యువతపై దేశద్రోహులుగా ముద్రవేసి, లాఠీఛార్జ్ చేసి, బాష్ప వాయువు ప్రయోగించారని, పెల్లెట్ గన్‌లతో తీవ్రంగా గాయపరచడంతో చాలా మందికి ఐసియులో చేర్చాల్సి వచ్చిందని మండిపడ్డారు. అశాంతి నెలకొన్నప్పటికీ ప్రధానమంత్రి, హోంమంత్రి ఇద్దరూ మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వారికి మాత్రం సిగ్గుగా ఉందో లేదో తెలియడం లేదన్నారు. విద్యార్థులపై జరిగిన అఘాయిత్యాలకు ఎవరు బాధ్యులు అని ఆయన ప్రశ్నించారు. ప్రజాశక్తే వారిని బయటకు ఈడ్చుకొస్తుందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జీ బాష్పవాయువు ప్రయోగానికి ఎవరు ఆదేశాలు ఇచ్చారని, అలాగే విద్యార్థులను కొట్టిన సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు ఎవరు అనే ప్రశ్నలకు హోం మంత్రి సమాధానం చెప్పలేకపోతే, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పోలీసుల చర్యల గురించి కూడా ఖర్గే ప్రస్తావించారు. అక్కడ విద్యార్థులపై ఎకె47 రైఫిల్స్‌తో కాల్పులు జరిపారని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా అనేకసార్లు పరీక్షా పత్రాల లీకేజీలు జరిగినప్పటికీ, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. 2024 నీట్ పరీక్షా పత్రం లీకేజీ కేసులో ప్రధాన నిందితుడికి 'క్లీన్ చిట్' ఇచ్చారని కూడా ఖర్గే దుయ్యబట్టారు.

# సభకు షా గైర్హాజరు... దోషపూరిత చర్య

- విద్యార్థులపై పోలీసుల అమానుషదాడికి సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాల్సిందే
- దాడిని వివరించేందుకు హోంమంత్రి ఎందుకు భయపడుతున్నారు? : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల అమానుషదాడికి సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు గైర్హాజరు కావడం దోషపూరిత చర్యనే సూచిస్తోందన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తున్న వీడియో క్లిప్‌ను కూడా రాహుల్‌గాంధీ గురువారం ఎక్స్‌లో షేర్ చేశారు. ఈనెల 20న పార్లమెంటు వరకు 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో విద్యార్థి ప్రదర్శనకారులపై భద్రతా దళాలు జరిపిన అణచివేతను ప్రస్తావిస్తూ, 'విద్యార్థులకు న్యాయం జరగాలి. మన విద్యార్థులపై జరిగిన అఘాయిత్యాలపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఒక స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి' అని ఆయన ఆ సోషల్ మీడియా సైట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో పార్లమెంటుకు వచ్చి విద్యార్థులపై జరిగిన క్రూరమైన హింస గురించి వివరించడానికి షా ఎందుకు అంతగా భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇది దోషపూరిత చర్యనే సూచిస్తోందన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై 'క్రూరమైన దాడి' జరిగిందని, వారిపై పెల్లెట్ గన్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ, షాను పదవి నుంచి తొలగించాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని రాహుల్‌గాంధీ బుధవారం కూడా డిమాండ్ చేశారు. విద్యార్థులపై 'క్రూరత్వానికి' ఆదేశించడం ద్వారా షా దోషి అని, అందువల్ల ఆయనను తొలగించాలని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వాడకం గురించి మంత్రికి తెలియకపోతే, ఆయన అసమర్థుడని అన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

- విద్యార్థులపై అకృత్యాలకు హోంమంత్రే ఆదేశించి ఉంటారు
- 'కాక్రోచ్ జనతా పార్టీ' అధ్యక్షుడు దీప్కే ఆరోపణ



**ఛత్రపతి సంభాజీనగర్ :** విద్యార్థులపై పోలీసుల చర్యకు బాధ్యత వహిస్తూ హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగిన 'సంసద్ చలో' (పార్లమెంట్ మార్చ్) సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగం చేయాలన్న ఆదేశాలు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచే వచ్చి ఉంటాయని 'కాక్రోచ్ జనతా పార్టీ' అధ్యక్షుడు ఆరోపించారు. మధ్య మహారాష్ట్రలోని తన స్వస్థలమైన ఛత్రపతి సంభాజీనగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తుండటంతో పాటు న్యాయవ్యవస్థపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అనేది ఇప్పుడు కేవలం ప్రతిపక్షానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, దేశ ప్రజలందరూ ఏకం కావాలని దీప్కే సూచించారు. న్యాయవ్యవస్థపై కూడా ప్రశ్నార్థకం నెలకొందని, శివసేన, ఎన్‌సిపి (ఎస్‌పి) వంటి పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి ఇడి, సిబిఐలను ఎలా ఉపయోగించారో మనమందరం చూశామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడం దేశంలోని కీలక సంస్థల బాధ్యత అని, అంతే తప్ప ఒక వ్యక్తి నియంతృత్వాన్ని సృష్టించడం కాదన్నారు. కానీ బిజెపి సర్కార్‌ను రాజ్యాంగబద్ధ సంస్థలను తమ ఆధీనంలోకి తీసుకుని దీనిని అడ్డుకోవడానికి ప్రతిపక్షం మాత్రమే కాదు, ప్రజలు కూడా ఏకం కావాలని దీప్కే స్పష్టం చేశారు. కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి నియమించడాన్ని అభిజీత్ విమర్శించారు. ఆయనను ఒక విచిత్రమైన వ్యక్తిగా అభివర్ణించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించి మరో వింత మనిషిని తీసుకువచ్చారని, ఆయన అత్యాచారాలకు పాల్పడిన వారిని ప్రశంసించారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం గూండాలకు, అత్యాచారాలకు పాల్పడిన వారికి మద్దతు ఇస్తుందని మండిపడ్డారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు నాయకత్వం వహించిన జెన్ జీ భారతదేశ సంస్కృతిని అపఖ్యాతి పాలు చేసిందన్న యోగా గురు, పారిశ్రామికవేత్త రామ్‌దేవ్ వ్యాఖ్యల గురించి అడగ్గా, దీప్కే ఆయనపై వ్యంగ్యంగా విమర్శలు చేసి, తన పతంజలి ఆయుర్వేద్ కంపెనీ వ్యాపారాన్ని చూసుకోమని సలహా ఇచ్చారు. 'మేము పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా మా హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడాము. మహాత్మా గాంధీ, బి.ఆర్.అంబేద్కర్ ఫోటోలతో చట్టబద్ధంగా ఆందోళన చేయడం సంస్కృతిని అపఖ్యాతి పాలు చేయడమే అయితే, మేము అది చేశాము. గతంలో సుప్రీంకోర్టు ప్రతికూల వ్యాఖ్యలు చేసిన పతంజలిపై బాబా రామ్‌దేవ్ దృష్టి సారించాలి' అని ఆయన అన్నారు. 'రైతులు కూడా తమ పిల్లలు విజయవంతమైన కెరీర్‌లను కలిగి ఉండాలని కోరుకుంటారు. మా ఆందోళనలో మాకు అండగా నిలిచారు. రైతు నాయకులకు మా మద్దతు అవసరమైతే, మేము వారికి అండగా ఉంటాము. రైతులకు ఎక్కడ అవసరమైనా, మేము వారికి అండగా నిలుస్తాము. నేను కూడా ఒక రైతు కుటుంబానికి చెందినవాడినే. మాలో చాలా మంది రైతు కుటుంబాల నుండే వచ్చారు' అని ఆయన పేర్కొన్నారు. ఆందోళన జరుగుతున్న ప్రదేశం (జంతర్ మంతర్) దగ్గరకు ఢిల్లీ పోలీసులు రాళ్లతో నిండిన ట్రక్కులను తీసుకువచ్చారని, ఆ తర్వాత అవి నిర్మాణ స్థలం నుండి వచ్చిన వ్యర్థాలని తప్పుడు వాదన చేశారని దీప్కే ఆరోపించారు. 'ఆందోళన చేస్తున్న విద్యార్థులు రాళ్లు రువ్వారని చూపించడానికి పోలీసులు పన్నిన పథకంలో ఇది ఒక భాగం. దీనిపై నేను ఆ ప్రాంత డిసిపిని కూడా కలిశాను, ఆ ట్రక్కులో నిర్మాణ స్థలం నుండి వచ్చిన వ్యర్థాలు ఉన్నాయని నాకు చెప్పారు. ఇదంతా బిజెపి గుండాలు, ఢిల్లీ పోలీసులు కలిసి పన్నిన కుట్రలో భాగం కావచ్చు' అని ఆయన ఆరోపించారు.

ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమన్న

# హామీని నిలబెట్టుకోవాలి

పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ :** నీట్ యుజి ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ నుంచి లఢాఖ్ తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లఢాఖ్‌కు వెళ్లే మార్గంలో ఢిల్లీ శ్రీనగర్ వందే భారత్‌లో ప్రయాణించిన వాంగ్‌చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. 'రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం' అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. 'యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది' అని అన్నారు. కాగా, పార్లమెంట్‌లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారి తీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

# లోక్‌సభలో మూజువాణి ఓటుతో వందేమాతరం బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ :** కేంద్రం ప్రవేశపెట్టిన వందేమాతరం బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. గురువారం లోక్‌సభలో ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాజ్యసభలో బుధవారమే ఈ బిల్లు ఆమోదం పొందగా.. గురువారం లోక్‌సభలో ఆమోదం లభించింది. ఇప్పుడు ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈ బిల్లును రాష్ట్రపతి ముందుకు పంపనుంది కేంద్రం. 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సలట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరుతో రూపొందిన ఈ బిల్లును జూలై 24న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. దీనికి జూలై 29న రాజ్యసభ ఆమోదం తెలిపింది. అనంతరం జూలై 30, గురువారం లోక్‌సభలో బిల్లు నెగ్గింది. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల మధ్యే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందడం విశేషం. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై దాడి వంటి అంశాలపై లోక్‌సభలో వాడివేడి చర్చ జరుగుతుండగానే ఈ బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టంగా మారాలంటే దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉన్న 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సలట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971కి ఇది సవరణ బిల్లు. దీని ప్రకారం జాతీయ గీతమైన జనగణమనలాగే, జాతీయ గేయమైన వందేమాతరాన్ని కూడా గౌరవించాల్సి ఉంటుంది. ఈ గేయాన్ని అవమానపరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

# రైతుల ఆందోళనకు దిగొచ్చిన ఎంపి సర్కార్

- 60 శాతం పెసర పంట సేకరణకు, గడువు పొడిగింపునకు ఓకె
- ఎరువుల పంపిణీకి సంబంధించిన 'ఇ-టోకెన్' విధానం నిలిపివేయడానికి అంగీకారం



**భోపాల్ :** రైతుల ఆందోళనలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం దిగొచ్చింది. అర్హులైన రైతుల నుండి 60 శాతం పెసర పంటను సేకరించడానికి, సేకరణ గడువును పొడిగించడానికి, ఎరువుల పంపిణీకి సంబంధించిన 'ఇ-టోకెన్' విధానాన్ని నిలిపివేయడానికి రాష్ట్ర సర్కార్ అంగీకరించింది. దీంతో భోపాల్‌లో ఆందోళన చేస్తున్న రైతులు తమ నిరసనను విరమించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నివాసం వద్ద నిరసన తెలిపిన తర్వాత, వేలాది మంది ఆందోళనకారులు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నివాసానికి సుమారు ఒక కిలోమీటర్ దూరం వరకు ర్యాలీగా వెళ్లిన కొద్ది గంటలకే ఈ ప్రకటన వెలువడింది. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రతినిధులు, రైతు నాయకుల మధ్య జరిగిన చర్చల తర్వాత బుధవారం రాత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, అర్హులైన ప్రతి రైతు నుండి సేకరించే పెసర పంట పరిమాణాన్ని ప్రస్తుతం ఉన్న 25 శాతం నుండి 60 శాతానికి పెంచాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. నర్మదాపురం, సిహోర్, హర్దా వంటి జిల్లాల్లో ఎకరాకు సుమారు మూడు క్వింటాళ్ల పెసర పంటను పండించే రైతులకు ఈ నిర్ణయం తక్షణమే వర్తిస్తుందని, గరిష్ఠ సంఖ్యలో సాగుదారులకు ఈ ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే, పంట సేకరణకు సంబంధించిన చివరి తేదీని ఆగస్టు 10 నుండి 20కి, స్లాట్‌బుకింగ్ గడువును ఈనెల 30 నుండి ఆగస్టు 10 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఎరువుల పంపిణీకి సంబంధించిన ఇ-టోకెన్ విధానంపై ఉన్న ఫిర్యాదులు, ఆచరణాత్మక ఇబ్బందులను పరిశీలించి, మెరుగుదలలను సూచించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఐదల్ సింగ్ కన్సానా తెలిపారు. ఆ కమిటీ తన సిఫార్సులను సమర్పించి, అవసరమైన మార్పులు అమలు చేసే వరకు, ఇ-టోకెన్ ఆధారిత ఎరువుల పంపిణీ విధానం తక్షణమే నిలిపివేయబడుతుందని ఆయన చెప్పారు. కాగా, నిరసన తెలుపుతున్న రైతులు ప్రభుత్వ ప్రకటనలను అంగీకరించి తమ ఇళ్లకు తిరిగి వెళ్తున్నారని అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శైలేంద్ర సింగ్ చౌహాన్ పిటిఐకి తెలిపారు. రోషన్‌పురా స్క్వేర్ నుండి వారు సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గురువారం ఉదయం, సంయుక్త కిసాన్ మోర్చా, మరో 18 సంస్థల ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు పలు బారికేడ్లను ఛేదించుకుని, చౌహాన్ నివాసం వెలుపల ప్రదర్శన నిర్వహించి, రోషన్‌పురా స్క్వేర్ వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. మొత్తం వేసవి పెసర పంటను కనీస మద్దతు ధరకు సేకరించాలని, ఎరువుల పంపిణీకి ఇ-టోకెన్ విధానాన్ని రద్దు చేయాలని, వచ్చే సాగు సీజన్‌కు తగినంత ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు.

సిజెపి నిరసనకారులపై

# ప్రతికూల చర్యలు ఉండవ్

ఢిల్లీ ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులపై ఢిల్లీ పోలీసు ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోరని ఢిల్లీ ప్రభుత్వం గురువారం స్పష్టం చేసింది. అయితే, నిరసనలో పాల్గొన్న నేర చరిత్ర కలిగిన వ్యక్తులు మాత్రం పోలీసులు తీసుకునే చర్యను తప్పనిసరిగా ఎదుర్కోవాల్సి ఉంటుందని ఢిల్లీ ప్రభుత్వం జారీ చేసిన ఒక ఉత్తర్వులో పేర్కొంది. ఇప్పటికే నిర్బంధాలు జరిగిఉంటే, ఆ అరెస్టులను సమీక్షించి, అరెస్ట్ అయిన వారిని విడుదల చేసే ప్రక్రియను వేగవంతం చేస్తామని హోం శాఖ తన ఉత్తర్వులో వెల్లడించింది. సిజెపి జులై 20న నిర్వహించిన 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు 13 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నేరచరిత్ర కలిగిన 2,800మందికి పైగా వ్యక్తులను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఈ నిరసనలో పాల్గొన్న వ్యక్తులపై దేశ రాజధాని ఢిల్లీ ప్రభుత్వం ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోవడంలేదని, ఈ విషయాన్ని ఎలాంటి భవిష్యత్తు విచారణ లేకుండా ముగిసినట్లుగా పరిగణించాలని హోం శాఖ తన ఉత్తర్వులో పేర్కొంది. జులై 20న న్యూఢిల్లీ జిల్లాలో జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు జరిగిన యాత్ర సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నిరసనకు ముందు ఢిల్లీ పోలీసులు న్యూఢిల్లీ జిల్లా వ్యాప్తంగా, ఇతర సున్నితమైన ప్రదేశాలలో భద్రతను గణనీయంగా పెంచారు. అంతేకాకుండా పెద్ద సంఖ్యలో సిబ్బందిని, పారామిలిటరీ బలగాలను, బారికేడ్లను, అల్లర్ల నిరోధక పరికరాలను, నెట్‌వర్క్ జామర్లను మోహరించారు. పార్లమెంట్ వైపు మార్చ్‌కు ఎలాంటి అనుమతిని ఇవ్వలేదని పోలీసులు స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా 15కు పైగా వాహనాలు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. ప్రధానమంత్రిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కొన్ని సోషల్ మీడియా నిర్వహకులకు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసులు స్పెషల్ సెల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేశారు. ఘర్షణల అనంతరం ఢిల్లీ పోలీసులు కొంతమంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, వారిని విడుదల చేసినట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు.

# సౌరవ్ దాస్, ఎఐఎస్‌ఎఫ్ నేతలకు సిపిఐ సన్మానం







**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చిన యువత, విద్యార్థుల దృఢ సంకల్ప ఉద్యమానికి, వారి అసాధారణ ధైర్యానికి, పట్టుదలకు, పోరాట స్ఫూర్తిని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అభినందించారు. ప్రజలు దృఢ విశ్వాసంతో ఏకమైనప్పుడు, వారు చరిత్ర గమనాన్ని మార్చగలరని మరోసారి రుజువైందన్నారు. ఇటీవల జంతర్ మంతర్‌లో జెన్ జీ ఉద్యమంలో పాల్గొన్న నాయకులకు ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో గురువారం సన్మానించారు. డి. రాజా అధ్యక్షత జరిగిన సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిజెపి ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, దేశవ్యాప్త యువవిద్యార్థి ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఏఐఎస్‌ఎఫ్, ఇతర వామపక్ష విద్యార్థి సంఘాలు పోషించిన పాత్రను ప్రశంసించారు. ఏఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సి.రంగరాజ్ స్వాగతోపన్యాసం చేయగా, ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ వందన సమర్పణ చేశారు. వందలాది మంది యువ సహచరుల ధైర్యసాహసాలకు, త్యాగాలకు, అచంచల నిబద్ధతకు గుర్తింపుగా సిపిఐ నాయకత్వం వారిని గులాబీలు, పుస్తకాలతో సన్మానించింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సభ్యులు డాక్టర్ బాలచంద్ర కాంగో, రామ కృష్ణ పాండా, డాక్టర్ గిరీష్, అనీ రాజాలతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, ప్రొఫెసర్ దినేష్ వర్ష్నే, నిషా సిద్ధూ హాజరయ్యారు.

# ఇరాన్ నగరాలపై విరుచుకుపడిన అమెరికా

### ఎర్ర సముద్రంలో సుంకాల వసూళ్ళకు హౌతీల ప్రణాళిక

### ప్రతీకారం తీర్చుకుంటాం పిఎంఎఫ్ ఉగ్రవాదుల ప్రతిజ్ఞ



**దుబాయ్ :** ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా వైమానిక దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అనేక ప్రాంతాలలో పేలుళ్ళు సంభవించాయి. ముఖ్యంగా ఖేష్మ్‌ద్వీపం చుట్టూ దాడులు జరిగాయి. అబదాన్ నగరం, ఖుజెస్తాన్ రాష్ట్రంలోని అహ్వాజ్, కజెరున్ పారిశ్రామిక నగరంపైన,ఫార్స్‌రాష్ట్రం కాజెరూన్ కౌంటీ ప్రధాన నగరంపైన సెంట్‌కామ్ క్షిపణుల దాడులు చేయడంతో ఇరాన్‌కు అపారనష్టం వాటిల్లింది. అనేక ప్రాంతాలలో పేలుళ్ళు సంభవించాయి. ఖేష్మ్‌ద్వీపం అబదాన్ పరిసరాల్లో దాడులవల్ల ముగ్గురు ఇరాన్ పౌరులు మరణించారు. శిథిలాల నుండి మరో ముగ్గురు ఇరానీయులను సురక్షితంగా బయటకు తీశారని ఫార్స్‌న్యూస్ ప్రకటించింది. శిథిలాల్లో ఇంకా ఎంతమంది ఉన్నారో అని సహాయ బృందాలు తీవ్ర గాలింపు చేస్తున్నాయి. ఇరాన్ ప్రయోగించిన పలు క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ ప్రకటించింది. రెండు గంటల సేపు ఇరాన్‌పై చేసిన ఈ దాడుల్లో డజన్లకొద్దీ లక్ష్యాలను దెబ్బతీసి ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. "వారిపై ప్రతీకారం తీర్చుకుంటాం, వారిని ఇంకా గట్టి దెబ్బ కొట్టబోతున్నాం" అన్నారు. "బుధవారం తెల్లవారకముందే ఇరాన్ ఆకస్మికంగా జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై దాడులు చేసింది. ఇప్పుడు మా వంతు వచ్చింది, మేం ఊపిరిసలపనీయకుండా శక్తిమంతమైన ప్రతి దాడులు చేశాం'' అని ట్రంప్ చెప్పారు. అమెరికా బలగాపై ఇరాన్ ప్రయోగించిన అనేక బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. రాన్ సైనిక కమాండ్ కేంద్రాలు,డ్రోన్,క్షిపణి సౌకర్యాలు,తీర ప్రాంత నిఘా కేంద్రాలు,రక్షణ స్థావరాలు,సముద్ర దాడులకు ఉపయోగించే సొరంగాలు,ఐఆర్‌జిసి లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుకూల పిఎంఎఫ్ ఉగ్రవాద దళాలపై సౌదీ అరేబియాపై దాడి చేసినపుడు అక్కడ ఉన్న నలుగురు ఐఆర్‌జిసి సలహాదారులు కూడా హతులయ్యారని ఇరాన్ ధృవీకరించింది.అమెరికా–సౌదీ అరేబియా దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అనుకూల పిఎంఎఫ్ సైనికుల ప్రతిజ్ఞ చేశారు.ఎలాంటి విరామం లేకుండా జోర్డాన్ (హాషెమైట్ రాజ్యం)పై పదే పదే ఇరాన్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రాంత ప్రజల భద్రత,స్థిరత్వ సాధనకు గంభీరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్‌లో అమెరికాకు ఆశ్రయం ఇస్తున్న దేశాల్లో ఉన్న గగనతల స్థావరాలపై దాడులు చేసింది. ఈ ప్రయత్నంలో కువైట్‌లో ఉన్న చైనా కంపెనీ భవనం ధ్వంసం కావడంతోపాటు అందులో పనిచేస్తున్న ఒక కార్మికుడు మరణించాడు. కువైట్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి గురువారం ఈ విషయం చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటినుండి జోర్డాన్‌తోపాటు కువైట్ తదితర దేశాలన్నీ ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులకు లక్ష్యాలుగా మారాయి.

**విస్తరించిన యుద్ధం :** యుద్ధం హోర్ముజ్ జలసంధి నుండి ఎర్ర సముద్రం వరకు విస్తరించింది. యెమెన్‌లో హౌతీ తిరుగుబాటు సైన్యాలు ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా నౌకలపై దాడులు చేస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిలో అమెరికా దళాలు ఎలాంటి యుద్ధ వ్యూహాలు అమలు చేస్తున్నాయో, అదే వ్యూహాన్ని ఎర్ర సముద్రంలో తాము అమలు చేస్తామని హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఎర్ర సముద్రంలో నౌకల నుండి సుంకాలు వసూలు చేసేందుకు హౌతీలు ప్రణాళిక చేస్తున్నారు.మరోవైపు ఇరాక్ సైన్యంలో అంతర్భాగంగా ఉన్న 67 షియా తెగలతో కూడిన పిఎంఎఫ్ సైన్యాలు కూడా ఇరాన్ ఆదేశంతో సౌదీ అరేబియాపై డ్రోన్ దాడులు ప్రారంభించాయి. ఇదిలా ఉండగా ఇరాన్‌తోపాటు దానికి అనుబంధంగా యెమెన్,ఇరాక్‌ల నుండి యుద్ధం చేస్తున్న ఉగ్రవాద తిరుగుబాటు సైన్యాలకు సౌదీఅరేబియా రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఖండించారు. సల్మాన్ అమెరికా పర్యటన సందర్భంగా వైట్‌హౌస్‌లో బుధవారం జె.డి.వాన్స్‌తో సమావేశమయ్యారు. ఉత్తర ఇరాన్‌లో సెంట్‌కామ్–సౌదీ కూటమి దళాలు పిఎంఎఫ్‌పై ఉమ్మడి దాడిచేసిన తర్వాత వారి ప్రకటన వెలువడింది. ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గించి స్థిరత్వాన్ని కాపాడాలన్న సౌదీ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.ఉద్రిక్తతలను తాము కోరుకోవడంలేదని, అదే సమయంలో దాడులను తిప్పికొడతామని అన్నారు.

## పోరాటం విస్తరించినా చర్చలు జరుగుతున్నాయ్

### యుద్ధం ఆపేందుకు కృషి పాకిస్తాన్ ప్రకటన




**ఇస్లామాబాద్ :** అమెరికా–ఇరాన్ ప్రతినిధులను ఒక అవగాహన ఒప్పందానికి చేరువచేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు అధికారిక మధ్యవర్తిదేశం పాకిస్తాన్ ప్రకటించింది. యుద్ధం ఆపడమే తక్షణ లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని పాకిస్తాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ గురువారం పత్రికాగోష్ఠిలో చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తున్నప్పటికీ, విశ్వసనీయత లేకపోయినాగానీ మరోవైపు చర్చలు కొనసాగుతున్నాయని, ఒక అవగాహన ఒప్పందం తెచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. ఒప్పందం ప్రధాన సాంకేతిక చర్చలు ముందుకు తీసుకువెళ్ళేందుకు సంబంధిత నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందిగా ఇరుపక్షాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు."ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి,ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో దాడులు,ఉద్రిక్తతలు అధికమైనందున ఈ చర్చలు జరుగుతున్నాయి" అని చెప్పారు. "ఇరాన్‌పై తాజా దాడుల పరంపరను పూర్తిచేసినట్లు అమెరికా గురువారం ప్రకటించిన నేపథ్యంలోనే పాకిస్తాన్ నుండి కూడా ఈ ప్రకటన వచ్చింది. 13 రోజులపాటు అవిశ్రాంతంగా దాడులు జరిగిన తర్వాత నాలుగు రోజులు అమెరికా కొనసాగించి దాడులకు విరామం వచ్చింది. కానీ జులై 29వ తేదీ తెల్లవారకముందే జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ఆకస్మిక దాడులు చేయడంతో మళ్ళీ దాడులు మొదలయ్యాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఒక తాత్కాలిక ఎంఓయుపై జూన్ 17,18 తేదీలలో సంతకాలు జరిగిన తర్వాత యుద్ధ సమస్య పరిష్కారమైందని యావత్ ప్రపంచ దేశాలు సంతోషించాయి. హోర్ముజ్‌జలసంధి తిరిగి తెరుచుకుంటుందని, యథాతథంగా నౌకల రాకపోకలు కొనసాగుతాయని,స్తంభించిన వాణిజ్య కార్యకలాపాలు పుంజుకుంటాయని మార్కెట్లు కూడా ఎంతో విశ్వాసంతో ముందుకు అడుగువేశాయి. కానీ తర్వాత 15 రోజులకే పరిస్థితి తల్లకిందులైంది. హోర్ముజ్ జలసంధిలో సుంకాల వసూళ్ళు, జలమార్గాల విషయంలో తలెత్తిన వివాదం అతిపెద్ద సమస్యగా మారి యుద్ధం సమసిపోకపోగా కొత్త ప్రాంతాలకు విస్తరించింది. అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర క్షిపణి దాడులు ప్రవాహంలా కొనసాగుతూ ఉండటంతో చర్చలపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. సమస్య సత్వరం పరిష్కారానికి అవకాశాలు కనిపించడంలేదు. పాకిస్తాన్ పొరుగతో ఆ రెండు దేశాలమధ్య ఎంఓయు కుదిరిన తర్వాత మళ్ళీ ఘర్షణలు ప్రారంభమయ్యాయి.

# ఉక్రేన్ వ్యాప్తంగా రష్యా క్షిపణి–డ్రోన్ దాడులు

### ఎనిమిదిమంది మృతి

### అనేక ఇళ్ళు ధ్వంసం

### పోలెండ్ గగనతలంలోకి రష్యన్ క్షిపణి

**కీవ్:** ఉక్రేన్‌వ్యాప్తంగా రష్యా క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. గురువారం తెల్లవారకముందుగానే జరిగిన ఈ దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. అనేక డజన్లమంది గాయపడ్డారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారని అధికారులు చెప్పారు. దాదాపు రోజువారీ దాడులుగా మారిన ఈ యుద్ధంలో ఉక్రేన్ రష్యాలోని సుదూర ప్రాంతాలకు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ఆ దేశ మౌలిక సదుపాయాలకు నష్టం కలిగిస్తోంది. ఉక్రేన్‌లోని పది ప్రాంతాలపై రష్యా దాడులు చేసిందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. డజన్లకొద్దీ ఇళ్ళు,వ్యాపార కేంద్రాలు,మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. 70 క్షిపణులు, 280 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని, వీటిల్లో 28 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని, 260 డ్రోన్లను తమ సైన్యాలు కూల్చివేవాయని చెప్పారు. వైమానికస్థావరాలు,ఆయుధ కర్మాగారాలు,సైనిక టెలికమ్యూనికేషన్లు,లాజిస్టిక్ కేంద్రాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని చెప్పారు. బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో ఒక సాధారణవ్యక్తి ఇల్లు ముక్కలైపోయిందని చెప్పారు. ఇదిలా ఉండగా తమ గగనతలంలోకి రష్యా క్రూయిజ్ క్షిపణి ఎహెచ్–101ప్రవేశించిందని పోలెండ్ ఆరోపించింది. ఉక్రేన్ విదేశీమంత్రి సిహబీ ఈ సమాచారం తమకు చెప్పారని పోలెండ్ పేర్కొంది. రాడార్ స్క్రీన్‌పై ఒక గుర్తుతెలియని వస్తువు కనిపించిందని, వెంటనే అది రాడార్ స్క్రీన్ నుండి మాయమైపోయిందని, ఈ విషయంపై తమ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలతోపాటు దర్యాప్తు కూడా ప్రారంభించారని పోలెండ్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పోలెండ్ దేశం నాటో కూటమిలో సభ్యరాలుగా ఉంది. తమ గగనతలాన్ని రష్యా ఉల్లంఘిస్తోందని తరచు ఆ దేశం ఆరోపణలు చేస్తోంది. ఈ యుద్ధ దాడుల ప్రదేశాలకు పోలెండ్ గగతల సరిహద్దులు దగ్గరగా ఉన్నాయి.యుద్ధ దాడులకు దూరంగా పోలెండ్ సరిహద్దుల్లో ఉక్రేన్ తన ఆయుధాలను నిల్వచేసి ఉంచడంతో ఇటువైపు ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. నాలుగు సంవత్సరాలుగా ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం జరుగుతోంది. రష్యా క్షిపణి దాడులను అడ్డుకోవడానికి పేట్రియాటిక్ క్షిపణులు తయారు చేసుకోవడానికి అమెరికా నుండి అనుమతి పొందిన మరునాడే భారీస్థాయిలో ఉక్రేన్‌పై రష్యా దాడులు చేసింది.

# సత్తా చాటేందుకే ఈజిప్టు ఓడరేవుపై దాడి : ఇరాన్

**టెహ్రాన్:** ఇరాన్‌పై దాడులు ఉద్ధృతం చేస్తే, ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు,వాణిజ్యానికి మరిన్ని ఎక్కువ కష్టాలు వస్తాయని చెప్పడానికి వీలుగా తమ సత్తా ఏమిటో తెలియజేయడానికే ఈజిప్టులోని డమియెట్టా ఓడరేవుపై దాడిచేసినట్లు ఇరాన్ ప్రకటించింది. తమ ఓడరేవుపై బుధవారం జరిగిన పేలుడు,అగ్ని ప్రమాదం డ్రోన్ దాడివల్లనే జరిగిందని గురువారం ఈజిప్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ దాడి ఎవరుచేశారనే విషయంపై ఈజిప్టులో తొలుత అయోమయం ఏర్పడింది. ఈ పేలుడు కీలకమైన ఎన్‌ఎన్‌జి దిగుమతి కేంద్రంలో కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. దీనివల్ల ట్యాంకర్లు దెబ్బతిన్నాయి. ఇరాన్‌లో పరిస్థితులను దిగజార్చి సంక్లిష్టంగా మార్చాలనుకుంటే ప్రపంచ నౌకా రవాణాకు, ఇంధన సరఫరాలకు తీవ్ర అంతరాయాలు కలుగుతాయని చాటి చెప్పడం కోసమే ఈజిప్టు డమియెట్టా ఓడరేవుపై దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్‌టైమ్స్ పత్రిక వార్త ప్రచురించింది. ఈ దాడికి కారణాలపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని, ఈజిప్టు ప్రయోజనాలు,భద్రతా చర్యలపై దృష్టి పెట్టామని ఆ దేశం ప్రకటించింది.



## ఏం కావాలో చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు వెళ్తున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామన్నారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమనే విషయాన్ని ప్రభుత్వం ఈ మధ్య నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే'లో స్పష్టమైందన్నారు. ప్రస్తుతం వైట్ కాలర్ ఉదోగాలకు కాలం చెల్లిన నేపథ్యంలో జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో డిమాండ్ ఉన్న అవసరాలకు తగినట్టుగా నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ సంబంధాలు లేని దేశాలు అభివృద్ధి పథంలో పయనించబోవని, అందుకే విద్యార్థులకు మానవ సంబంధాల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు.

**విద్యార్థుల సమస్యలపైన తనతో కొట్లాడండి..**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు మాత్రం విద్యార్థుల సమస్యల విషయంలో తనతో కొట్లాడాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు దీక్షబూనాలన్నారు. ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని, సమాజం కోసం, తరతరాల భవిష్యత్‌ను మార్చేందుకు అయిదేళ్ల పాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**నెహ్రూ,ఇందిరాగాంధీని ఆరోపిస్తున్నారు..**

విద్యా, నీటిపారుదల రంగాలను ప్రాధాన్యాత అంశాలుగా ఎంచుకుని,దేశాన్ని సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నాటి ప్రధాని నెహ్రూపైనా, పాకిస్తాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరిబీ హటావో నినాదంతో పని చేసిన నాటి ప్రధాని ఇందిరా గాంధీపైన కొందరు ఆరోపణలు చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 సంవత్సరం వరకు ఈ 12 ఏళ్ల కాలంలోనే ప్రధాని నరేంద్ర మోదీ రూ.151లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరంప్రాజెక్టు కూళేశ్వరమైందని ఆరోపించారు.

**ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తాం..**

ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల తరహా ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్య కోసం విదేశాలకు పంపిస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వారు అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడి విద్యార్థులకు పంచాలని సూచించారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి తొలుత ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను సిఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సిఎం ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్ఆర్‌డి డైరెక్టర్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రం అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, సిద్ధిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆగస్టు 1 నుంచి 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయని, అన్ని జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. రాజధాని హైదరాబాద్‌లో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో భారీ మోటార్లు ఏర్పాటు చేసి నీటి నిల్వలను తొలగిస్తున్నారు. ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం, బయోడైవర్సిటీ జంక్షన్, ఐకియా జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది.

**కొన్ని జిల్లాల్లో ఇంకా వర్షపాతం లోటే**

ఒకవైపు భారీ వర్షాల హెచ్చరికలు జారీ అవుతుండగా, మరోవైపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వర్షపాతం లోటు కొనసాగుతోంది. సూర్యాపేటలో 74 శాతం, నల్లగొండలో 70 శాతం, ఖమ్మంలో 63 శాతం లోటు నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## ప్రాజెక్టులకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

చేరుతోంది. 9,250 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,065.7 అడుగులకు చేరింది. మరోవైపు నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 3,935 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,395.8 అడుగులకు చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.80 టిఎంసిలకు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.46 టిఎంసిలుగా ఉంది. కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత ఉభయ నదుల ఉద్ధృతి పెరుగుతోంది. సాధారణ పుష్కర ఘాట్, సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద జలకళ సంతరించుకుంది. పుష్కర ఘాట్ మెట్ల వద్ద నీటి మట్టం 6.3850 మీటర్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతుంది. మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో ప్రవాహం కొనసాగుతోంది.

మేడిగడ్డ బ్యారేజీకి ఎగువ నుంచి 1.1 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా 85 గేట్లు గత మూడేళ్లుగా తెరిచే ఉండటంతో నీరు దిగువకు వెళ్లిపోతుంది. సంగారెడ్డి జిల్లా సింగూరు జలాశయానికి ఇన్‌ఫ్లో 517 క్యూసెక్కులు వరద చేరుతుంది. అవుట్‌ఫ్లోగా 470 క్యూసెక్కుల నీటిని అధికారులు వదులుతున్నారు. సింగూరు జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 29.91 టిఎంసిలు కాగా ప్రస్తుతం 4.24 టీఎంసీలు ఉంది. పెరుగుతోంది. ములుగు జిల్లా టేకులగూడెం వద్ద జాతీయ రహదారి163పైకి గోదావరి వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పూసూరు గోదావరి వంతెన వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తుండగా, పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి 14 మీటర్లకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి నది ఉరకలేస్తోంది. గత నాలుగురోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నదిలోకి కొత్తనీరు వచ్చి చేరడంతో ప్రస్తుతం భద్రాచలం వద్ద 28.5 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. ప్రస్తుతం అతి నెమ్మదిగా పెరుగుతున్నప్పటికీ శుక్రవారం ఉదయం నుండి వేగంగా పెరిగే అవకాశం ఉన్నట్లు కేంద్ర జలనవరుల సంఘం అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పడుతున్న వర్షాలకు తెలంగాణలోని చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో తాలిపేరు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యానికి చేరుకోవడంతో 22 ప్రాజెక్టు గేట్లు ఎత్తి 90వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో గోదావరికి మరింత వరద తాకిడి పెరుగుతోంది. ఇంద్రావతి, ప్రాణహిత ఉపనదులు వర్షాల కారణంగా పెద్దఎత్తున ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తెలంగాణాల్లో భారీ వర్షా సూచన ఉండటంతో గోదావరినదికి మరింత వరద పెరగనుంది.

**జూరాల గేట్లు ఎత్తివేత :**

భారీ వర్షాలకు జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 90,000 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 39,080 క్యూసెక్కులు, జలవిద్యుత్ ద్వారా 38,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి 77,352 క్యూసెక్కుల నీరు వెళుతోంది. జూరాలకు వరద ప్రవాహం పెరిగితే అధికారులు మరిన్ని గేట్లు ఎత్తనున్నారు

## దేశవ్యాప్తంగా కార్మికులు, రైతుల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అనేక రైతు సంఘాలు,వివిధ రంగాలకు చెందిన సమాఖ్యలు, సంస్థలు జులై 29న న్యూఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన జా తీయ సదస్సులో ఈ మేరకు ఒక తీర్మానం చేశా యి. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక–కర్షక, విద్యార్థి,యువజన విధానాలకు వ్యతిరేకం గా దేశవ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేయాలని సదస్సు పిలుపు ఇచ్చింది. జీవనోపాధి,రాజ్యాంగ హక్కుల సాధన, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకోసం కార్మికులు, రైతులు, విద్యార్థులు,యువకులతో పాటు సమాజంలోని అన్ని ప్రజాస్వామ్య వర్గాల ఐక్యతను బలోపేతం చేయాలని సదస్సు పిలుపు ఇచ్చింది. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఉమ్మడి రాష్ట్రస్థాయి సమావేశాలు, వికేంద్రీకృత మహాపడావ్‌లు (బ్రహ్మాండమైన స మావేశాలు)నిర్వహించాలని, తదుపరి జాతీయస్థాయిలో ప్రత్యక్ష కార్యాచరణలకు సిద్ధపడాలని కోరింది. పునాదిస్థాయిలో ప్రతిచోటా సామూహి క గ్రామ సభలు,కిసాన్ పంచాయత్‌లు నిర్వహిం చి రైతులను సమీకరించాలని, దాంతోపాటే జిల్లాస్థాయిలో ర్యాలీలు,రాష్ట్రాలస్థాయిలో ధర్నాలు నిర్వహించి ప్రభుత్వం కొనసాగిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక ఎజెండాను ప్రజల దృష్టికి తీసుకురావాలని తద్వారా కార్మికులు–రైతుల ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని తీర్మానించింది. తదుపరి దశలో రైతుల నుండి రుణాలు వసూలు చేసేందుకు దోపిడీ చర్యలకు పాల్పడే ఆర్థికసంస్థలకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని చే పడతామని,రైతులకు ప్రభుత్వం ఈ విషయంలో లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకు నిరసనలు కొనసాగుతాయని, ఐనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోతే భారత్ బంద్ కార్యక్రమాన్ని కూడా రైతులు–కార్మికులు చేపడతారని జాతీయ సదస్సు తీర్మానించింది. భారత్ బంద్ తర్వాత కూడా ప్రభుత్వం రైతుల పాలిట దోపిడీదారులుగా మారిన ఆర్థిక సంస్థలను, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించే కార్యక్రమాలు అనివార్యంగా నిరంతరం కొనసాగుతాయని కూడా జాతీయ సదస్సు హెచ్చరిక చేసింది. కార్మికుల, రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి,ప్రజాస్వామ్య ఉద్యమాలకు సంఘీభావం విస్తరించడానికి,సమానత్వం,న్యాయం,లౌకికతత్వం, సామాజిక ప్రగతి ఆధారంగా సామాజిక పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళడానికి సదస్సు ప్రతిన పూనింది. కార్మికులు, రైతులు తమ తమ సంఘాలు, సంఘటనల తరపున పోరాటాలు చేయడమే కాకుండా, కార్మికులు,రైతులు,అన్ని ప్రజాస్వామ్యశక్తులతో కూడిన విస్తారమైన ఐక్య ఉద్యమం మాత్రమే దేశ రాజ్యాంగాన్ని, ప్రజల జీవనోపాధిని సమర్థవంతంగా కాపాడగలదని, ఈ ఉద్యమం మాత్రమే భారతదేశ లౌకిక,ప్రజాస్వామ్య మౌలిక స్వరూప స్వభావాలను పరిరక్షించగలవని సదస్సు ఉద్ఘాటించింది.ఈ సదస్సులో ప్రసంగించిన కార్మిక,కర్షక నాయకులు అందరూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఏకగ్రీవంగా ప్రతిఘటించారు. తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం,అసాధారణస్థాయిలో ధరల పెరుగుదల, ప్రభుత్వరంగ సంస్థలు,ప్రజాసేవల ప్రైవేటీకరణ,అనుకూలంగా మలచుకున్న కార్మిక చట్టాలను అడ్డం పెట్టుకుని కార్మికవర్గంపై దాడి, రైతుల డిమాండ్లను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, రైతులు, కార్మికులకు వ్యతిరేకమైన ఒప్పందాలు విదేశాలతో చేసుకోవడం, రోజురోజుకూ సన్నగిల్లిపోతున్న ప్రజాస్వామ్యస్వేచ్ఛ, కుల, మత, వర్గాల ప్రాతిపదికపై ప్రజలను విభజించే ప్రయత్నాలు తీవ్రస్థాయిలో పెరిగిపోవడం వంటి అనేక ప్రధానమైన అంశాలను సదస్సులో ప్రసంగించిన నాయకులు ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారాలకు పోరాటాలను రాబోయేకాలంలో మరింత ఐక్యంగా ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపు ఇచ్చారు.

**డిమాండ్ల పరిష్కారానికి సదస్సు ఏకగ్రీవ తీర్మానం :**

దేశంలో కార్మికులు,రైతులు,విద్యార్థులు,సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సదస్సు తీర్మానం చేసింది. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, కార్మిక సంఘాల హక్కులకు పూర్తి భరోసా ఇవ్వాలని, కార్మిక రక్షణలన్నింటినీ పునరుద్ధరించాలని, కరువు భత్యాన్ని జతకలిపిన రూ.42,000 చట్టబద్ధమైన కనీస నెల వేతనాన్ని నిర్ధారించాలని, సి2+50 వద్ద కనీస మద్దతు ధర ఇవ్వాలని, అదేవిధంగా రైతు ఉత్పత్తుల సేకరణకు పూర్తి భరోసా ఇవ్వాలని కోరుతూ, కార్మిక వ్యతిరేక,రైతు వ్యతిరేక విదేశీ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ పది జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఛత్రఛాయలో దేశవ్యాప్తంగా ఉన్న అనేక రైతు సంఘాలు, రంగావారీ సమాఖ్యలు, సంస్థల ఉమ్మడి సదస్సు తీర్మానం చేసింది. ప్రైవేటీకరణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు దృఢనిశ్చయంతో ఉన్న జాతీయ ద్రవ్య విధానం 2.0ను నిలిపివేయాలని,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, సామాజిక భద్రతను విస్తరించాలని,ఉద్యోగితను సృష్టించాలని,ప్రభుత్వ విద్యావ్యవస్థను, ఆరోగ్య భద్రతను పటిష్టం చేసేందుకు వ్యవస్థీకృత చర్యలు తీసుకోవాలని, జాతీయ ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను సంరక్షించాలని,కఠిన చట్టాలన్నింటినీ ఉపసంహరించుకోవాలని,రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని కోరుతూ చేసిన సమగ్ర ప్రకటనను ఈ జాతీయ సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. పారిశ్రామిక కార్మికులు,ప్రభుత్వరంగ ఉద్యోగులు,రవాణా కార్మికులు,బ్యాంకు,బీమా రంగ ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పీస్‌రేట్ కార్మికులు,గిగ్,ప్లాట్‌ఫామ్ కార్మికులు సహా అన్ని రంగాలకు చెందిన అసంఘటిత కార్మిక ప్రతినిధులు,మహిళాకార్మికులు,పెన్షనర్లు, వివిధ వర్గాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన కాక్రోచ్ జనతాపార్టీ నాయకత్వాన విద్యార్థులు, యువకుల ఉద్యమం తర్వాత కొద్దిరోజులకే జరిగిన ఈ జాతీయ సదస్సు ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. కేవలం విద్యార్థులతో మాత్రమే కాకుండా లౌకిక శక్తులతో కూడిన చాలా విస్తారమైన కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎక్కువమంది వక్తలు ఆకాంక్షించారు.

**సార్వత్రిక సమ్మెలు చేసినా కార్మికుల అణచివేత ఆగలేదు**

గడచిన ఆరు సంవత్సరాలలో దేశంలో ఆరు సార్వత్రిక సమ్మెలు జరిగినప్పటికీ మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం కార్మిక అణచివేత చర్యలు మానుకోలేదని, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలులోకి తీసుకువచ్చిందని జాతీయ సదస్సు ఆమోదించిన తీర్మానం పేర్కొంది. కార్మికవర్గాన్ని బలహీనపరచి వారిని అణచివేయాలని కేంద్రం నిర్ణయించుకుందని విమర్శించింది. కార్మిక సంఘాలు అధికారికంగా గుర్తింపు పొందడం సంక్లిష్టంగా మారిందని, కార్మిక సంఘాలకు గుర్తింపులను తొలగిస్తున్నారని, తద్వారా యాజమాన్యాలు ఉల్లంఘన చర్యలకు చట్టబద్ధత లభించిందని తీర్మానం పేర్కొంది. దేశం చాలా లోతైన ఆర్థిక,రాజకీయ,సామాజిక, సాంస్కృతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్లిష్ట తరుణంలో కార్మిక–కర్షక ప్రధాన ఉత్పాదక శక్తులమధ్య పెరుగుతున్న ఐక్యత ఎంతో ముఖ్యమైనది. కేంద్ర ప్రభుత్వం జాతీయ,విదేశీ బడా పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించే చర్యలను మానకుండా కొనసాగిస్తూనే ఉంది, మరోవైపు దేశంలో సాధారణ ప్రజలు,ముఖ్యంగా పేదలు,బలహీనవర్గాలలో అసమానతలు మరింతగా పెరిగిపోయాయి అని తీర్మాన పేర్కొంది.

# 10 వేల మీటర్ల రన్‌లో పతకం నెగ్గిన భారత అథ్లెట్

### గుల్వీర్‌కు రజతం
### లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్



ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో రెండు రజతాలు లభించాయి. భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్, లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ వెండి పతకాలు అందుకున్నారు. ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత అయిన గుల్వీర్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో రజతం గెలిచి ఈ ఘనత సాధించిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డులకెక్కాడు.



**సెమీస్‌కు అనిమే...** పురుషుల 200 మీటర్ల స్ప్రింట్‌లో నేషనల్ రికార్డ్ హోల్డర్ అనిమేశ్ కుజుర్ సెమీఫైనల్ చేరుకున్నాడు. బుధవారం జరిగిన హీట్4లో 23 ఏండ్ల కుజుర్ 20.46 సెకండ్లతో అగ్రస్థానం, ఓవరాల్గా ఏడో స్థానం సాధించి సెమీస్ బెర్తు అందుకున్నాడు.

**పంచ్ అదిరింది...** మెగా ఈవెంట్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బుధవారం బరిలోకి దిగిన ఆరుగురు బాక్సర్లు క్వార్టర్ ఫైనల్లో గెలిచి సెమీస్ చేరడంతో భారత్‌కు మరో ఐదు పతకాలు ఖాయమయ్యాయి. సాక్షి, సచిన్ సివాచ్, అంకుశ్ యాదవ్, అరుంధతి చౌదరి, నరేందర్ కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. 51 కేజీ క్వార్టర్స్ పోరులో సాక్షి 50తో నార్తర్న్ ఐర్లాండ్కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్స్ను చిత్తు చేయగా.. అరుంధతి (70కేజీ) 31తో హెండర్సన్ (న్యూజిలాండ్)పై, జైస్మిన్ లంబోరియా 41తో ఎలీస్ గ్లిన్ (ఇంగ్లండ్)పై కష్టపడి గెలిచారు. మెన్స్ 60 కేజీ బౌట్లో మాజీ వరల్డ్ యూత్ చాంప్ సచిన్ 50తో మొరెమి (బోస్తానా)పై ఏకపక్ష విజయం సాధించగా.. 80 కేజీ బౌట్లో అంకుశ్ కూడా 50తో జేడ్ మికాక్ (సేచెల్స్)ను చిత్తుగా ఓడించాడు. ఇక హోరాహోరీగా సాగిన 90+కేజీ క్వార్టర్స్లో నరేందర్ 32తో సెకో (సమోవా)పై చెమటోడ్చి విజయం సాధించాడు.

**తుదిపోరుకు తజిందర్, సమర్దీప్...** భారత స్టార్ షాట్ పుటర్ తజిందర్ సింగ్ తూర్, సమర్దీప్ సింగ్ ఫైనల్ రౌండ్‌కు క్వాలిఫై అయ్యారు. గోల్ మెడల్



ఫేవరెట్ అయిన తజిందర్ క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్ఎలో గుండును 20.14 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు, షాట్పుట్లో 20 మీటర్ల మార్కును దాటిన వారితో పాటు ఓవరాల్గా టాప్12లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్ లభిస్తుంది.

# హాకీ ప్లేయర్లకు కాషాయం జెర్సీ..

### కలర్ మార్పును సమర్థించుకున్న హాకీ ఇండియా



హాకీ వరల్డ్ కప్ కోసం భారత జట్టు కొత్త జెర్సీలో దర్శనమివ్వనున్నది. నెదర్లాండ్స్, బెల్జియం దేశాల్లో జరగనున్న వరల్డ్‌కప్‌లో.. టీమిండియా ప్లేయర్లు కాషాయం రంగు జెర్సీల్లో ఆడనున్నారు. గతంలో ఉన్న బ్లూ కలర్ జెర్సీలను మార్చేశారు. దీనిపై గురువారం హాకీ ఇండియా ఓ ప్రకటన విడుదల చేసింది. సంప్రదాయ బ్లూ కిట్స్ స్థానంలో.. కాషాయ కిట్స్‌తో భారత మహిళల, పురుషుల హాకీ ప్లేయర్లు కనిపించనున్నట్లు హాకీ ఇండియా పేర్కొన్నది. వచ్చే నెల 15వ తేదీ నుంచి హాకీ వరల్డ్ కప్ టోర్నీ జరగనున్న విషయం తెలిసిందే. జెర్సీ రంగు మార్పు గురించి మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ప్రశ్నించారు. అయితే సాంకేతిక అవసరాల దృష్ట్యా జెర్సీ కలర్‌ను మార్చినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది. బ్లూ రంగు సింథటిక్ పిచ్లపై విజిబులిటీ పెంచేందుకు జెర్సీ రంగును కాషాయానికి మార్చినట్లు హాకీఇండియా చెప్పింది. ఇటీవల సోషల్ మీడియాలో హాకీ ఇండియా కొత్త జెర్సీలపై ఓ పోస్టు కూడా పెట్టింది. జెర్సీ కలర్, డిజైన్ వెనుక కథ ఉన్నట్లు పేర్కొన్నది. కొత్త జెర్సీలు భారతదేశ గర్వానికి సంకేతమని చెప్పింది. ప్లేయర్లు, సపోర్ట్ స్టాఫ్తో సంప్రదించిన తర్వాత ఆ రంగును మార్చినట్లు హాకీ ఇండియా వెల్లడించింది. కాషాయం రంగు.. ధైర్యానికి, త్యాగానికి, విజయానికి సంకేతంగా నిలుస్తుందని తన ప్రకటనలో హాకీ ఇండియా తెలిపింది. కాషాయంతో పాటు కొత్త డిజైన్‌తో కూడిన వైట్ కలర్ జెర్సీలు కూడా ప్లేయర్ల వద్ద ఉండనున్నాయి.



# అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే వీడ్కోలు

టీమిండియా సీనియర్ క్రికెటర్ అజింక్య రహానే(38) గురువారం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పారు. ముంబై దేశవాళీ క్రికెట్ నుంచి భారతదేశపు గొప్ప టెస్ట్ విజయాల వరకు తనను తీసుకువెళ్లిన క్రికెట్కు అజింక్య అన్నీ ఫార్మాట్ల క్రికెట్‌కు భారమైన హృదయంతో తప్పుకున్నాడు. రహానే సోషల్ మీడియా వీడియో ద్వారా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. భారత దేశం తరపున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడిన రహానే తన కెరీర్ని ముగించడానికి ఇదే సరైన సమయం అని తెలిపాడు. కాగా, విదేశీ గడ్డపై క్లిష్ట పరిస్థితితుల్లో అతడు ఆడిన ఇన్నింగ్స్ టీమిండియాకు ఎన్నో చిరస్మరణీయమై విజయాలన్నందించాయి. తన కు సహకరించిన ప్రతి ఒక్కరికి రహానే కృత కృతజ్ఞతలు తెలిపాడు.

## పోటీ కోసం జికె
(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# భారతదేశంలో అతి పొడవైన కాలువ?

- 1993లో మహారాష్ట్రలో ఎక్కడ భూకంపం సంభవించింది :
  లాటూర్
- రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు మనదేశంలో ఓటు హక్కు పొందడానికి కనీస వయసు ఎంత?
  21 సంవత్సరాలు
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టుని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
  1948
- కమ్యూనల్ అవార్డును ప్రకటించిన బ్రిటిష్ ప్రధాని ఎవరు?
  మెక్ డొనాల్డ్
- భారత జాతీయ సైన్యాన్ని ఏర్పరచినది?
  సుభాష్ చంద్రబోస్
- మనదేశంలో శివాలిక్ కొండలను అసోంలో ఏ పేరుతో పిలుస్తారు?
  మిష్మికొండలు
- బుధ గ్రహానికి గల ఉపగ్రహాలు
  0
- ఎరుపు + ఆకుపచ్చ నీలం రంగులను కలిపితే దాదాపుగా వచ్చేరంగు
  తెలుపు
- స్వర్ణముఖి బ్యారేజ్ ఏ జిల్లాలో కలదు
  నెల్లూరు
- గాంధీ–ఇర్విన్ ఒప్పందంలో భాగంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని నిలిపివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి
  సుభాష్ చంద్రబోస్
- చెరువుల ద్వారా నీటి పారుదలను అత్యధికంగా ఏ ప్రాంతంలో చూడొచ్చు?
  తమిళనాడు
- సర్ స్టాఫర్డ్ క్రిప్సు రాయబారం?
  1942
- మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ నాయకుడు ఎవరు?
  తేజ్ బహదూర్ సప్రూ
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ శాంతి కోసం ఏర్పాటైన సంస్థ ఏది?
  ఐక్యరాజ్య సమితి
- పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన పథకం
  మెప్మా (MEPMA)
- కాంగో ప్రాంతాన్ని కనుగొన్నది
  కామెరూన్
- మన దేశమునకు ఎక్కువగా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించుచున్న ఖనిజం:
  అభ్రకం
- ఖుదై ఖిద్మత్ గార్స్ ' దళాన్ని ఏర్పాటు చేసింది ఎవరు?
  ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
- తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  జులై 11
- ఈశాన్య రాష్ట్రాల్లో శాసనోల్లంఘన ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
  రాణి గైడిన్ ల్యూ
- రౌండ్ టేబుల్ సమావేశాలు ఎక్కడ జరిగాయి?
  లండన్
- ఇప్ప చెట్ల పూల నుండి......తయారుచేస్తారు.
  ఇప్పసారా
- నీటిలో ముంచిన కర్ర వంగి కనిపిస్తుంది. కారణం
  వక్రీభవనం
- వేసవిలో గట్టిగాను, శీతాకాలంలో జిగటగాను ఉండే మృత్తికలు
  నల్లరేగడి మృత్తికలు



- నీటి ఉపయోగిత వంద శాతం ఉన్న నీటిపారుదల పద్ధతి ఏది?
  బిందు సేద్యం
- 1935వ చట్టములోని ముఖ్యాంశం?
  భారత సమాఖ్య ఏర్పడుట
- సముద్రంలో సోడియమ్ క్లోరైడ్ కాక ఎక్కువగా వుండే ఇతర లవణాలు
  పైవన్నియూ
- రాజస్థాన్ రాజధాని
  జైపూర్
- కోల్కతా రేవు ఎగుమతులలో ఒకటి
  తేయాకు
- ప్రపంచ కాన్సర్ రోజు
  ఫిబ్రవరి 4
- తమిళనాడులో ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించింది ఎవరు?
  సి. రాజగోపాలాచారి
- 1. అత్యంత పొడవైన రైలు కమ్ రోడ్ బ్రిడ్జి ఏ ప్రాంతాల మధ్య ఉంది?
  రాజమండ్రి–కొవ్వూరు
- భారతదేశంలో అతి పొడవైన కాలువ ఏది?
  ఇందిరా గాంధీ కాలువ
- గాంధీజీ దండి యాత్రను ఏ రోజున ప్రారంభించారు?
  1930 మార్చి 12
- చైనా టిబెట్ పై దాడి చేసినది
  1950
- హఠాత్తు వరదలు, వర్షాలకు భూమి పైపొర పొరలు పొరలుగా కొట్టుకొనిపోవుట
  పట క్రమక్షయం
- ఆల్పైన్ ఉద్భిజ్జాలు ఇచట పెరుగుతాయి
  ఎత్తు ఎక్కువగా ఉన్న హిమాలయాలలో
- ప్రపంచ జనాభా దినోత్సవం?
  జులై 11
- 1929లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?
  జవహర్ లాల్ నెహ్రూ
- భారతదేశంతో అత్యంత ఎక్కువ భూభాగం సరిహద్దుగా ఉన్న దేశం ఏది?
  బంగ్లాదేశ్
- ఉప్పు సత్యాగ్రహం?
  1930
- ఆఖరి మొగలాయి చక్రవర్తి
  రెండవ బహదూర్ షా
- కామన్వెల్తులో సభ్యత్వంగల దేశాల సంఖ్య?
  53
- తెలివితేటలకు మూలస్థానము
  మస్తిష్కము

### మోదీ ప్రభుత్వానికి కార్మికులు శత్రువులు

# కార్పొరేట్ శక్తులు మిత్రులా?

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్
### పెబ్బేర్‌లో ఘనంగా ఎఐటియుసి వనపర్తి జిల్లా నాలుగవ మహాసభలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు శత్రువులుగా, కార్మికులు శ్రమను దోచి సంపదను లూటీ చేసే కార్పొరేట్ శక్తులు మిత్రులుగా మారారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ధ్వజమెత్తారు. ఎఐటియుసి వనపర్తి జిల్లా నాలుగో మహాసభలు పెబ్బేరు మండల కేంద్రంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెబ్బేరు మార్కెట్ యార్డ్ నుండి సయిరాం ఫంక్షన్ హాల్ వరకు వందలాదిమంది కార్మికులతో పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. మహాసభల ప్రారంభంగా ఎఐటియుసి జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్ ఆవిష్కరించి మాట్లాడుతూ పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా కార్మికులు సంక్షేమానికి సమాధి కట్టే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు కేవలం కార్పొరేట్ శక్తులు, దోపిడి యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బిజెపి విధానాలను నిరసిస్తున్నామని బయటకు చెబుతున్న అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రాష్ట్రంలో దశలవారీగా అమలు చేసేందుకు కుట్రలు చేసిందని అందులో భాగంగానే ఇండ్రస్టియల్ పాలసీలో 12 గంటల పని విధానం తప్పుడు జిఒను రేవంత్‌రెడ్డి సర్కార్ దొడ్డిదారిన తీసుకొచ్చిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మోష, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోపాలకృష్ణ, నాయకులు గాంధీ, పెద్ద మొగులయ్య, రాములు, శ్యాంసుందర్, భాస్కర్, భారత్, రమేష్, చిన్న కురమయ్య, పి.కళావతమ్మ, కృష్ణవేణి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి,పి.సురేష్, రవీందర్, శ్రీను, నరసింహ, నరేంద్, అంజి, ఇజ్రాయిల్, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

### మోదీ పాలన తీరుతో

# దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/బోనకల్ :** మోదీ పాలన తీరుతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, ఈ పరిణామం దేశ భవిష్యత్‌పై తీవ్ర పరిణామం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. కార్పోరేట్ శక్తులు, దేశ సంపదను తమ గుప్పిట పడుతున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ ఖమ్మం జిల్లా మధిర, బోనకల్, చింతకాని మండలాల శిక్షణా తరగతులు గురువారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగాయి. ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు. బత్తినేని నీరజ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ మోదీ పాలన ప్రజలను విస్మరించి సాగుతుందని, ప్రైవేట్ రంగం విరాజిల్లుతుందని, ప్రధానంగావ్యవసాయ రంగం, సంక్షోభంలో కూరుకుపోతుందని, నిరుద్యోగం పెరిగి, అల్పాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరిగి ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోను పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని, హామీలు అమలు కాక ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సంసిద్ధులను చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ''దేశ వ్యాప్తంగా బద్లావ్ జరూరీ''(మార్పు అవసరం) పేరుతో విస్తృత రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లావ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబరు 1న ''ఛలో ఢిల్లీ'' మహా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ప్రచారం అంశంపై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, భారత జాతీయ ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్రపై జమ్ముల జితేందర్‌రెడ్డి కులం, మతం, వర్గ పోరాటం అనే అంశాన్ని సింగు నరసింహారావు ప్రపంచీకరణ, దాని ప్రభావంపై ఏనుగు వెంకటేశ్వరరావు భోదించారు. శిక్షణ తరగతులలో కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, బెజవాడ రవి బాబు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్ రావు, ఎంఎ రహీం, యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, తూము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర యువజన విధానం అమలు చేయాలి : గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పనిహక్కును ప్రాథమికహక్కుగా గుర్తించి, సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని, విద్య, వైద్య రంగాల వ్యాపారీకరణను అరికట్టాలని, అవినీతికి వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులుడు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. గురువారం యాదగిరి గుట్ట వేదికగా సెప్టెంబర్ 8,9,10 తేదీలలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభ, బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. సెప్టెంబర్ 8న విద్యా, వైద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే యువజన ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాఘవపురం వినయ్, కంబాల వెంకటేష్, పేరబోయిన పెంటయ్య, బంగారు, గోపగాని రాజు, మాటూరు మల్లయ్య, గుండు వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య, అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, పేరబోయిన సత్యనారాయణ, రావుల శ్రీను, ఒంటెద్దు సంజీవ, శెట్టి నరసింహ, కంబాల సత్యం, సంఘీ అరవింద్, రాజేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తున్న కేంద్రం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్ లుగా విభజించి కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాల రక్షణకు కార్మికలోకం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6నుంచి వరకు కరీంనగర్‌లో జరగనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభల విజయవంతం కోసం కరీంనగర్‌లోని రైల్వేస్టేషన్ వద్ద గల కార్మికుల విశ్రాంతి కార్యాలయం ఆవరణలో గురువారం హమాలీ కార్మికుల సమావేశం ఎఐటియుసి అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కార్మికులకు అండగా ఎఐటియుసి అనేక పోరాటాలు చేసిందన్నారు. కార్మిక ఉద్యమాలకు నిలయమైన కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్మికుడిపై ఉందని, అందుకు మహాసభలకు కార్మికులు అండగా ఉండాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పోరాటాలు అండగా ఉంటాయని వెంకట్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్ ఉపాధ్యక్షులు, నాయకులు జంగ శంకర్, రఘుపతి, నగేష్ , హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రం పాలన ఎండగట్టేందుకు పాదయాత్రలు




### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు విధానాలను ఎండగట్టేందుకు ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం టి. నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి బాల్‌నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్‌నరసింహ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ప్రజా సమస్యలపై ఆగస్టు 6 నుండి 14వరకు కొల్లాపూర్ నియోజకవర్గం అంతా పాదయాత్రలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను, యువతను ఉచిత హామీలు సంక్షేమ పథకాల పేరుతో ఏ విధంగా మోసం చేస్తున్నాయో ప్రజలకు వివరిస్తూ గ్రామాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసే విధంగా ఈ పాదయాత్రల కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తుమ్మల శివుడు, బండి లక్ష్మీపతి, బిజ్జ శ్రీనివాసులు, కురుమయ్య, తన్నీరు మల్లయ్య, స్వామి, లక్ష్మినారాయణ, సాయిలు, వెంకటస్వామి, రాధాకృష్ణ, రామకృష్ణ, లక్ష్మణస్వామి, బండి కృష్ణయ్య, పటేల్ రాముడు, మాషన్న, ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, గలెన్న పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య బంగారు భవిష్యత్తు ముఖ్యం

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : విద్యార్థులకు నాణ్యమైన విద్య బంగారు భవిష్యత్తు ముఖ్యమని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం పోచంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను పరిశీలించేందుకు ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగు నీటి సౌకర్యం, వంటగది నిర్వహణను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు త్వరగా అందించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి అధికారులు ఆయన వెంట ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



**ప్రజాపక్షం/మునుగోడు:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం మునుగోడులో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉకొండి గ్రామానికి చెందిన జాల అంజమ్మ పేరుపై ఉన్న భూమిని ఆమె తన కుమార్తె పద్మ పేరుపై పట్టా చేయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే అంజమ్మ పెద్ద కుమారుడు మల్లేష్ భార్య భాగ్యలక్ష్మి అందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీ పెట్టుకుంది.ఈక్రమంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చిన భాగ్యలక్ష్మి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది.దీనిని గమనించిన కార్యాలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆమెను అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా,పోలీసులు 108 అంబులెన్స్‌ను రప్పించి భాగ్యలక్ష్మిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## బ్యాంకును తిరుగులేని ఆర్థిక శక్తిగా మారుస్తాం

పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మార్కెట్ సవాళ్లను ఎదుర్కొని పోచంపల్లి బ్యాంకును తిరుగులేని ఆర్థిక శక్తిగా మారుస్తామని ఆ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన 53వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సమీకరించిన వాటా దినం రూ.16.89కోట్లు, డిపాజిట్లు రూ.327.26 కోట్లు మంజూరు చేసిన రుణాలు రూ.247.40 కోట్లు,జూన్ చివరి నాటికి సమీకరించిన వాటా దినం రూ.19.33కోట్లు డిపాజిట్లు రూ.358.17కోట్లు, మంజూరు చేసిన రుణాలు రూ.272.79 కోట్లు అని వివరాలు వెల్లడించారు. అత్యంత విశ్వసనీయతతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ బ్యాంక్ దినదిన అభివృద్ధి చెందుతూ కార్పొరేట్ ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్ స్పష్టం చేశారు.2526 సంవత్సరంలో 42 శాతం వృద్ధి సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 16% డివిడెంట్ చెల్లించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ, నూతలపాటి కృష్ణ, కిషోర్, అనంత రాములు, కొల్లి రామ్ గోపాల్ రావు, సీత సత్యనారాయణ, భోగ సిద్ధిరాములు, కొండ శంకరయ్య పాల్గొన్నారు.

## గిరిజన సంప్రదాయ, సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం తీజ్ పండుగ

తీజ్ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : గిరిజన సాంప్రదాయానికి సంస్కృతి ఉట్టిపడేలా గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నవధాన్యాలను పూజలు చేయడమే తీజ్ ముఖ్య ఉద్దేశమని గిరిజన సంప్రదాయ సంస్కృతి నిలువెత్తు నిదర్శనం తీజ్ పండుగ అని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండలంలోని బోయినిపల్లి తండాలో అంగరంగ వైభవంగా జరిగిన తీజ్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు అనంతరం గిరిజనులతో కలిసి గిరిజన నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్, పైలెట్ సింగల్ విండో చైర్మన్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుసత్యనారాయణ, సర్పంచ్ భూక్య రజిత రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# లిఫ్టుల రక్షణ రైతు బాధ్యత

దొంగతనాలకు చెక్ పెడదాం

సూర్యాపేట జిల్లా పోలీస్‌ల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వ్యవసాయానికి ప్రాణదారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ భద్రతతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల దొంగతనాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా పోలీస్ యంత్రాంగం ముందడుగు వేసింది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ అధికారులతో కలిసి హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.

**రైతు కమిటీలు వేసి పర్యవేక్షించాలి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్**

కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, అయిల్ దొంగతనానికి గురైతే చివరకు తీవ్రంగా నష్టపోయేది రైతాంగమమేనని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరిగాక పోలీసులు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకుని సొత్తు రికవరి చేస్తున్నారని, అయితే దొంగతనాలు జరగకుండా ముందస్తుగా అడ్డుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. లిఫ్టల వద్ద తప్పనిసరిగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు నీటిని ఆదా చేస్తూ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**రైతులకు పోలీసుల అండ... జిల్లా ఎస్‌పి కె.నర్సింహా**

దేశానికి వెన్నుముకైన రైతన్నలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు వైర్లు, ఆయిల్ , ట్రాన్స్‌ఫార్మరప్ల ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. రైతుల మధ్య ఐక్యమత్యం, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. పోలీస్ శాఖ తరుపున లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు.

**లిఫ్టలను సొంత ఆస్తిగా భావించాలి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి**

ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత అస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. లిఫ్టలలో దొంగతనాలు జరిగితే సాగు నీరు అందక రైతులే నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయ రంగానికి నిరంతరం నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపై తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని, ఎస్‌పి కె.నర్సింహాను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సిఈ నాగభూషణం, విద్యుత్ డిఈ రామ్మోహన్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ కవిత, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## 'సర్' ప్రక్రియ చివరి మూడు రోజులు కీలకం

ఒక్క ఓటూ తొలగిపోకుండా చూడాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో చివరి మూడు రోజులు కీలకమని, ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తపై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, నల్గొండ పార్లమెంట్ సర్ ఇన్చార్జి బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువు ఆగస్టు 3తో ముగియనుండటంతో మిగిలిన సమయంలో క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి బల్మూరి వెంకట్ పాల్గొన్నారు. వారితో పాటు కె. శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మిర్యాలగూడ నియోజకవర్గ సర్ ఇన్చార్జి షబ్బీర్ అలీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియపై అత్యధిక సమీక్షలు నిర్వహిస్తూ, నిత్యం పర్యవేక్షణ చేస్తున్న ఏకైక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అని అభినందించారు. సర్ విజయవంతంలో ఎమ్మెల్యే పర్యవేక్షణ కీలకమని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో వలస ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ ఇప్పటికే 86 శాతం నమోదు పూర్తి చేసి జిల్లాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నామని, మిగిలిన అర్హులందరినీ గుర్తించి వంద శాతం పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్ లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, ఇంచార్జులు, బిఎల్ఎ లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగం ప్రజాసేవకు అంకితం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీసు ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన గొప్ప బాధ్యత అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధత,నిజాయితీ,క్రమశిక్షణతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఎఎస్‌ఐ ఎన్.ప్రభాకర్,ఎఆర్‌హెడ్ కానిస్టేబుల్ బి. మోహన్ రావు,హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. హిదాయత్ అలీ లకు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఘనంగా సన్మానించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులకు శాలువా కప్పి,జ్ఞాపిక అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన ఈ అధికారులు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎఎస్‌పి రమేష్, ఎఓ శివ ప్రసాద్,ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ జంగయ్య, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## వచ్చే సంక్రాంతి నాటికి ఆయిల్‌పామ్ కంపెనీ సిద్ధమవ్వాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దు




**ప్రజాపక్షం/హాలియా:** వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తేవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.గురువారం అనుముల మండలంలోని యాచారం గ్రామంలో 39 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈపామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణాన్ని వేగవంతం చేసి సంక్రాంతి నాటికి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.నిర్మాణ యంత్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ఏర్పాటు, ప్రాసెసింగ్ విభాగాలు, పార్కింగ్, ప్రధాన ప్రవేశ ద్వారం తదితర అంశాలను పరిశీలించి కంపెనీ ప్రతినిధులతో ముచ్చటించారు. జిల్లాలో పామాయిల్ పండించే రైతులకు మార్కెట్ సమస్య లేకుండా ఈప్రాసెసింగ్ యూనిట్ కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలో ఈ కంపెనీ ఏర్పాటు వలన రైతులు పామాయిల్ సాగుపై మొగ్గు చూపే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు ఇప్పటికే కంపెనీకి సంబంధించిన పనులు 90 పూర్తయ్యాయని సివిల్ పనులు మరింత వేగంగా చేపడుతున్నామని తెలిపారు.నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా త్వరగా పనులు పూర్తి చేసి రైతులకు సంక్రాంతి నాటికి ఈ కంపెనీని అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి టి.శేఖర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్,శాస్త్రవేత్త రాములమ్మ,పతంజలి ప్రతినిధులు సంఘం కుమార్, యాదగిరి, బొబ్బిలి వినాయక ఉన్నారు.



## దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సమాజంలో పేదలు, కార్మికులు మరియు రైతులపై దోపిడీ, అసమానతలు కొనసాగుతున్నంత కాలం కమ్యూనిస్టుల పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. గురువారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిల్లాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సిపిఐ సీనియర్ నాయకులు మేకల రాములు సంస్మరణ సభకు పల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పరిస్థితులలో దేశంలో కమ్యూనిస్టుల ఆవశ్యకత పెరిగిందని,. ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. అమర వీరుల స్ఫూర్తితో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పల్లా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో రాజకీయపొత్తులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు వెనకాడబోమన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మేకల రాములు పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పనిచేసే రాచకొండ ప్రాంతంలో దొరల భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాడని కొనియాడారు. గిరిజన తండాలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పాలకుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించేవారన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు సిపిఐ ఇచ్చిన పోరాట పిలుపుల్లో ముందుండే వారని, పాలకులు తనపై మోపిన అక్రమ కేసులకు భయపడకుండా జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడేవారన్నారు. ఆయన పోరాటస్ఫూర్తితో జిల్లాలో కమ్యూనిస్ట్ కార్యకర్తలు ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాలా దామోదర్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు సిపిఐలో చేరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సర్పంచ్ ముత్యాల ఆంజయ్య, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి.జగన్, పాండు రంగారావు, ప్రవీణ్, పరమేష్‌తో పాటు రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డిండి పేరును దేశవ్యాప్తం చేసిన అథ్లెటిక్ ప్రవళిక

**ప్రజాపక్షం/డిండి:** ఇటీవల కాలంలో చైనాలో నిర్వహించిన మొదటి ఏసియు అండర్ 23 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 4400 రిలేలో భారత దేశం తరుపున స్వర్ణ పతాకం సాధించిన డిండి పరుగుల రాణి నారిమళ్ళ ప్రవళికను గురువారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు సభ్యులు నారిమల్ల ప్రవళిక, కోచ్ పరశురాములు లను శాలువాతో సన్మానించారు. డిండి గ్రామం పేరును దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ప్రవళిక వారి తల్లిదండ్రులతో పాటు కోచ్‌కు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేశారు.



## కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం నిధులు మంజూరుకు కృషి

అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు సహకరిస్తా : ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి హామీ

మర్యాదపూర్వకంగా కలిసిన కోదాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నాలుగు కోర్టు కాంప్లెక్స్‌ల భవన నిర్మాణానికి త్వరితగతిన కోర్టు కాంప్లెక్స్‌ల భవన నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయిస్తానని, అలాగే స్థానికంగా అదనపు జిల్లా న్యాయస్థానం (అడిషనల్ డిస్ట్రిక్ కోర్టు) ఏర్పాటుకు కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ బాడీ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయిస్తామన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు అవసరమని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతేకాకుండా అర్హులైన న్యాయవాదులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానిపాషా, ట్రెజరర్ కోదూరు వెంకటేశ్వరరావు, కల్చరల్ సెక్రటరీ గాలి శ్రీనివాసనాయుడు, మహిళ ప్రతినిధులు ధనలక్ష్మి, హేమలత, దుర్గ, పెద్దబ్బాయి, శ్రీను, నాగులుపాషా, సీతరామరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రణాళికలు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు** : మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భువనగిరి నల్లగొండ జిల్లా వైద్యశాఖ ఉన్నత అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో అధికార ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఉన్నత అధికారులకు పలు సూచనలు చేశారు.సబ్ సెంటర్లు పీహెచ్‌సిలు సిహెచ్‌లు ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, సిబ్బంది,సాంకేతిక పరికరాలు, కావలసిన నిధులకు సంబంధించిన వివరాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు, నాంపల్లి, పీహెచ్‌సిల ఆధునీకరణతోపాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్ ని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాలకల్పన పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్ చండూరు రెవిన్యూ కేంద్రంలో వంద పడకలతో ఏరియా ఆసుపత్రి మంజురు నిర్మాణం, గట్టుపల్ పీహెచ్‌సి కి సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పనకు కావలసిన అంచనాలు రూపొందించాలన్నారు.చౌటుప్పల్ లో జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హావర్లో హైదరాబాదు తీసుకెళ్లలేకపోతున్నారని ఈలోపే చాలామంది మరణిస్తున్నారని చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం ట్రామా కేర్ సెంటర్‌ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రామా కేర్ సెంటర్ తో పాటు చౌటుప్పల్లో వంద పడకల ఏరియా ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి సాంకేతిక పరికరాల కల్పనతో ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్ష సమావేశం లోనల్లగొండ జిల్లా డిఎంహెచ్‌ఓ రాహుల్, డిసిహెచ్ మాత్రు నాయక్,యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎంహెచ్‌ఓ మనోహర్,డిసిహెచ్ సూర్య శ్రీలతో పాటు మర్రిగూడ చౌటుప్పల్ ,చండూరు మునుగోడు,నాంపల్లి ,మర్రిగూడ వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ**: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, దేవరకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో ఖిల్లాబజార్, బొడ్రాయి బజార్, పాత పోలీస్టేషన్, మసీద్ ముందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను, ముత్యాలమ్మ బజార్‌లో నిర్మిస్తున్న మురికి కాలువల పనులను ఎంఎల్ఏ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నజీర్ అహ్మద్, రాంసింగ్, సంబంధిత శాఖల అధికారులు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





దెబ్బతిన్న సర్వీస్ రోడ్డును పరిశీలించిన మంత్రి వివేక్

**ప్రజాపక్షం / చెన్నూర్/రామకృష్ణాపూర్ :** ప్రస్తుతం కురుస్తున్న వర్ష పరిస్థితులలో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలి గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. కోటపల్లి మండలం అలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మారంతయ్య ఇంటి గోడ కూలడంతో గాయపడిన ఆత్రం లక్ష్మి, ఆత్రం అనిల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వర్షాల వల్ల కలిగే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. చెన్నూర్ ని యోజకవర్గ పరిధిలోని చెన్నూర్, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్లకు ముందస్తు చర్యలపై ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఎ. భాస్కర్, జిల్లా వైద్య ఆ రోగ్య శాఖాధికారి నరేందర్ రాథోడ్, ఆర్‌ఎంఓలు భీష్మ, శ్రీధర్, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బపల్లి–జిఆర్‌ఎం టౌన్‌షిప్‌ను కలిపే నేషనల్ హైవే–363 సర్వీస్ రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాన్ని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం పరిశీలించారు. వర్షపు నీటి ప్రవాహానికి రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు, కౌన్సిలర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి దెబ్బతిన్న సర్వీస్ రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని, శాశ్వత పరిష్కారంగా బాక్స్ కల్వర్ట్ నిర్మించి లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే కేంద్ర రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి రఘునాథ్ రెడ్డి, వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రభాకర్ శ్రీనివాస్, మల్లేష్, నాయకులు గోపతి భానేష్, గోపు రాజం పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా ప్రజలకు భారీ వర్షాలు, వరదల కారణంగా ఏవైనా ఇబ్బందులు కలిగినట్లయితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 9100577132 ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే కాల్స్ స్వీకరిస్తారని వివరించారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఎవరికైనా ఇబ్బందులు కలిగినట్లయితే పై కంట్రోల్ రూమ్ నంబరును సంప్రదించి సహాయం పొందవచ్చునని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## వర్షానికి కూలిన ఇండ్లు



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు దాసరి గంగయ్య అనే వికలాంగుడి ఇల్లు కూలిపోయింది. ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కష్టపడి కట్టుకున్న ఇలా ఆకస్మాత్తుగా కూలిపోవడంతో అయన భావోద్వేగానికి గురయ్యాడు. నా ఆర్థిక పరిస్థితి బాగాలేక ఏళ్లనుండి బాధపడుతున్నాను అని కన్నీరుపెట్టుకున్నాడు. అదేవిధంగా మండల బోగాడ గ్రామపంచాయతీ లోని కుచ్చిర్కాల తండాకు చెందిన కందారేనాందేవ్ ఇల్లు కూలిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## నిజామాబాద్‌లో అదుపులోనే వర్షం పరిస్థితి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. వర్షాలతో జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించడం జరుగుతుందన్నారు. భారీ వర్ష సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులను, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాలతో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు. వర్షాలతో జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ 08462220183 కు సమాచారమందించాలని ప్రజలను సూచించారు.

## అత్యవసరమైతేనే అధికారులు సెలవులు తీసుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు మినహా అధికారులు సెలవులు తీసుకోవద్దని సూచించారు. గురువారం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా వర్ష పరిస్థితులను తెలుసుకున్న కలెక్టర్, కలెక్టరేట్‌లో 9391942254 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లలో ప్రజలు నివసించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే శానిటేషన్, ఫాగింగ్, బ్లీచింగ్, విద్యుత్ భద్రత, వైద్య సేవలు, పాముకాటు మరియు సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీఒలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శిథిలావస్థ ఇండ్లల్లో ఉండొద్దు

మున్సిపల్ కమిషనర్ సాయికుమార్



**ప్రజాపక్షం/నర్సాపూర్:** ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు శిథిలావస్థకు చేరిన పాత ఇండ్లలో ఉండవద్దని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ సూచించారు. గురువారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి శిథిలావస్థకు చేరిన పాత ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత ఇండ్లలో నివసించే వారు మరమ్మత్తులు చేయుటకు లేదా కూల్చి వేయుటకు సూచించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే మున్సిపాలిటీ ద్వారా ఏర్పాటుచేసిన రిహాబిలిటేషన్ సెంటర్ కు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరెంటు స్తంభాలను, నీటి కుంటలకు శిథిలావస్థలో గల గోడలు ఇండ్ల పరిసరాలలో ఎవరు సంచరించవద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ప్రజలకు తెలియజేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో భారీ వర్షం వల్ల నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్ సిబ్బంది చేత నీటిని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు రాములు, శానిటరీ ఇంచార్జ్ నల్ల మురళి, మోహన్, వర్క్ ఇన్స్పెక్టర్ భూపాల్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుడికి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల కొట్టం నిర్మించుకున్న కొండపల్లి గ్రామానికి చెందిన మెంగని భోయినా నారాయణకు రూ.60 వేల చెక్కును సర్పంచ్ అన్నం గణపతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద రంగాన్ని ప్రోత్సహించి రైతులకు, పశుపోషకులకు అదనపు ఆదాయం సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభిస్తున్న సౌకర్యాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, పశ్లాల పురుషోత్తం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటరు నమోదు ప్రక్రియ

ఎమ్మెల్సీ దండే విఠల్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అధికారులకు సూచించారు. కాగజ్ నగర్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డిఒ సిహెచ్. కృష్ణయ్యతో కలిసి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు, డబుల్ ఓట్ల గుర్తింపు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి బిఎల్‌ఒ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం ఆర్‌డిఒ కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి అనిత, కౌన్సిలర్లు, సూపర్వైజర్లు, బిఎల్‌ఓలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా అధికారులు జాగ్రత్త

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రపర్చాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. నాలాలు సరిగా లేని చోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధిక వర్షపాతం నమోదైనప్పుడు నాలాలు వెంటనే శుభ్రం చేయాలన్నారు. నీరు నిండిన చోట తోడేందుకు భారీ మోటార్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.

# నిర్మల్ జిల్లాలో చేపల వేటపై నిషేధం

గోదావరి, చెరువులు, వాగుల వద్దకు వెళ్లొద్దు

ఆదేశాలు ఉల్లంఘిస్తే లైసెన్సులు, సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు

జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్. అవినాష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాగల రెండు మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లకూడదని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.అవినాష్ హెచ్చరించారు. ముఖ్యంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంతో పాటు జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కాలువల వద్ద చేపల వేటపై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని, సరదాగా ఈత కొట్టడానికి కూడా నీటి వనరుల వద్దకు వెళ్లకూడదని ఆయన స్పష్టం చేశారు. చెరువులు, కుంటల వద్ద చేపలు పట్టేందుకు అమర్చిన జాలీలు, వలలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి వేటకు వెళ్తే సంబంధిత మత్స్యకారుల లైసెన్సులతో పాటు మత్స్య పారిశ్రామిక సంఘాల రిజిస్ట్రేషన్లను కూడా రద్దు చేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి పరివాహక మండలాల్లోని గ్రామాలు, నివాస ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల ద్వారా టామ్ వేయించి ప్రజలకు, మత్స్యకారులకు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రభుత్వం, మత్స్యశాఖ జారీ చేసిన ఈ భద్రతా నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించి సహకరించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

## కుండపోత వర్షానికి కూలిన ఇల్లు



**ప్రజాపక్షం / కౌటాల :** కౌటాల మండలంలోని తాటినగర్ గ్రామంలో కుండపోత వర్షానికి జుమ్మడి లహంచు అనే రైతు మట్టి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. రాత్రి సమయంలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వర్షం ధాటికి ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు, గృహోపకరణాలు శిథిలాల కింద పడి దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. నివాసం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం, అధికారులు ఆదుకుని నష్టపరిహారం అందించాలని కోరారు.

## వరద ఉధృతిని పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్ బ్రిడ్జిపై నీటి ప్రవాహాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్ తో కలిసి వెళ్లి వంతెన వద్ద భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, వంతెనలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. హెచ్చరిక బోర్డులు, బారికేడ్లను గమనిస్తూ అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, కౌన్సిలర్లు, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, రూరల్ సిఐ హనుక్, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాగులు, కల్వర్టులు దాటే సాహసం చేయొద్దు

భారీ వర్షాల దృష్ట్యా పాఠశాలలకు సెలవు

కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు, ఆలూరి వాగుల వరద ప్రవాహాన్ని గురువారం ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, కల్వర్టులను దాటే సాహసం ప్రజలు, వ్యవసాయదారులు, పశువుల కాపరులు చేయవద్దని సూచించారు. ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రదేశాల వద్ద రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు సిబ్బందిని కాపలాగా ఉంచామని, ఎవరినీ దాటడానికి అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని కోరారు. తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, బాధితులు 8500844365 నంబరును సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేథ్యంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తమతమ కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి జిల్లాలో భారీ వర్షాలతో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వర్షాలతో ఆటంకాలు ఏర్పడితే, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెం. 08462220183 కు ఫోన్ చేసి సమాచారం తెలుపాలని ప్రజలకు సూచించారు. చెరువులు, వాగులు, ప్రాజెక్టులు వద్ద పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని హితవు పలికారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరాకు, రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నుండి వరదజలాలు ప్రవహిస్తున్న ప్రాంతాల మీదుగా రాకపోకలను ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలన్నారు. ఇదిలా ఉండగా భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను జిల్లాలో పక్కాగా నిర్వహించాలని ప్రభుత్వ సలహాదారు సుద ర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుడి గల్లంతు కాకుండా సమగ్ర పరిశీలన చేయాలన్నారు. అదే సమయంలో డబుల్ ఓట్లు, చనిపోయిన శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు జాబితాలో లేకుండా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో డిఆర్‌ఒ గీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదూ నమోదు

కలెక్టర్ ప్రతీక్ జైన్


**ప్రజాపక్షం/సంగారెడ్డి :** భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగ పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు ,సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబందిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు భారీ వర్షాల కారణంగా ఏలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి, అంతరాయాలు, చెట్లు కూలిపోవడం ,విద్యుత్ సమస్యలు , ఇతర ప్రమాదాలకు సంబందించి సమాచారాన్ని 084455276155 నంబర్‌కు వెంటనే తెలియజేయాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించడానికి సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబందిత తహసీల్దార్‌కు పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్ ,అగ్నిమాపక తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అవసరం లేనప్పుడు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాగులు, చెరువులు, వరద, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదని అదికార యం త్రాంగం జారీ చేసే సూచనలు ,హెచ్చరికలను తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

# ఓటమి మంటలు...పాలకవర్గంపై ప్రతీకారమా?

కమిషనర్ తీరుపై విమర్శలు

పోలీస్ స్టేషన్‌కు చేరిన మున్సిపల్ వివాదం

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్/ మంచిర్యాల :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, పాలకవర్గం మధ్య నెలకొన్న వివాదం జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిలవాల్సిన మున్సిపల్ కార్యాలయం కాస్తా ఆధిపత్య పోరుకు నిలయంగా మారగా, రోజురోజుకు ముదురుతున్న విభేదాలు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ వరకు చేరడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మున్సిపల్ కమిషనర్ తీరుపై పాలక మండలి సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం, మరోవైపు అధికార కాంగ్రెస్ నాయకులు అధికారులకు బాహాటంగా మద్దతుగా నిలవడం వెనుక రాజకీయ ప్రతీకార కోణం ఉందనే చర్చ జిల్లావ్యాప్తంగా జోరందుకుంది. గత ఫిబ్రవరి 11న జరిగిన క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 22 వార్డులకు గాను సిపిఐ, బిఆర్‌ఎస్ కూటమి 14 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజార్టీ సాధించింది. కాంగ్రెస్ పార్టీ 7 స్థానాలకే పరిమితమైంది. అనంతరం చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహణ విషయంలో వివాదం నెలకొనడంతో సిపిఐ, బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏప్రిల్ 4న బిఆర్‌ఎస్ కౌన్సిలర్ జి. సంధ్యారాణి చైర్‌పర్సన్‌గా, సిపిఐ కౌన్సిలర్ ఎం. సరిత వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. జూలై మొదటి వారంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్. మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులకు సహకరించడం లేదని, ఎన్నికైన పాలకవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని వారు పేర్కొంటున్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలన సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అనంతరం విషయం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. కమిషనర్ తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. మరోవైపు కమిషనర్ కూడా తమపై జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.కాంగ్రెస్ మద్దతుతో రాజకీయ చర్చ



వివాదం పోలీసుల పరిశీలనలో ఉండగానే రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి కమిషనర్‌కు మద్దతు ప్రకటించారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌కు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే, కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా మద్దతు ప్రకటించడంపై పాలకవర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఎన్నికల్లో ఎదురైన ఓటమి నేపథ్యంలో రాజకీయ ప్రభావంతోనే తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా, రాజకీయ విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో పరిపాలన పక్కకు పోయి ప్రజా సమస్యలు గాల్లో దీపాల్లా మారాయనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అధికారుల తీరు, రాజకీయ నాయకుల ప్రతీకార చర్యల నడుమ మున్సిపల్ అభివృద్ధి ఎంతవరకు సాగుతుందో వేచి చూడాల్సిందే.

"శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది."

రీల్



## 'మార్కండేయ'గా హీరో విక్రాంత్

సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు హీరో విక్రాంత్. ఈ సినిమాతో విక్రాంత్ నటనకు మంచి పేరొచ్చింది. సంతాన ప్రాప్తిరస్తు సినిమా థియేట్రికల్ గా మంచి విజయాన్ని సాధించింది. ఒటిటిల్లోనూ ప్రేక్షకుల ఆదరణ పొందింది. డిస్నీ హాట్ స్టార్, ప్రైమ్ వీడియోలో ఈ సినిమా 200 మిలియన్స్ మినిట్స్ వ్యూస్ దక్కించుకుని కొన్ని వారాల పాటు ట్రెండింగ్ లో నిలిచింది. ఈ సినిమా విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో హీరో విక్రాంత్ ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. విక్రాంత్ ప్రస్తుతం ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సంస్థ దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్ లో మార్కండేయ అనే డివోషనల్ మిస్టికల్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. దిల్ రాజు డ్రీమ్స్ సంస్థ తొలి సినిమా హీరో విక్రాంత్ కావడం విశేషం. ఈ సినిమా త్వరలో చిత్రీకరణ జరుపుకోనుంది. మార్కండేయ సినిమా హీరో విక్రాంత్ కు మంచి ఫేమ్ తీసుకురానుంది. ఈ సినిమాతో పాటు హీరో విక్రాంత్ మధుర శ్రీధర్ రెడ్డి ప్రొడ్యూసర్ సురేశ్ బాబు కాంబినేషన్ లో ఓ ఇంట్రెస్టింగ్ హారర్ కామెడీ చిత్రంలో నటించబోతున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలను మేకర్స్ వెల్లడించనున్నారు. మార్కండేయ, మధుర శ్రీధర్ రెడ్డి సురేశ్ బాబు కాంబో మూవీస్ తో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా విక్రాంత్ ఎదుగుతాడనే అంచనాలు ఏర్పడుతున్నాయి. విక్రాంత్ హీరోగా మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ ఆయనకు డీల్ రాజు నిర్మాణ సంస్థ జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'నన్నే నన్నే' పాట ఆవిష్కరణ



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీ కాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రాతిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష్ రెడ్డి కొనిరెడ్డి సమర్పణలో శ్రేష్ఠ కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేవీస్‌ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గదలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఆనంద్ దేవరకొండ చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్ చేశారు. శ్రవణ్ భరద్వాజ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు విజయ్ కుమార్ ఫైజెంట్ లిరిక్స్ అందించారు. కపిల్ కపిలన్ రిపీటెడ్ గా వినాలనిపించేలా పాడారు. 'నన్నే నన్నే' పాట ఎలా ఉందో చూస్తే..'నా ప్రాణం నీవే, నా ధ్యానం నీవే, నా మౌన గానం ఇకపై నీవే, నా స్నేహం నీవే, నా మోహం నీవే, నా తీరని దాహం ఇకపై నీవే, నా లోకం నీవై మసినిన్నావే, మాలోకం గాన్నే మహా మెచ్చావే, నా గుడి దేవతవై ఒకటయ్యావే, విడదగుల ప్రేమే ప్రకటించావే,నన్నే నన్నే మనిషిగా గుర్తించావే, నన్నే నన్నే మార్చేశావే, మన్ను, మిన్ను కలిపేలా పైవాడే, నన్నూ నిన్నూ కలిపాడే..' అంటూ హీరోయిన్ పట్ల హీరో ప్రేమారాధనా చూపిస్తూ ఆకట్టుకునేలా సాగుతుంది . ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ రాజు అద్దాల, ఎడిటర్ సత్యగిడుతూరి, డిఓపి శివ కృష్ణ, మ్యూజిక్ శ్రావణ్ భరద్వాజ్.



## 'బలగం' నటులు ప్రధాన పాత్రలో 'పళ్ళబురుసు'

వేపపుల్లతో పళ్లు తోముకుంటున్న వ్యక్తిని చూసి గ్రామస్తులు 'పళ్ళబురుసు తెలిదా?' అని ప్రశ్నించడంతో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ ఒక్క ప్రశ్న ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. టీజర్ ముందుకు సాగే కొద్దీ విచిత్రమైన పాత్రలు, సరదా సంభాషణలు, ఊహించని మలుపులు కనిపిస్తాయి. అయితే 'పళ్ళబురుసు' అంటే ఏమిటన్న మిస్టరీని మాత్రం అలాగే కొనసాగిస్తూ మరింత క్యూరియాసిటీని పెంచుతుంది. ఫోక్ కార్టూన్ 'కొత్త సోకు' పాటకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత, 'పళ్ళబురుసు ' చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేసింది. యువసామ్రాట్ నాగచైతన్య లాంచ్ చేసిన ఈ టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతూ, ప్రేక్షకులను వినోదభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేసింది.కామెడీ, భావోద్వేగాలు, పల్లెటూరి నేపథ్యాన్ని మేళవించిన 'పళ్ళబురుసు' మంచి విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజువల్స్, ఆకట్టుకునే హాస్యం, ఉత్సాహభరితమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఇప్పటికే 'కొత్త సోకు' పాటతో ఆకట్టుకున్న 'పళ్ళబురుసు' గ్రామీణ వాతావరణాన్ని ఈ టీజర్ మరింత బలంగా చూపించింది. నాగచైతన్య టీజర్‌ను విడుదల చేయడంతో సినిమాకు మరింత క్రేజ్ ఏర్పడింది. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పళ్ళబురుసు' చిత్రానికి ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## 'భోగి' భారీ క్లైమాక్స్ పూర్తి



శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది. తాజాగా చిత్ర యూనిట్ భారీగా రూపొందించిన 22 రోజుల క్లైమాక్స్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.ప్రొడక్షన్ డిజైనర్ కిరణ్ కుమార్ మన్నె రూపొందించిన భారీ సెట్లో ఈ క్లైమాక్స్‌ను చిత్రీకరించారు. ఈ ఒక్క షెడ్యూల్ కోసం దాదాపు మూడు నెలల పాటు ప్రత్యేకంగా ప్రీప్రొడక్షన్ పనులు నిర్వహించడం, మేకర్స్ ఈ సినిమాను ఎంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారో తెలియజేస్తోంది.భారీ యాక్షన్ ఎపిసోడ్లో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ క్లైమాక్స్‌కు ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ను డిజైన్ చేశారు. థియేటర్లలో ప్రేక్షకులకు గూస్బంప్స్ ఇచ్చే స్థాయిలో ఈ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతుంది. సినిమాలో 'గంగ' అనే పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్న శర్వా తన కెరీర్లోనే గుర్తుండిపోయే పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ పాత్ర కోసం ప్రతిరోజూ రెండున్నర గంటలకు పైగా ప్రత్యేక మేకప్ వేసుకోవడం, షూటింగ్ అనంతరం మరో గంటపాటు మేకప్ తొలగించే టఫ్ ప్రాసెస్ ను ఆయన పూర్తి అంకిత భావంతో చేశారు. అద్భుతమైన విజువల్స్‌తో తెరపై ఆవిష్కరిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో తన మాస్ బిజిఎమ్, ఎమోషనల్ స్కోర్‌తో యాక్షన్ సన్నివేశాలను మరింత ఎలివేట్ చేయనున్నారు.అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం 1960 నేపథ్యంలో తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులోని ఓ ఫిక్షనల్ విలేజ్ లో సాగుతుంది. గ్రామీణ నేపథ్యం కథగా రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## 'నేను నా లల్లీ' ఆడియో విడుదల



దర్శకనిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ'. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కార్యాలయంలో సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా 'నేను నా లల్లీ' ఆడియో విడుదల జరిగింది. బిగ్ సీడీని లాంచ్ చేసిన దర్శకుడు రాజవన్నెం రెడ్డి మాట్లాడుతూ 'నేను నా లల్లీ' చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. పాటలు చాలా బావున్నాయి. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని కలగజేసింది. హీరో ఎన్.ఎన్.ఆర్. చౌదరి ఈ సినిమా ద్వారా బాలయ్య బాబుని మరోసారి గుర్తు చేస్తారు. చక్కటి నటనతో ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకోవడం ఖాయం అన్నారు. నటుడు అదిరే అభి మాట్లాడుతూ సినిమా ట్రైలర్ చూశాను. అదిరిపోయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంది. సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని అందించాలని కోరారు. విజన్ వి.వి.కె హౌసింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సీఎండి వి. విజయకుమార్ మాట్లాడుతూ 'నేను నా లల్లీ' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు ఎంతగానో ప్రశంసల వర్షం కురిపించారు. చిత్రం అందర్నీ అలరించే విధంగా రూపుదిద్దుకుంది. హీరో చౌదరి చక్కటి నటనతో అలరించి ప్రేక్షకుల మనసు దోచుకుంటారు. సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న గట్టి నమ్మకం నాకుంది తెలిపారు. వి. మహాలక్ష్మి మాట్లాడుతూ సినిమా ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే విధంగా తెరకెక్కింది. దర్శకనిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ' ఘన విజయాన్ని సాధించాలని యూనిట్ సభ్యులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. హీరోయిన్ తస్లీమ్ మాట్లాడుతూ ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది అన్నారు.

## 'రామాయణ: పార్ట్ –1' ట్రైలర్ వచ్చేసింది



నితీశ్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియో డిఎన్ఇజి , యశ్ మానస్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న 'రామాయణ పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని అంతర్జాతీయంగా సోనీ పిక్చర్స్, ఉత్తర భారతదేశంలో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనున్నాయి. 'నమిత్ మల్హోత్రా 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. జూలై 30 తెల్లవారుజామున విడుదలైన ఈ ట్రైలర్ హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విజనరీ మేకర్ నమిత్ మల్హోత్రా నుంచి ప్రపంచంలోనే అత్యంత శాశ్వతమైన మహాకావ్యాల్లో ఒకటైన రామాయణం ఆధారంగా ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించారు. శ్రీరాముడు గా రణ్బీర్ కపూర్, రావణుడు గా యశ్, సీత గా సాయి పల్లవి, లక్ష్మణుడు గా రవీ దూబే, ఈ చిత్రంలో శ్రీరాముడి తండ్రి దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్, నటి శోభన కైకేయిగా , అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా, కునాల్ కపూర్ ఇంద్రుడిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖగా, నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలైన హాన్స్ జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## నాంపల్లి కోర్టుకు హాజరైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోవిడ్ నిబంధనలు ఉల్లంఘన కేసులో గురువారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం కోర్టు కు హజరయ్యారు. తద్వారా తనకు న్యాయస్థానాలు, చట్టం పట్ల అపారమైన గౌరవం ఉందని ఆయన చాటుకున్నారు. నాటి కొత్తగూడెం బిఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు (రాఘవ) వేధింపుల కారణంగా నాగ రామకృష్ణ కుటుంబ ఆత్మహత్యాయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి సాహితిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శ సమయంలో కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారంటూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం భట్టి విక్రమార్కపై కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించి నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు (ఎక్సైజ్ కేసెస్) విచారణ నిమిత్తం స్వయంగా డిప్యూటీ సిఎం హాజరయ్యారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఒక సాధారణ పౌరుడిలా ఆయన కోర్టు కు హాజరు కావడం అందరినీ ఆకర్షించింది.

# కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు

## ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఘనంగా ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేకమయ్యారు. మొదటి దశలో కరీంనగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉపాధి కోసం చింతకుంట, ఒద్యారం, కొత్తపల్లి ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వచ్చే కార్మికులు, ఉద్యోగులు, అలాగే వాగేశ్వరి, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు కూడా సిటీ బస్సు సేవలను విస్తరిస్తామని ప్రకటించారు. ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే ఒకే రూట్‌లో అదనపు బస్సులు నడపడంతో పాటు, 24 గంటల సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దశలవారీగా సిటీ బస్సు సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ, పి, ఏఎమ్ & లీగల్) కె. రాజశేఖర్ రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి బావ్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, డిపో మేనేజర్లు ఐ. విజయమాధురి (కరీంనగర్–1), ఎం. శ్రీనివాస్ (కరీంనగర్–2), ఎ. ప్రకాశ్‌రావు (సిరిసిల్ల), బి. శ్రీనివాస్ (వేములవాడ), ఎన్. రమేశ్ (జగిత్యాల), డి. హరి (మెట్‌పల్లి)తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 30న రెండో విడతగా రూ.2 వేల కోట్లు, గురువారం మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేసి మొత్తం రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపును ప్రభుత్వం పూర్తి చేసింది.ఈ నిధులతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. మిగిలిన ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేసింది. నిధుల విడుదల పట్ల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఇచ్చిన హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఉద్యోగ జెఏసి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిరోధక సవరణ బిల్లుపై రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో సందోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్ట వశాత్తు కేంద్రంలో హృదయం లేని ప్రభుత్వం ఉన్నదని, మోదీ ప్రభుత్వానికి లీకేజీ, లాఠీఛార్జి మాత్రమే తెలుసునని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థులపై దాష్టీకంపై కేంద్ర మంత్రి అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఢిల్లీలోనే కాకుండి వివిధ ప్రాంతాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారని, సభలో చర్చలో పాల్గొన్న ప్రతి ఒక్క అధికార పార్టీ సభ్యుడు విద్యార్థులను అవమానిస్తూ, అవహేళన చేస్తూ మాట్లాడడాన్ని ఆయన తప్పుబట్టారు. ఒకవైపు విద్యార్థుల ఆందోళన న్యాయమైనదేనని ప్రధాన మంత్రి అంటున్నారని, వారితో కేంద్ర మంత్రి నడ్డా చర్చలు జరిపారని, మరోవైపు సభలో మాత్రం విద్యార్థులను అవమానించటమేమిటని ప్రశ్నించారు.

**విద్యార్థులను డబ్బు యంత్రాలు చేశారు**

నీట్‌ను నిర్వహించే ఎన్‌టిఎ సంస్థ సొసైటీ రిజిస్ట్రేషన్‌ల చట్టం కింద కేవలం రూ.50 చెల్లించి రిజిస్టర్ అయిందని, అది పార్లమెంటుకు ఎలా జవాబుదారీగా ఉంటుందని సందోష్‌కుమార్ విమర్శించారు. దేశంలో రాజకీయ పార్టీలకు, కోచింగ్ మాఫియా మధ్య అపవిత్ర బంధం ఉందన్నారు. తక్షణమే నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష విద్యార్థులందరికీ సమానవకాశాలు కల్పించదని, రాష్ట్రా సిలబస్ చదివిన విద్యార్థులు.. సిబిఎస్ఇ చదివిన విద్యార్థులతో పోటీ పడలేరని చెప్పారు. కాబట్టి నీట్‌ను రద్దు చేయాలన్నారు. కోచింగ్ సెంటర్‌లపై నియంత్రణ లేకుండా పోయిందని, అవి విద్యార్థులను డబ్బు యంత్రాలుగా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కోచింగ్ సెంటర్‌లపై నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## 'చందా చోర్, గద్దీ ఛోడ్'

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఆందోళనలో విద్యార్థి నిరసనకారులపై ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించమని భద్రతా సిబ్బందికి ఇచ్చిన ఆదేశాలను సూచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రామ మందిరంలో విరాళాల చోరీ ఆరోపణలు, గత వారం విద్యార్థుల నిరసనల సమయంలో వారి పట్ల అమానుషంగా ప్రవర్తించడం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెడతామని ఇండియా ఇండియా కూటమి స్పష్టం చేసింది.

**హాకీ జట్టు జెర్సీకి కాషాయ రంగు :** మండిపడ్డ విపక్ష ఎంపిలు భారత హాకీ జట్టు జెర్సీ రంగును కాషాయ రంగులోకి మార్చడంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రతిపక్ష నాయకులు మండిపడ్డారు. భారత సైన్యం యూనిఫాం కూడా మార్చివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రతిచోటా కాషాయ రంగును రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయని వారు ఆరోపించారు. భారత పురుషుల, మహిళల హాకీ జట్లు తమ సాంప్రదాయ నీలి రంగు కిట్‌లకు బదులుగా కాషాయ రంగు జెర్సీలను స్వీకరించిన నేపథ్యంలో పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రభావంతో కూడిన విద్యా విధానం ద్వారా ప్రభుత్వం యూనిఫాంలను, చరిత్రను కూడా మార్చవచ్చని, అయితే ఈ విషయాలపై యువత అభిప్రాయాలను అర్థం చేసుకోవడం చాలా అవసరమని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. 'ఈ దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటం సత్యం, అహింస ఆధారంగా జరిగింది. అందులో ఆర్ఎస్ఎస్ ప్రమేయం ఎక్కడా లేదు' అని ఆమె అన్నారు. దేశం సత్యాన్ని గుర్తిస్తోందని, అలా గుర్తించని వారు బిజెపి–ఆర్ఎస్ఎస్‌ల అసలు ఉద్దేశాలను గ్రహించడం ప్రారంభిస్తున్నారని ఆమె అన్నారు. బిజెపి ప్రతీదాన్నీ కాషాయీకరించాలని చూస్తోందని, హాకీ జెర్సీని మార్చిన తర్వాత సైన్యం యూనిఫాంను కూడా మార్చవచ్చని కాంగ్రెస్ ఎంపి అమర్ సింగ్ ఆరోపించారు.ఈ చర్య చాలా దురదృష్టకరమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ రాజకీయ పార్టీ కూడా అటువంటి చిహ్నాలను మార్చకూడదని సింగ్ నొక్కి చెప్పారు. ఈ వివాదం బిజెపి 'సంకుచిత భావజాలాన్ని' ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ నాయకుడు తారిఖ్ అన్వర్ కూడా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 'అది విద్యారంగమైనా లేదా ఇతర రంగాలైనా, ప్రతిచోటా ఒక నిర్దిష్ట భావజాలాన్ని రుద్దే ప్రయత్నం జరుగుతోంది. ఈ వివాదం ఆ సంకుచిత ఆలోచనా విధానానికి ప్రతీక' అని ఆయన అన్నారు. టిఎంసి నాయకుడు కీర్తి ఆజాద్ మాట్లాడుతూ, 'ఆరెంజ్ రంగు, గ్రీన్ రంగుల విషయానికొస్తే, అది అంత ముఖ్యం కాదు. మైదానంలో ప్రదర్శనకే ప్రాధాన్యత ఇవ్వాలి. క్రికెట్‌లో కూడా మేం తెల్లటి దుస్తుల్లోనే ఆడేవాళ్లం. విజయం రంగుల వల్ల రాదు; అది ప్రదర్శన వల్ల వస్తుంది. గుర్తుంచుకోండి, మీరు గుడికి, మసీదుకు, గురుద్వారాకు లేదా చర్చికి వెళ్లి, వంద రూపాయలు సమర్పించి, 'దేవా, రేపు నేను సెంచరీ చేసేలా సహాయం చేయి' అని ప్రార్థించవచ్చు. కానీ అది జరగదు. కాబట్టి, ఇది దుస్తుల రంగుకు సంబంధించిన విషయం కాదు; ఇది క్రీడలో మీ సామర్థ్యానికి సంబంధించినది' అని అన్నారు. అయిత సాంప్రదాయ నీలిరంగు జెర్సీని మార్చాల్సిన అవసరాన్ని ఆజాద్ ప్రశ్నించారు

## రూ.803 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

విష్ణువర్ధన్ రెడ్డిలు గురువారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్ఆర్‌డిలోని బోధి సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్‌లో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని ఆయన తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు.రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది.ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది.పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది.గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్‌పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టి నీటి వనరులను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించింది.మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com